www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 222 | సోమవారం 04-02-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

జడ్జీల కొరతతో పెండింగ్ భారం

- సీజేఐ రంజన్ గొగోయ్ వెల్లడి
- న్యాయ వర్సిటీ ఇవ్వండి : చంద్రబాబు
- రాజధానిలో తాత్కాలిక హైకోర్టు ప్రారంభం
- హైకోర్టు శాశ్వత భవనాలకు శంకుస్థాపన



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : జడ్జీల కొరతతో దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో మూడుకోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయనీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గొగోయ్ చెప్పారు. అమరావతి పరిధి నేలపాడులో హైకోర్టు శాశ్వత భవనాల నిర్మాణాలకు సీజేఐ రంజన్ గొగోయ్, ఏపీ సీఎం చంద్రబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. రంజన్ గొగోయ్, రూపాంజలి గొగోయ్ దంపతులు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అదే ప్రాంతంలో 4.65 ఎకరాల పరిధిలో నిర్మించిన హైకోర్టు తాత్కాలిక భవనాన్ని రంజన్ గొగోయ్ ప్రారంభించారు. కోర్టు గదులు పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో నిర్మితమవుతోన్న జస్టిస్ సిటీ, అసెంబ్లీ, సెక్రటేరియట్‌తోపాటు పలు అభివృద్ధి పనుల వివరాలు తెలిపే ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం జరిగిన సభలో సీజేఐ రంజన్ గొగోయ్ మాట్లాడుతూ 81లక్షల కేసులు ఏడాదిలోపువి కాగా మరో 25లక్షల కేసులు పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 50లక్షల కేసులు పూర్తిగా చిన్నస్థాయివేనన్నారు. పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని న్యాయమూర్తులను ఆదేశించారు.

దేశంలో ఐదు వేల జిల్లాస్థాయి జడ్జి పోస్టులు, 400 హైకోర్టు జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దీనిలో 130 పోస్టుల భర్తీ ప్రక్రియ జరుగుతోందన్నారు. మరో వంద పోస్టుల భర్తీ అంశం సుప్రీంకోర్టు కొలీజియమ్ పరిశీలనలో ఉందన్నారు. 14 పోస్టుల భర్తీ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందన్నారు. మిగిలిన పోస్టులకు సంబంధించిన నివేదికలు - మిగతా 2 లో

కాటేసిన కరెంట్

నలుగురి దుర్మరణం

అరటిగెలలు కోస్తుండగా షాక్ కొట్టి
మృతులంతా ఒకే కుటుంబసభ్యులు



విశాలాంధ్ర-లావేరు (శ్రీకాకుళం) : శ్రీకాకుళం జిల్లాలో ఘోరం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందారు. ఈ ఘటన ఆదివారం లావేరు మండలం తామాడ పంచాయతీ కొత్త రౌతుపేట గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం మృతులు అబోతుల రాము(50), అబోతుల పుణ్యవతి(43), రౌతు బంగారమ్మ(48), కొమ్ము వెంకన్న(49) అరటి గెలలు కోస్తుండగా, విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యారు. కొమ్ము వెంకన్న కుమారునికి వివాహం నిశ్చయమైంది. ఆ ఇంట పెళ్లిపనులు జరుగుతున్నాయి. అరటి గెలల కోసం భార్యాభర్తలైన అబోతుల రాము, పుణ్యవతి, ఆమె సోదరుడు కొమ్ము వెంకన్న, బంగారమ్మ అరటి తోటకు వెళ్లారు. ముందుగా కొమ్ము వెంకన్న, అబోతుల రాము అరటి గెలలు కొడుతుండగా పక్కనే ఉన్న టాన్స్‌ఫార్మర్ పెద్దలైను హెచ్‌టీ లైను మీదపడింది. దీంతో విద్యుత్ ఒక్కసారిగా ప్రవహించి కొమ్ము వెంకన్న, - మిగతా 2 లో

దోపిడీకి చౌకీదారు



- మోడీని ఎన్నికల్లో ఓడిస్తాం
- ఎన్డీయే పాలనలో అన్ని వ్యవస్థలూ ధ్వంసం
- బీజేపీ, తృణమూల్ ఒకే నాణేనికి రెండు బొమ్మలు
- కోల్‌కతా ర్యాలీలో సురవరం, ఏచూరి

11లో

కార్పొరేట్‌శక్తులు, దోపిడీదార్లకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'చౌకీదార్ (కాపలావ్యక్తి)'గా ఉన్నారని వామపక్ష నాయకులు విమర్శించారు. దేశాన్ని కాపాడేందుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ కాపలాదారుడిని ఓడిద్దామని పిలుపునిచ్చారు. ఎన్డీయే పాలనలో మతోన్మాదం పడగవిప్పుతోందని విమర్శించారు.



కోల్‌కతాలోని బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్స్‌లో వామపక్షాల భారీ ర్యాలీ. వేదిక నుంచి అశేష ప్రజానీకానికి అభివాదం చేస్తున్న వామపక్ష నాయకులు, హాజరైన కార్యకర్తల్లో ఓ భాగం

ఖాళీ కుండలతో మోడీకి నిరసన

- ఈవీఎంలపై అందరికీ అనుమానాలు
- ఊపందుకున్న డబ్బు రాజకీయాలు
- సీపీఎం, జనసేనతో కలిసి మూడో ప్రత్యామ్నాయం
- సింగపూర్ కంపెనీల పెద్దన్న చంద్రబాబు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

విశాలాంధ్ర-ఒంగోలు : గుంటూరు పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి ఖాళీ కుండలతో నిరసన తెలపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపిచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని అమరావతి శంకుస్థాపనకు వచ్చిన మోడీ.. నాడు ముంతడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని రామకృష్ణ - మిగతా 2 లో

బ్యాలెట్ బడ్జెట్

లోగుట్టు వడ్డీకెరుక



భారం రూ.6.65 లక్షల కోట్లు

- ఏడాదిలో 15.65 శాతం పెరుగుదల
- రూ.97.97 లక్షల కోట్ల అప్పు అంచనా
- వచ్చే ఆదాయం రూ.21.41 లక్షల కోట్లే
- కీలకరంగాల ఖర్చు రూ.21.48 లక్షల కోట్లు
- మరింత దిగజారనున్న దేశ ఆర్థిక పరిస్థితి

విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి : లోగుట్టు పెరుమాళ్లుకెరుక అన్న చందంగా మారింది మోడీ సర్కార్ బ్యాలెట్ బడ్జెట్. ఎన్నికల నేపథ్యంలో ప్రతిపాదించిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలకంటే ఓట్ల వరాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే దేశం సుమారు రూ.90.56 లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. ఇది మార్చి 2020నాటికి రూ.97.97 లక్షల కోట్లకు పెరిగే అవకాశం ఉన్నట్లు కేంద్రం అంచనా వేసింది. ఈ నెల ఒకటిన పార్లమెంట్‌లో రూ.27.84 లక్షల కోట్ల అంచనాతో ఆర్థికశాఖ ఇన్‌చార్జి మంత్రి పీయూష్ గోయల్ 2019-20 మధ్యంతర బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న అప్పులకే మోడీ సర్కార్ ఏటా రూ.5.75 లక్షల కోట్ల వడ్డీని చెల్లిస్తోంది. దేశీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి పెద్ద మొత్తంలో అప్పు పుచ్చుకోగా, విదేశీ సంస్థల నుంచి సైతం రూ.2.50 లక్షల కోట్లపైనే కేంద్రం అప్పు చేసింది. ఏటా - మిగతా 2 లో

వృద్ధుడిపై చింతమనేని చిందులు 3లో



చలి చంపుతోంది 12లో

ఇదీ లోకం!



అనాధీనం పరాధీనమేనా?



- 22ఏ జాబితాలోకి చేర్పింపు
- 2015లోనే చేర్చిన చంద్రబాబు సర్కార్
- గద్దల్లా అధికార పార్టీ నేతలు
- డీనోటిఫికేషన్ కోసం టీడీపీ నేతల ఒత్తిడి
- వీటి విలువ సుమారు రూ.3,500 కోట్లు

జిల్లాలో అనాధీనం భూముల వివరాలు

మండలం	భూములు (ఎకరాలు)
మాకవరపాలెం	91.83
కోటవురట్ల	671.45
ఎస్ రాయవరం	1101.75
అచ్యుతాపురం	1212.09
రాంబిల్లి	1133.37
నర్సీపట్నం	172.40
నాతవరం	1203.13
గొలుగొండ	1251.20
రోలుగుంట	411.50
రావికమతం	3.79

విశాలాంధ్రబ్యూరో-విశాఖ సిటీ : అనాధీనం భూములు అన్యాక్రాంతానికి రంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు కాకపోయినప్పటికీ ఎవరూ క్లెయిమ్ చేయని కారణంగా వాటిపై కబ్జాదారుల కళ్లు పడ్డాయి. రెవెన్యూశాఖ వద్ద వీటికి సంబంధించిన రికార్డులు లేని కారణంగా ప్రభుత్వంలో తమకున్న పలుకుబడిని ఉపయోగించుకొని అధికార పార్టీ నేతలు కబ్జా చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. విశాఖ జిల్లాలో ఎవరూ క్లెయిమ్ చేయని అనాధీనం భూములు 7458.51 ఎకరాలు ఉన్నాయి. వీటిలో - మిగతా 2 లో



టీమిండియా..

నయా చరిత్ర..!

52 ఏళ్ల తరువాత కివీస్ గడ్డపై చారిత్రక గెలుపు

న్యూజిలాండ్‌పై టీమిండియా చరిత్ర సృష్టించింది. 52 ఏళ్ల తరువాత 4-1 తేడాతో సిరీస్ చేజిక్కించుకుంది. ఈ మ్యాచ్‌లో అంబటి రాయుడు కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. టాపార్డర్ కుప్పకూలిన వేళ జట్టును ఆదుకున్నాడు. మిడిలార్డర్‌లో హార్దిక్ పాండ్య న్యూజిలాండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తనపై వచ్చిన అపవాదు నేపథ్యంలో కసిగా ఆడాడు. ఇక ఈ సిరీస్‌లో ఆద్యంతం ఆకట్టుకున్న షమీ... మరోసారి న్యూజిలాండ్ వెన్ను విరిచి రాణించాడు. మణికట్టు మాంత్రికుడు చాహల్ కూడా బౌలింగ్‌లో సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌లో టాపార్డర్ విఫలమవగా, మిడిలార్డర్ జట్టును ఆదుకుంది. దీనికి తోడు బౌలింగ్ విభాగం కూడా రాణించడంతో టీమిండియాకు చరిత్రాత్మక విజయం దక్కింది. 12లో



ఇరాన్ క్రూయిజ్ మిస్సైల్ ప్రయోగం

దుబాయ్ : ఇరాన్ కొత్త క్రూయిజ్ మిస్సైల్‌ని తాజాగా ప్రయోగించింది. ఇస్లాం దినోత్సవం సందర్భంగా జరిగిన వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ మిస్సైల్‌ని ప్రయోగించినట్లు ప్రభుత్వ టెలివిజన్ తెలిపింది. 1979లో ఇస్లాం విప్లవం చోటుచేసుకున్నది. ఇది మధ్యతరహా రేంజ్ మిస్సైల్. 1300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఇది చేరుకోగలదు. మిస్సైల్ ప్రయోగానికి తక్కువ సమయంలోనే సిద్ధం చేయవచ్చునని, తక్కువ ఎత్తులో ఇది ప్రయాణించగలదని, మిస్సైల్‌ని ప్రయోగించిన రక్షణ శాఖ మంత్రి అమీర్ హతామి తెలిపారు. భూమి పైనుంచి భూమిపైకి ప్రయోగించనున్న మిస్సైల్‌కి హోవెయి జెహ్యా అని పేరు పెట్టినట్లు ఆయన వెల్లడించారు. సౌమర్ తరహా క్రూయిజ్ మిసైల్‌ల మాదిరిగానే తాజా మిస్సైల్ ఉంటుంది. అయితే, ఇరాన్ తమ మిస్సైల్‌ల శక్తిసామర్థ్యాలను ఎక్కువచేసి చెప్పుకుంటున్నదని పశ్చిమ దేశాల నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

క్రూయిజ్ మిస్సైల్‌లకు అవసరమైన జెట్ ఇంజన్ల రూపకల్పనలో మొదట కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి ఉత్పత్తి చేసినట్లుగా రివల్యూషనరీ గార్డ్స్ ఏరో స్పేస్ డివిజన్ అధిపతి అమీరాలి హాజి జదేహ్ తెలిపారు. జనవరిలో ఈ మిస్సైల్‌ని ప్రయోగించాలని ఇరాన్ భావించింది. అమెరికా చేసిన హెచ్చరికలను కూడా ఇరాన్ పట్టించుకోలేదు. బాలిస్టిక్ మిస్సైల్‌ల ద్వారా అణ్వాయుధాలను పంపేందుకు వీలైన కార్యక్రమాలను చేపట్టకుండా కనీసం 8 ఏళ్లు సంయమనం పాటించాలని ఇరాన్‌ను ఐరాస భద్రతామండలి కోరింది. 2015లో ఇరాన్‌తో అమెరికా తదితర దేశాలు చేసుకున్న అణుఒప్పందం సందర్భంగా భద్రతా మండలి ఈ హెచ్చరిక చేసింది. ఒప్పందం నుంచి అమెరికా గత ఏడాది వైదొలిగింది.

విశాలాంధ్ర ప్రపంచం

మదురో అనుకూల, ప్రతికూల ర్యాలీలు

అధ్యక్షుడికి 90 శాతం సైన్యం తోడ్పాటు

మదురో ప్రభుత్వాన్నే గుర్తిస్తామన్న ఐరాస





కారకస్ : వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో ప్రభుత్వాన్ని కూల్చేసేందుకు అమెరికా అండతో జరిగిన తిరుగుబాటు యత్నం విఫలమైన విషయం తెలిసిందే. తిరుగుబాటు వెనుక అమెరికా కుట్రదాగివున్నదని స్పష్టంగా తెలుస్తోంది. జాతీయ అసెంబ్లీ నాయకుడు జువాన్ గుయిడో అమెరికా అండతో తిరుగుబాటుకు ప్రయత్నించి తాను తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారు. ఈ ఘటన తరువాత మదురోకు అనుకూలంగా దేశవ్యాప్తంగా శనివారం ప్రదర్శనలు జరిగాయి. కారకస్‌లోనూ మదురో అనుకూల, వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. మదురో రాజీనామా కోసం గుయిడో ఈ నెల 12వ తేదీన కూడా ర్యాలీ నిర్వహిస్తానని ప్రకటించారు. గుయిడోను అధికారికంగా గుర్తిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించగా, మదురో ప్రభుత్వాన్ని తాము గుర్తిస్తున్నామని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. తాజాగా ఎయిర్‌ఫోర్స్ జనరల్ గుయిడోకు తోడ్పాటు ప్రకటించినప్పటికీ 90 శాతానికి పైగా సైన్యం మదురోకు అండగా నిలిచింది. దేశాధ్యక్షుడుగా పనిచేసిన హ్యూగో చావెజ్ మరణం తరువాత మదురో పాలనాబాధ్యతలను స్వీకరించారు. ర్యాలీనుద్దేశించి మదురో ప్రసంగిస్తూ, 2020లో నిర్వహించవలసి వున్న జాతీయ అసెంబ్లీ ఎన్నికలను ఈ ఏడాదే జరిపేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అమెరికా తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు చాలా కాలంగా ప్రయత్నిస్తూనే ఉన్నది. ఎన్నికలలో జాతీయ అసెంబ్లీలో మెజారిటీ సాధించిన ప్రతిపక్షం, అధ్యక్షుడి ఎన్నికను ఖాతరు చేయకపోవడం విశేషం. 150 మంది అంతర్జాతీయ పరిశీలకులు అధ్యక్ష ఎన్నికల సందర్భంగా దేశానికి వచ్చారు. వీరిలో ఐక్యరాజ్య సమితి బృందం కూడా ఉన్నది. ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఈ బృందం కూడా తెలిపింది. అయినప్పటికీ అమెరికా దాని అండతో తిరుగుబాటుకు యత్నించిన గుయిడో వాటిని గుర్తించేందుకు నిరాకరిస్తున్నారు. గుయిడో నాయకత్వంలో జరిగిన ర్యాలీలో ఆయన భార్య కూడా పాల్గొన్నారు. ఎక్కువగా ముడిచమురును ఉత్పత్తిచేసే దేశాల్లో వెనిజులా ఒకటి. అక్కడి ముడిచమురును ఎలాగైనా తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు అమెరికా ప్రభుత్వం తిరుగుబాటుకు కుట్రపన్నిందనేది వాస్తవం.

బ్రెగ్జిట్ విఫలమైతే దాడులకు అవకాశాలు

సురక్షిత ప్రాంతానికి రాణి ఎలిజబెత్?



లండన్ : యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలిగేందుకు బ్రెగ్జిట్ ఒప్పందం కుదరకపోయినా, ఒప్పందరహితంగా బ్రిటన్ వైదొలిగినా దేశంలో దాడులు జరిగే ప్రమాదం ఉందని ఆదివారం రెండు వార్తా పత్రికలు హెచ్చరించాయి. ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యే సూచనలుంటే రాణి ఎలిజబెత్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించాలని బ్రిటన్ అధికారులు యోచిస్తున్నట్టుగా ఆ పత్రికలు తెలిపాయి. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలోనూ రాణిని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

ఒప్పందం లేకుండా వైదొలిగితే, పౌరుల మధ్య తీవ్ర ఘర్షణ నెలకొనే అవకాశం ఉందని ఆ పత్రికలు పేర్కొన్నాయి. ప్రభుత్వ మంత్రివర్గ కార్యాలయం వర్గాలను ఉటంకిస్తూ సండే టైమ్స్ ఈ వార్తను ప్రచురించింది. లండన్ నుంచి రాణి ఎలిజబెత్‌తో పాటు కుటుంబ సభ్యులందరినీ సురక్షిత ప్రాంతానికి తరలించే ప్రణాళికను రూపొందించినట్టుగా ఆదివారం ది మెయిల్ పత్రిక తెలిపింది. బ్రెగ్జిట్ ఒప్పందానికి పార్లమెంట్ ఆమోదం పొందడంలో ప్రధాని థెరిస్సా మే ప్రభుత్వం విఫలమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, వాణిజ్యవర్గాలు కలిసి ఒప్పందరహితంగా వైదొలిగేందుకు తాత్కాలిక ప్రణాళికలు రూపొందించినట్టు పత్రికలు పేర్కొన్నాయి. కొత్తగా కస్టమ్స్ తనిఖీలను అమలుచేయడం ద్వారా ఈయూ నుంచి దిగుమతులు ఎక్కువ జాప్యం జరిగితే విస్తృతంగా ఘర్షణలు జరిగే అవకాశం ఉందని వాణిజ్య గ్రూప్‌లు హెచ్చరించాయి. ఆహారం, ఔషధాల కొరత కూడా ఏర్పడవచ్చు. గత నెలలో 92 ఏళ్ల ఎలిజబెత్ మాట్లాడుతూ, బ్రెగ్జిట్‌పైన రాజకీయ నాయకులంతా ఒక ఒప్పందానికి రావాలని కోరారు. ఒప్పందంరహిత బ్రెగ్జిట్ ఉంటుందని అధికారులు అనవసరంగా భయోత్పాతాన్ని ప్రజలలో సృష్టిస్తున్నారని కన్జర్వేటివ్ పార్టీ ఎంపీ జాకబ్ రీస్-మాగ్ మెయిల్ విలేకరులతో అన్నారు. దేశంలో కల్లోల పరిస్థితులు ఏర్పడితే రాణి కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడం తప్పదని గతంలో రాణి కుటుంబానికి రక్షణ విభాగ అధికారిగా పనిచేసిన డేవిస్ తెలిపారు.

ఐఎన్ఎఫ్ నుంచి వైదొలిగితే ముప్పు



బీజింగ్ : మధ్యతరహా రేంజ్ అణుశక్తి ఒప్పందం (ఐఎన్ఎఫ్) నుంచి అమెరికా వైదొలగడం ప్రమాదకరమైన పరిస్థితులను సృష్టిస్తుందని చైనా హెచ్చరించింది. ఈ ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్టు అమెరికా శనివారం ప్రకటించింది. తక్షణం అమెరికాతో ఈ అంశంపై గల విభేదాలను పరిష్కరించుకునేందుకు రష్యా చర్చలు జరపాలని చైనా సూచించినట్టుగా రష్యా వార్తా సంస్థ టాస్ తెలిపింది. చైనా విదేశాంగ శాఖ ఇందుకు సంబంధించిన ప్రకటనను విడుదల చేసింది. ఆ శాఖ ప్రతినిధి జంగ్ షియాంగ్ మాట్లాడుతూ, ఆయుధ నియంత్రణకు, నిరాయుధీకరణకు కుదిరిన ఈ ద్వైపాక్షిక ఒప్పందం అత్యంత ముఖ్యమైనదని, ఆయా దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు ఈ ఒప్పందం కీలకమైన పాత్ర నిర్వహిస్తుందని అన్నారు. ఇది అంతర్జాతీయ, ప్రాంతీయ శాంతిని పెంచుతుందని, ప్రపంచ వ్యూహాత్మక సమతుల్యతను, సుస్థిరతను పరిరక్షిస్తుందని ఆయన చెప్పారు. ఒప్పందం నుంచి అమెరికా ఉపసంహరించుకోవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. నిర్మాణాత్మక చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అమెరికా నిర్ణయం వల్ల తీవ్ర ప్రతికూల ప్రభావాలు కలుగుతాయని, ఈ పరిణామాలను తాము నిశితంగా పరిశీలిస్తున్నామని చైనా పేర్కొన్నది. ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉండడంలేదన్న ఆరోపణ చేస్తూ అమెరికా వైదొలిగింది. 2014 జూలైలో రష్యా మొదటిసారిగా ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అమెరికా ఆరోపించింది. అమెరికా నిర్ణయం కారణంగా రెండు దేశాల మధ్య తిరిగి ఆయుధ పోటీ ప్రారంభమవుతుందని, ప్రచ్ఛన్న యుద్ధంనాటి పరిస్థితి తిరిగి తలెత్తవచ్చునని భావిస్తున్నారు. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలోనే ఈ ఒప్పందం కుదిరింది. ఐఎన్ఎఫ్ ఒప్పందం నుంచి వైదొలుగుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత ఏడాదే ప్రకటించారు. 1987లో సోవియట్ యూనియన్, అమెరికా మధ్య కుదిరిన ఈ ఒప్పందం క్రింద భూమిపైన 500, 5500 కిలోమీటర్ల రేంజ్ వరకు ప్రయోగించే మిస్సైలీలను నిషేధించాలని నిర్ణయించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్, సోవియట్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మైఖేల్ గోర్బచేవ్ సంతకం చేశారు.

సామ్రాజ్యవాదుల జోక్యాన్ని నిలువరించాలి

ప్రపంచ దేశాలకు క్యూబా పిలుపు



హవానా : స్వతంత్ర దేశమైన వెనిజులా అంతర్గత వ్యవహారాలలో సామ్రాజ్యవాద దేశం అమెరికా జోక్యాన్ని నిలువరించేందుకు ప్రపంచ దేశాలు తగినవిధంగా స్పందించాలని క్యూబా విజ్ఞప్తి చేసింది. ఆ దేశ అధ్యక్షుడు నికొలస్ మదురో ప్రభుత్వాన్ని తొలగించేందుకు అమెరికా తిరుగుబాటు కుట్రకు పాల్పడిందని క్యూబా పేర్కొన్నది. తిరుగుబాటు విఫలయత్నం వెనుక అమెరికా కుట్ర దాగివున్నది. తనతో కలసి రావాలని ఐరోపాను కూడా ఒత్తిడి చేస్తోంది. సైనిక చర్యకు పాల్పడాలని కూడా అమెరికా భావిస్తోంది. అందువల్ల సామ్రాజ్యవాదులు లాటిన్ అమెరికా వ్యవహారాలలో జోక్యం చేసుకోకుండా నిలువరించాలని క్యూబా విదేశాంగ మంత్రి బ్రునో రొడ్రిగుయెజ్ ఫరిల్లా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ట్వీట్ చేశారు. వెనిజులాలో రాజకీయ సంక్షోభం తలెత్తిన సందర్భంగా ఆయన ఆ దేశ అధ్యక్షుడు మదురోకి పూర్తి మద్దతు ప్రకటించారు. తనకు తాను తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకున్న గుయిడోను ట్రంప్ వెంటనే గుర్తించారు. గుయిడో జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడిగా ఉన్నాడు. అమెరికా అనుంగ దేశాలు కూడా కొన్ని గుయిడోను సమర్థించాయి.

అయితే, ఐక్యరాజ్య సమితి మాత్రం మదురో ప్రభుత్వాన్నే గుర్తిస్తున్నామని తాజాగా ప్రకటించింది. అంతేకాదు, వైమానిక దళం నుంచి ఒక అధికారి గుయిడోకు తన తోడ్పాటు అందిస్తున్నానని ప్రకటించినప్పటికీ 90 శాతానికిపైగా సైన్యం మదురోను సమర్థిస్తున్నట్టు ప్రకటించారు. సార్వభౌమాధికారం గల దేశాలలో అమెరికా జోక్యాన్ని మదురో తీవ్రంగా ఖండించారు. చైనా, రష్యా, క్యూబా, మెక్సికో, టర్కీ తదితర దేశాలు మదురోకు అండగా నిలిచాయి. సుదీర్ఘకాలంగా అనేక ఆంక్షలు విధించి వెనిజులా ఆర్థిక పరిస్థితులను తల్లక్రిందులు చేసిన అమెరికా ఇప్పుడు మానవతాదృక్పథంతో ఆ దేశానికి వివిధ రకాల వస్తువులను సహాయంగా పంపుతానని ప్రకటిస్తోంది. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరపవలసిందిగా స్పెయిన్, ఆస్ట్రేలియా, బ్రిటన్ లాంటి దేశాలు మదురోను కోరాయి.

మోడీకి నిరసన

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. నాటి సందర్భాన్ని గుర్తు చేస్తూ...తెలుగు ప్రజల ఆగ్రహం ప్రధానికి అర్థమయ్యేలా ఖాళీకుండలతో స్వాగతం తెలపాలన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగినట్టు అన్ని పార్టీలు చెబుతున్నా బీజేపీ చెవులకు వినిపించకపోవటం దారుణమన్నారు. మధ్యంతర బడ్జెట్‌లోనూ ఏపీకి కేంద్రం తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాల ప్రస్తావన లేదన్నారు. 2014లో ఇచ్చిన హామీలు అమలు చేయలేని బీజేపీ...ఇప్పుడు రైతులకు సాయమంటూ ముందుకొచ్చిందని రామకృష్ణ హేళన చేశారు. రూ.6 వేల సాయం ప్రకటించిన బీజేపీ రైతు భజన చేస్తుంటే రూ.10 వేలు ఇస్తామంటూ చంద్రబాబు డ్వాక్రా మహిళల భజన చేస్తున్నారని అన్నారు. ఈ పథకాలు చూస్తుంటే ప్రభుత్వ పథకాల పేరుతో ఓట్లకు ఇప్పటి నుంచే డబ్బు పంపిణీ చేస్తున్నట్టుగా కనిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి అనుమానం వ్యక్తంచేశారు. చంద్రబాబు సింగపూరు కంపెనీలకే పెద్ద కొడుకని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని కొల్లకొట్టారన్నారు. ఈ డబ్బుతో ఓటుకు రూ.2వేలు పంచడానికి సిద్ధమవుతున్నారన్నారు. బహిరంగంగా ఓట్లకు డబ్బులు పంచుతున్న పాలకులను గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆయారామ్, గయారామ్‌లు ఎక్కువయ్యారన్నారు. సిద్ధాంతాలు, విధానాల ప్రాతిపదికన పార్టీలు మారితే తప్పులేదుగానీ..అధికామే పరమావధిగా పార్టీలు మారటం రాజకీయ వ్యభిచారంతో సమానమని అన్నారు. మీడియా కంట పడకుండా అర్ధరాత్రి కోట్ల సూర్యప్రకాశరెడ్డి కుటుంబంతో సహా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారని, మరుసటి రోజు మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మూడు ప్రాజెక్టులకు ఓకే చెబితే పార్టీలో చేరతానని చెప్పారన్నారు.

అవన్నీ అబద్ధాలని, ఆయన మూడు కోర్కెలు కోరిన మాట నిజమేనన్నారు. తనకు పార్లమెంట్ సీటు, భార్యకు అసెంబ్లీ సీటు, కుమారుడికి మరో అసెంబ్లీ సీటును కోట్ల కుటుంబం ఆశించిందన్నారు. ప్రకాశం జిల్లాలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుటుంబం సైతం నీచరాజకీయాలకు పాల్పడుతోందన్నారు. భార్య ఒక పార్టీ, కొడుకు ఒక పార్టీ, తను మరో పార్టీ అన్న తీరుగా వ్యవహరించటం దుర్మార్గమన్నారు. ఈవీఎంలపై అనుమానాలతో అన్ని రాజకీయ పక్షాలు వాటిని వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనన్నారు. తెలంగాణ ఎన్నికలలో పోలింగ్ అయిన ఓట్లకు, లెక్కింపు ఓట్లకు తేడా ఉండటంతో ఈవీఎంలపై అనుమానాలు పెరిగాయన్నారు. సీపీఐ, సీపీఎం, జనసేన పార్టీలు రానున్న ఎన్నికలలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు స్థానాలలో పోటీ చేస్తాయన్నారు. మూడు పార్టీలు మరోసారి సమావేశమై సీట్ల పంపిణీపై స్పష్టతకు వస్తాయన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, ఎస్‌డీ సర్దార్, పీవీఆర్ చౌదరి ఉన్నారు.

లోగుట్టు వడ్డీకెరుక

(మొదటిపేజీ తరువాయి)

అప్పుల బండ తోపాటే వడ్డీల భారం కూడా పెరుగుతోంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఉన్న అప్పులకు కేంద్రం రూ.5.23 లక్షల కోట్ల వడ్డీ చెల్లించగా, 2018-19లో అది రూ.5.75 లక్షల కోట్లకు (9.94 శాతం) పెరిగింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో అప్పులకు చెల్లించే వడ్డీ రూ.6.65 లక్షల కోట్లగా మోడీ ప్రభుత్వం అంచనా వేసింది. గతేడాదితో పోల్చితే రూ.90 వేల కోట్లు (15.65 శాతం) అధికంగా ఉండటం గమనార్హం. వచ్చే ఏడాది వడ్డీ భారం రూ.1.38 లక్షల కోట్లుగా ఉంటుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే తీసుకున్న అప్పులపై ఏటా ఏడు నుంచి పది శాతాన్ని వడ్డీలకు చెల్లించేందుకే ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజులలో దేశ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీఎస్టీ, ఐటీ పన్నుల కీలకం

అభివృద్ధి, సంక్షేమ పథకాల బడ్జెట్‌ను ఏవిధంగా అధిగమించాలో తర్జనభర్జన పడుతుంటే, ఎన్నికల తాయిలాలకు ఎక్కడ నుంచి నిధులు సమీకరిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొత్త హామీలను నెరవేర్చేందుకు తంత్రాన్ని ప్రదర్శించాలని మోడీ యోచిస్తున్నారు. బడ్జెట్‌కు సమానంగా ఉన్న ఖర్చుల కోసం జీఎస్టీ, ఆదాయపన్ను, కార్పొరేట్ పన్నులను వినియోగించుకునేందుకు ఆయన ప్రణాళిక రచించినట్లు సమాచారం. 2018-19లో జీఎస్టీపై రూ.7.44 లక్షల కోట్ల ఆదాయం రాగా, అది 2019-20లో రూ.7.61 లక్షల కోట్లగా ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. అలాగే కార్పొరేట్ పన్నులు రూ.7.60 లక్షల కోట్లు రావచ్చని భావిస్తోంది. గతేడాది కార్పొరేట్ పన్నుల రూపంలో రూ.6.21 లక్షల కోట్ల ఆదాయం లభించగా, తాజా బడ్జెట్‌లో అది 22.38 శాతం (రూ.1.39 లక్షల కోట్లు) పెరుగనుంది. ఇప్పటికే జీఎస్టీ భారంగా మారిందని కార్పొరేట్‌లు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదాయపన్ను పరిమితిని కేంద్రం పెంచింది. ఆదాయపన్ను (ఐటీ) ఆదాయం రూ.6.20 లక్షల కోట్లు వచ్చే అవకాశం ఉంది. జీఎస్టీ, కార్పొరేట్ పన్ను, ఐటీ ఆదాయం మొత్తం కలిపి రూ.21.41 లక్షల కోట్లు వస్తుందనే తాత్కాలిక బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించింది.

ఆదాయంకంటే ఖర్చే అధికం

కేంద్రానికి వచ్చే ఆదాయంతో పోల్చితే ఖర్చే అధికంగా ఉంది. వాస్తవానికి అప్పుపై చెల్లించే వడ్డీ రూ.6.65 లక్షల కోట్లు, స్థాపన ఖర్చు రూ.5.41 లక్షల కోట్లను తగ్గిస్తే, రూ.6.36 లక్షల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. వడ్డీ, స్థాపన ఖర్చుతోపాటు రక్షణ రంగం వ్యయం రూ.3.05 లక్షల కోట్లు, పింఛన్ల వ్యయం రూ.1.74 లక్షల కోట్లు, గ్రాంట్లు రూ.1.66 లక్షల కోట్లను కలిపితే కేంద్రానికి ఏటా రూ.21.48 లక్షల కోట్ల అభివృద్ధేతర ఖర్చు ఉంటుంది. పలు రూపాలలో వచ్చే ఆదాయం మాత్రం రూ.21.41 లక్షల కోట్లుగా ఉంది. ఇలాంటి పరిస్థితులలో కొత్త హామీల కోసం కేంద్రం మరిన్ని అప్పులు చేయకతప్పదు.

ఆర్థికస్థితిపై తీవ్ర ప్రభావం

ఎన్నికలే ధ్యేయంగా బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ దేశ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపించనుంది. దేశం రూ.100 లక్షల కోట్ల అప్పునకు చేరువలో ఉంది.

ఇలాంటి కష్టకాలంలో ఎన్నికల కోసమని అధికార పార్టీ తాయిలాలతో బడ్జెట్‌ను ప్రతిపాదించటం అనైతికమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎన్నికల హామీల కోసం కేంద్రం కొత్తగా అప్పులు చేయాలని భావించటం చిన్న పిల్లల చేష్టలమాదిరిగానే ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వచ్చే ఏడాది ఈ ప్రభావం దేశంపై చూపించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఎన్నికల హామీల కోసం కొత్త అప్పు చేసేందుకే తాత్కాలిక బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లుగా స్పష్టమవుతోంది.

పెండింగ్ భారం

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టుల నుంచి పంపాల్సి ఉందన్నారు. సుప్రీంకోర్టు కొలీజియమ్ పరిధిలో ఉన్న వంద పోస్టులను మరో మూడువారాల్లో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. తీర్పులు విషయంలో న్యాయమూర్తులు పక్షపాతంగా వ్యవహరించరాదన్నారు. న్యాయవ్యవస్థలో వ్యక్తిగత అభిప్రాయాలకు తావు లేదని ప్రకటించారు.

చంద్రబాబు మాట్లాడుతూ మొత్తం 12లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.732కోట్ల వ్యయంతో హైకోర్టు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామన్నారు. మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలో ఉన్న రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్‌గా విభజించాలని అప్పట్లో పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి సాధించారన్నారు. 1953లో తొలిసారిగా హైకోర్టును గుంటూరులో పెట్టారని, తర్వాత హైదరాబాద్‌కు తరలించారన్నారు. దాదాపు అరవైఏళ్లపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేశామని పేర్కొన్నారు. రాజధాని కోసం 34వేల ఎకరాలను భూ సమీకరణ పద్ధతిలో సేకరించామన్నారు. దీన్ని అభివృద్ధి చేసిన తర్వాత 25 నుంచి 30శాతం వరకు భూమి రైతులకు ఇచ్చేలా ఒప్పందాలు చేసుకున్నామన్నారు. అమరావతిలో రూ.50వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. రెండువేల సంవత్సరాల క్రితం శాతవాహనుల పరిపాలనలో అమరావతి వైభవంగా విరాజిల్లిందని, ఇప్పుడు అమరావతిని అదే తరహాలో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రప్రజలకు సామాజిక, ఆర్థిక న్యాయం లభించేలా కోర్టులు పనిచేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.70 లక్షల పెండింగ్ కేసులను పరిష్కరించాలన్నారు. అమరావతిలో న్యాయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని రంజన్ గొగోయ్‌ను చంద్రబాబు కోరారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎన్‌వీ రమణ, ఆర్.సుభాష్‌రెడ్డి, ఎల్.నాగేశ్వరరావు, ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి పి.ప్రవీణ్‌కుమార్, తెలంగాణ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి టీబీ రాధాకృష్ణన్, శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, రాష్ట్రమంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ, డీజీపీ ఆర్‌పీ ఠాకూర్, సీఆర్‌డీఏ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, గుంటూరుజిల్లా కలెక్టర్ కోన శశిధర్, సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాటేసిన కరెంట్

(మొదటిపేజీ తరువాయి)

ఆబోతుల రాము అక్కడికక్కడే మృతిచెందారు. ఎంతసేపటికి వారు తిరిగి రాకపోవడంతో పుణ్యవతి, బంగారమ్మ అక్కడికి వెళ్లి చూశారు. ఆ ఇద్దరు కరెంట్ తీగలకు అంటుకొని పడి ఉండడంతో వారు కర్రతో తీగలను గట్టిగా కొట్టారు.

దీంతో వీరికి కూడా విద్యుత్ షాక్ తగిలింది. ఒకే కుటుంబంలో నలుగురు మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యుల శోకం వర్ణణాతీతం. విషయం తెలుసుకున్న డీఎస్పీ భీమారావు, జేఆర్ సీఐ విశ్వేశ్వరరావు, ఎస్ఐ చిరంజీవి, తహశీల్దార్ సుధాసాగర్ ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను ఓదార్చారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతుల కుటుంబానికి అండగా నిలుస్తామని ఆర్డీవో రమణ తెలిపారు. పెళ్లింట విషాదంతో కొత్త రౌతుపేట గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు.





'మైనింగ్' గుట్టు రట్టయ్యేనా?

ఐటీ దాడులతో మాఫియాపై ఉచ్చు బిగిస్తుందా?

పలు కీలక పత్రాలు స్వాధీనం

విశాలాంధ్ర ప్రతినిధి - కాకినాడ : తూర్పు కనుమల్లో లాటరైట్, బాక్సైట్ తవ్వకాలు చేపట్టిన మైనింగ్ మాఫియా కోట్ల విలువైన సహజ వనరులను దోచుకుపోయింది. అడ్డగోలుగా మైనింగ్ చేపట్టి ప్రభుత్వ లెక్కల్లో చూపకుండా కొన్ని ఖనిజాలను హరించేసింది. బినామీ వ్యక్తి పేరుతో మైనింగ్ తవ్వకాలకు లీజు అనుమతులు తెచ్చుకుని అనుమతులు లేని భూముల్లో తవ్వకాలు చేపట్టిన మాఫియా వేల కోట్ల రూపాయలు గడించింది. కొన్నేళ్లుగా తూర్పు గోదావరి జిల్లాలో స్థానిక అధికారుల అండదండలతో సాగిన ఈ అవినీతి వ్యవహారాన్ని అప్పట్లో జాయింట్ కలెక్టర్ బట్టబయలు చేసి జరిమానా కూడా విధించారు. ఇటీవల మైనింగ్ తవ్వకాలపై ఐటి శాఖ అధికారులు దాడులు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ గ్రామంలో ఆంధ్రా మినరల్స్ సంస్థ మైనింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. కాంగ్రెస్ హయాం నుండి అడ్డగోలుగా మైనింగ్ తవ్వకాలు చేపట్టింది. న్యూ రిజర్వు ఫారెస్ట్‌లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టడం, అనుమతి లేకుండా రోడ్లు వేసి ఖనిజాలను తరలించేసింది. సుమారు రెండు వందల ఎకరాల్లో మైనింగ్ తవ్వకాలు చేపట్టి కొన్ని లక్షల టన్నుల ఖనిజాన్ని తరలించుకుపోయింది. నిత్యం లారీల రాకపోకలతో ఖనిజాన్ని తరలిస్తున్నారు. దీంతో ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాలు ఎర్ర మట్టితో నిండిపోయి ప్రజలకు అనారోగ్యం పాలు చేస్తున్నా స్థానిక అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. లాటరైట్‌ను తరలిస్తున్న లారీలు ఢీకొట్టి సుమారు 50 మంది స్థానికులు చనిపోయినా ఎటువంటి కేసులూ ఉండవు. ఇలాంటి అక్రమాలు చేపడుతున్న ఆంధ్రా మైనింగ్ సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు రూ. 20 కోట్ల ప్రభుత్వ నిధులు ఖర్చు చేసి రోడ్డు వేయించి లారీలు తిప్పుకోవాలని అనుమతి ఇచ్చేశారు. కానీ పక్కనే ఉన్న ఒమ్మంగి రోడ్డు రిపేర్‌లకు గుర్తైనా పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మైనింగ్ మాఫియాకు అధికారులు, ప్రజాప్రతినిధులు అండదండలు ఇవ్వడంతో మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంది.

అనాధీనం పరాధీనమేనా?

(మొదటిపేజీ తరువాయి)

సగానికిపైగా ఏళ్ల తరబడి ఆక్రమణలోనే ఉన్నాయి. వాస్తవంగా ఈ భూముల్లో నిరుపేదలకు పట్టాలు మంజూరు చేశారు. ఆ తర్వాత టైటిల్ డీడ్స్, పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేశారు. అనంతరం అవి పలువురి చేతులు మారిపోయాయి. కానీ వీటిని నేటికీ రెవెన్యూ రికార్డుల్లో అనాధీనం భూములుగానే పేర్కొంటున్నారు. బ్రిటీష్ హయాంలో 1920లో డిగ్‌లాంట్ రిజిస్టర్‌లో సర్వే నెంబర్లను సబ్‌డివిజన్ చేశారు. ఎవరూ క్లెయిమ్ చేయని భూములను ప్రాంతాల ఆధారంగా చుక్కల భూములుగా, అనాధీనం, గాయిల్, అన్‌ఎసైన్డ్, వేస్ట్ డ్రై భూములుగా విభజించారు. వీటికోసం 1954లో ప్రత్యేకంగా జీవో జారీ చేశారు. దాని ప్రకారం ప్రత్యేకంగా వర్గీకరణ చేశారు. రెవెన్యూశాఖ వద్ద వీటికి సంబంధించిన రికార్డుల్లేని కారణంగా ఈ భూములను టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో నిషేధిత భూముల జాబితా 22ఏలో చేర్చేశారు. జిల్లాలోని మొత్తం అనాధీనం భూములన్నీ నిషేధిత భూముల జాబితాలోనే ఉన్నాయి. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న తమ భూములను 22ఏ జాబితాలో చేర్చడం అన్యాయమని, దాని నుంచి తప్పించాలంటూ సాగుదారులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఈ భూములను 22ఏ జాబితా నుంచి తప్పించాలన్న డిమాండు నాలుగేళ్ల నుంచి ఉంది. ఇవి కాకుండా ఇంకా ఖాళీగా ఉన్న అనాధీనం భూములపైనా టీడీపీ నేతల కన్ను పడింది. ఇవన్నీ 22ఏ జాబితాలో ఉన్నందున అధికారపార్టీ నాయకులు నిరుపేదలను బెదిరించి తమ పరం చేసుకుంటున్నారు. ప్రభుత్వంలో తమకున్న పలుకుబడిని ఉపయోగించి ఆ భూములపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి తీసుకొచ్చారు. చుక్కలు, గాయిల్, అనాధీనం తదితర ఎవరూ క్లెయిమ్ చేయని భూముల విషయంలో ఇప్పటివరకు తుది అధికారం జిల్లా కలెక్టర్లకు ఉండేది. వాటిని అన్యాక్రాంతం కాకుండా ఇన్నాళ్లు కలెక్టర్లు పరిరక్షించగలిగారు. 1954 జీవో ప్రకారం రిజిస్ట్రేషన్ ఆఫ్ హోల్డింగ్ పేరిట రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్నాయి. వాటిని రెవెన్యూకు అప్పగిస్తే అనాధీనం భూములకు హక్కులు కల్పించే వెసులుబాటు కలుగుతుంది. అడంగల్, వన్‌బీలో పేర్లు మార్చే అవకాశం ఉంటుంది. ఇటీవల కేబినెట్ సమావేశంలో రాయలసీమలో ఎక్కువగా ఉన్న చుక్కల భూముల విషయంలో ప్రభుత్వం క్లెయిమ్లు సెటిల్‌మెంట్ అధికారాన్ని కలెక్టర్ల నుంచి ఆర్డీవోలకు అప్పగించారు. చుక్కల భూముల విషయంలో జారీ చేసే మార్గదర్శకాలే అనాధీనం భూములకు వర్తింప చేసేలా ఆక్రమణదారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. అదే జరిగితే అనాధీనం భూములు పూర్తిస్థాయిలో జిరాయితీ భూములుగా మారే అవకాశాలున్నాయి. విశాఖ జిల్లాలో 7458 ఎకరాల్లో సగానికి పైగా భూములు సాగుదారుల ఆధీనంలోనే ఉన్నాయి. వీటిలో సగానికి పైగా టీడీపీ శ్రేణులు తమ పరం చేసుకున్నారు. ఇవి కాకుండా ఖాళీగా ఉన్న మిగిలిన అనాధీనం భూములపైనా హక్కులు పొందేందుకు యత్నిస్తున్నారు. ఇటువంటివన్నీ నర్సీపట్నం డివిజన్‌లోనే ఉన్నాయి. ఇక్కడ ఎకరా రూ.15 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతుంది. ఆ విధంగా చూసుకుంటే ఈ భూముల మార్కెట్ విలువ మూడున్నర వేల కోట్ల పైమాటే. అధికారం ఉండగానే అన్నీ చక్క బెట్టుకోవాలన్న చందంగా టీడీపీ నాయకులు ఈ అనాధీనం భూములు కాజేయాలని చూస్తున్నారు. పాయకరావుపేట, నర్సీపట్నం, యలమంచిలి నియోజకవర్గాల్లోని అధికారపార్టీ నాయకులు ఈ భూముల కోసం ప్రభుత్వస్థాయిలో ఒత్తిడి తీసుకొస్తున్నారు.

సక్రమంగా అమలు కాని రిజర్వేషన్లు

అఖిలపక్ష సమావేశంలో జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దేశంలో 1952వ సంవత్సరం నుంచి రిజర్వేషన్లు సక్రమంగా అమలు కావడంలేదని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ అన్నారు. రిజర్వేషన్ల అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్వేతపత్రాలను విడుదల చేయాలని ఆయన డిమాండు చేశారు. రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్పీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీలకు 33 శాతం, మైనార్టీలకు 8 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలేదన్నారు. ముస్లిం రిజర్వేషన్లపై కోర్టుల్లో కాలయాపన జరుగుతోందన్నారు. న్యాయవ్యవస్థ పరంగా హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో నియామకాల్లో కూడా రిజర్వేషన్లు అమలుకు నోచుకోవడంలేదన్నారు. అలాగే విశ్వవిద్యాలయాలల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉందన్నారు. మొత్తం 1.76 లక్షల టీచింగ్ పోస్టుల్లో కేవలం 7,600 మంది మాత్రమే రిజర్వేషన్ వర్గాలు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. కేంద్ర సంస్థల్లో కూడా రిజర్వేషన్లు అమలు కావడం లేదన్నారు. రిజర్వేషన్లు సాధించుకునేందుకు ఉద్యమబాటే శరణ్యమని జల్లి విల్సన్ స్పష్టం చేశారు.



కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆర్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.నాగరాజు మాట్లాడుతూ రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రాజ్యాగం వ్యతిరేక విధానాలను విడనాడకుంటే ఐక్యంగా ఉద్యమించి రిజర్వేషన్ల వ్యవస్థను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ, సచివాలయ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమేష్, గజిటెడ్ ఆఫీసర్ల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు వామపక్షాల ఖండన

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాలని కోరుతూ పాదయాత్ర చేపట్టిన ఉపాధ్యాయుల అరెస్ట్‌లను సీపీఐ,సీపీఎం రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండించాయి. ఈమేరకు ఆ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు ఆదివారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. లక్షలాది ఉపాధ్యాయ, ఉద్యోగుల భవిష్యత్‌తో ముడిపడిన సీపీఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని వారు డిమాండు చేశారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడమే కాకుండా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. దీర్ఘకాలంగా ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ఆందోళనలు చేపట్టి సీపీఎస్‌ను రద్దు చేయాలని ప్రభుత్వానికి అనేక పర్యాయాలు విన్నవించుకున్నాయన్నారు. అయినా ప్రభుత్వం చలించకపోవడంతో ఆదివారం అన్ని జిల్లాల ఉపాధ్యాయులు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరు, గుంటూరు నుంచి రాజధానికి పాదయాత్ర ప్రారంభించారన్నారు. గుంటూరులో ప్రారంభమైన పాదయాత్రను పోలీసులు అడ్డుకుని నిర్బంధానికి పూనుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కే.ఎస్.లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, నాయకులు నక్కా వెంకటేశ్వర్లు, శ్రీదేవి, సురేష్, రాజా తదితరులతోపాటు 1000 మందికిపైగా ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. అన్ని వర్గాలకు వరాలు ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న చంద్రబాబు పాత పెన్షన్ విధాన్ని పునరుద్ధరించాలన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల కోర్కెలను పెడచెవిన పెట్టడం, ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక ఆలోచనకు అద్దం పడుతోందన్నారు. అరెస్ట్ చేసిన వారి వెంటనే విడుదల చేయాలని, ఇప్పటికైనా ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నాయకులు డిమాండు చేశారు.

కొంగొత్తగా

బెజవాడ రైల్వేస్టేషన్

- 20 అడుగుల సెంట్రల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- గాంధీకొండ వద్ద స్టెయిర్‌వే, పార్కింగ్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : దేశంలోని అతి పెద్ద రైల్వే జంక్షన్లలో రెండో స్థానంలో ఉన్న బెజవాడ రైల్వేస్టేషన్ కొత్త శోభను సంతరించుకుంటోంది. దేశంలోని అన్ని ప్రాంతాలకు అనుసంధా నించడంలో ఈ స్టేషన్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం రోజుకు 250కిపైగా ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు 150 సరుకు రవాణా రైళ్లు ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు లక్ష నుంచి లక్షన్నర మంది ప్రయాణీకుల ఈ స్టేషన్ నుంచి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. సెల వులు, పండుగ రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగు తుంది. మొత్తం 10 ప్లాట్‌ఫారాలు కలిగిన ఈ స్టేషన్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణీకు లను దృష్టిలో పెట్టుకుని ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం నుంచి 7వ నెంబరు ప్లాట్‌ఫారం వరకూ ఉండే పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించి, దాని స్థానంలో 20 అడుగుల వెడల్పుతో సెంట్రల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ఫుట్ బ్రిడ్జి 10వ ప్లాట్‌ఫారంతో ముగియకుండా పశ్చిమవైపు ఉన్న నెహ్రూ రోడ్ మీదుగా గాంధీకొండ సమీపంలోని నక్షత్రశాల వద్ద దిగే విధంగా డిజైన్ చేశారు. దీంతో వన్‌టౌన్ వైపు వెళ్లవలసిన ప్రయాణీకులు రోడ్డు దాటే అవసరం లేకుండా నేరుగా పార్కింగ్ ప్రదేశా నికి చేరుకోవచ్చని అధికారులు తెలిపారు. తూర్పు వైపు ప్రధాన స్టేషన్ భవనం, రెండో స్టేషన్ భవనా లకు సంబంధించి వెలుపల ఉన్న సర్క్యులేటింగ్ ఏరియాలో ఆర్టీసీ సిటీ సర్వీసులు, ప్రైవేటు వాహనాలు, ఆటోలతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతుండడంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు : ధనుంజయులు

ప్రయాణీకుల మౌలిక సదుపాయాల కోసం ఈ ఏడాది రూ.25 నుంచి 30 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) ఆర్.ధనుంజయులు 'విశాలాంధ్ర' ప్రతినిధికి తెలిపారు. ముఖ్యంగా తూర్పు వైపు సర్క్యులేటింగ్ ఏరియా పునరాభివృద్ధి పనుల ద్వారా ట్రాఫిక్ సమస్యలకు చెక్ చెబుతామన్నారు. స్టేషన్ వెలుపలికి వచ్చిన ప్రయాణికులు బస్టాపు, పార్కింగ్ వద్దకు చేరుకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేని విధంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామన్నారు.



మతోన్మాదుల బరితెగింపు

- ప్రశ్నించే గొంతుకలను నులిమేస్తున్నారు
- విద్యారంగాన్ని ప్రభుత్వమే నడపాలి
- ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా మహాసభలో ఈశ్వరయ్య

విశాలాంధ్ర- మదనపల్లె : మతోన్మాద ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, ఏబీవీపీ ఆగడాలు రోజురోజుకు శృతిమించుతున్నాయని, ప్రశ్నించే గొంతుకలను నులిమేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. కార్పొరేట్ దిగ్గజాలకు ప్రధాని నరేంద్రమోడీ ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. తాత్కాలిక తాయిలాలు పక్కనపెట్టి చిత్తశుద్ధి ఉంటే విద్యారంగాన్ని ప్రభుత్వమే నడపాలని సవాల్ చేశారు. అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) చిత్తూరు జిల్లా 22వ మహాసభలో ఆదివారం రెండవరోజు ప్రతినిధుల మహాసభలో ఈశ్వరయ్య ప్రసంగించారు. ముందుగా ఏఐఎస్ఎఫ్ జెండాను జిల్లా మాజీ కార్యదర్శి ఎండీ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈశ్వరయ్యతోపాటు సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి రామానాయుడు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగన్న హాజరయ్యారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ చరిత్రను గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమకాలంలో ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్..నాటి నుంచి అనేక సమరశీల పోరాటాలు నిర్వహించిందన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశం కోసం, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం అలుపెరగని పోరు సాగిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యలతో పాటు దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడటం కోసం సైద్ధాంతిక భావజాలంతో, నిబద్ధతతో పోరాటాలు కొనసాగించాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతుకలను నులిమేస్తున్నారన్నారు. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బీజేపీ, ఏబీవీపీ దేశ ద్రోహులని, వాటి రక్తంలోనే ఆ తరహా భావజాలం ఉన్నదని ఘాటుగా విమర్శించారు. గౌరీలంకేష్, కల్బుర్గి, పన్సారే, రోహిత్ వేముల, అఖ్లాక్‌ల హత్యలను ఉదహరించారు. విద్యాలయాలను మోడీ ప్రభుత్వం కాషాయీకరణ చేస్తోందని, పాఠ్యపుస్తకాల్లో సైతం హిందూ భావజాలాన్ని నింపి.. ఇతర మతాల పట్ల విద్వేషాన్ని నూరిపోస్తోందని ఈశ్వరయ్య ఆరోపించారు. లౌకిక విద్యావ్యవస్థకు తూట్లు పొడుస్తోందన్నారు. ఎన్‌డీఏ పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలు అన్యాయానికి గురయ్యారన్నారు. విద్యాసంస్థల్లో మనువాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారన్నారు. మోడీ పాలనలో ఆవుకు ఉన్న రక్షణ మనిషికి లేదన్నారు. విలువలు, నైతికత పెంచుకోవడానికి మార్క్సిజం, లెనినిజం విద్యార్థులకు ఆయుధమని సూచించారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు క్రిష్ణప్ప, సాంబశివ, మురళి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశికుమార్, శివారెడ్డి, బండి చలపతి, మురళి, రవి, పవన్, మాధవ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చంద్రశేఖర్, రెడ్డెప్ప నాయక్, ప్రజానాట్యమండలి నాయకులు గుర్రప్ప, శివమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ గూండాలను అరెస్టు చేయాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నెల్లూరుజిల్లా గూడూరు మున్సిపల్ కమిషనర్ ఓబులేసును కులంపేరుతో తిట్టి, ఆయనపై దురుసుగా ప్రవర్తించిన టీడీపీ పార్టీ గూండాలను అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి డిమాండు చేశారు.ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ నేతల ఒత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గి, చట్టవిరుద్ధంగా కమిషనర్‌ను బదిలీ చేయడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. బదిలీచేసిన కమిషనర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

రాజధాని భూముల్లో వేర్వేరు ప్యాకేజీలా..!

వైసీపీ బాపట్ల పార్లమెంటరీ సమన్వయకర్త నందిగం సురేష్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధానిలో పట్టాభూములకు, దళితుల అసైన్డ్ భూములకు సీఎం చంద్రబాబు వేర్వేరుగా ప్యాకేజీలు ఇచ్చి, దళితులపై వివక్ష చూపుతున్నారని వైసీపీ బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త నందిగం సురేష్ విమర్శించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రాజధాని ప్రాంతంలో 40శాతం మంది దళితులు, దళిత రైతులున్నారని వివరించారు. ఇక్కడ భూములు సేకరించే సమయంలో దళితులకు చంద్రబాబు ఇచ్చిన హామీల్ని అమలు చేయకుండా మోసగించారని మండిపడ్డారు. పట్టాభూములతో సమానంగా అసైన్డ్ భూములకు ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందన్నారు. పట్టాభూములకు 1450గజాల చొప్పున భూమి ఇచ్చి, అసైన్డ్‌భూములు సాగు చేసుకున్న వారికి కేవలం 600గజాల భూమి పంపిణీ చేశారని పేర్కొన్నారు. దళిత వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

లోపాలు సవరించండి : సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం తుది ఓటర్ల జాబితాలో లోపాలను సవరించి మరో జాబితాను విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు కోరారు. ఈమేరకు ముఖ్య ఎన్నికల అధికారికి ఆదివారం లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకూ నూతన ఓటర్ల దరఖాస్తులను స్వీకరించాలన్నారు. దీనికి భిన్నంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో మాదిరిగానే స్థానిక అధికారులు దరఖాస్తులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మొదటి దశ జాబితోనే సక్రమంగా వెరిఫికేషన్ జరగలేదని పలు ఉదాహరణలు పేర్కొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 4,045 మంది గైర్హాజరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మార్చి-2019 ప్రాక్టికల్ పరీక్షలకు 4,045 మంది గైర్హాజరయ్యారు. మొదటి సెషన్‌లలో 51,529 మంది విద్యార్థులకుగాను 49,170మంది హాజరయ్యారు. మిగిలిన 2359 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో మొత్తం 48,708 మందికిగాను 47,022 మంది పరీక్షలకు హాజరవ్వగా, మిగిలిన 1686 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా మాల్‌ప్రాక్టికల్ కేసులు నమోదవ్వలేదని ఇంటర్మీడియట్ విద్యామండలి కమిషనర్ బి.ఉదయలక్ష్మి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ అభ్యర్థులకు ప్రశాంతంగా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు.

సంస్థ పరిరక్షణకే 6 నుంచి సమ్మె

నేడు ఎంబీ భవన్‌లో రాజకీయ సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆర్టీసీని పరిరక్షించుకోవడం కోసమే ఈనెల 6వ తేదీ నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నట్లు జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సి.హెచ్.సుందరయ్య, వి.వరహాల్‌నాయుడు తెలిపారు. ఈమేరకు ఆదివారం ప్రకటన చేశారు. సమ్మె సన్నాహంలో భాగంగా సోమవారం విజయవాడలోని ఎంబీభవన్‌లో అన్ని రాజకీయపార్టీలు, కార్మిక సంఘాల రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో డిపోల వద్ద మోటార్ బైక్ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించామన్నారు. రాబోయే రోజుల్లో జేఏసీతో యాజమాన్యం చర్చలు జరిపే అవకాశాలు ఉన్నాయని, లేనిపక్షంలో 6వ తేదీ నుంచి సమ్మె కారణంగా ఉత్పన్నమయ్యే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.

డీఎస్సీ ఫలితాలకు అడ్డంకులు..!

- సుప్రీం, హైకోర్టులో కేసులు
- సర్కారుకు న్యాయపర చిక్కులు
- 'ఎన్‌సీఈటీ'కి విరుద్ధంగా పరీక్షలు
- రెండో వారంలో హైకోర్టులో వాదనలు
- స్టే కోసం అభ్యర్థుల న్యాయపోరాటం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ డీఎస్సీ- 2018 పరీక్షలపై అడుగడుగునా న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. జనవరి 31వ తేదీతో డీఎస్సీ పరీక్షలు పూర్తయ్యాయి. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దాదాపు 25వేల పోస్టులకుగాను కేవలం 7,907 పోస్టులకే ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. ఇందులో పాఠశాల విద్యాశాఖ పరిధిలో దాదాపు 4,500 పోస్టులే ఉన్నాయి. పరీక్షలు నిర్వహించిన సిలబస్ ఎన్‌సీటీఈకి విరుద్ధంగా ఉండటంపై అభ్యర్థులు హైదరాబాద్‌లోని ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. ఎన్‌సీటీఈ నిబంధనల్ని డీఎస్సీ పరీక్షల నిర్వహణలో తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. అదే రోజున ఏపీ, తెలంగాణా హైకోర్టులు విడిపోవడంతో ఈ కేసుపై ధర్మాసనం పూర్తి వాదనలను కొనసాగించలేదు. ఈ క్రమంలో డీఎస్సీ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. డీఎస్సీపై హైకోర్టులో పూర్తిగా వాదనలు కొనసాగనందున..మళ్లీ హైకోర్టును ఆశ్రయించాలని జనవరి 31న సుప్రీం అభ్యర్థులకు సూచించింది. దీంతో డీఎస్సీ వివాదం మళ్లీ ఏపీ హైకోర్టు చెంతకు చేరింది. ఈ నెల రెండో వారంలోగా డీఎస్సీపై హైకోర్టులో వాదనలు కొనసాగే అవకాశముంది. నిబంధనలకు విరుద్ధంగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించారని, పరీక్షా ఫలితాలను నిలుపుదల చేయాలని సవాల్‌చేస్తూ..మళ్లీ హైకోర్టును నానాజీ బృందం ఆశ్రయించనుంది.డీఎస్సీ ఫలితాల ప్రక్రియ నిలిచిపోయేందుకు ఎక్కువ అవకాశాలున్నాయని అభ్యర్థులు ఆశిస్తున్నారు.

ఫలితాల విడుదల అసాధ్యమే..!

డీఎస్సీపై హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేసులు కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వం ఫలితాలను ఎలా విడుదల చేస్తుందని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. దీంతో డీఎస్సీ వ్యవహారం ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. న్యాయస్థానం నుంచి స్టే వస్తే..డీఎస్సీ ఫలితాలను నిలుపుదల చేయాల్సి ఉంది. మరో నెలరోజుల్లో ఎన్నికల ప్రకటన వెలువడనుండటంతో ప్రభుత్వం పూర్తిగా ఎన్నికలపైనే దృష్టి కేంద్రీకరించింది.

జీవో నంబరు 15, 16పై అభ్యంతరాలు

డీఎస్సీ పరీక్షలు పూర్తయ్యాక జీవోనంబరు 15, 16 ప్రభుత్వం విడుదల చేసింది. ఆయా ఉపాధ్యాయ పోస్టులకు పోటీపడే వారంతా సంబంధిత డిగ్రీలో స్పెషల్ సబ్జెక్టులు చదివి ఉండాలనేదీ ఈ జీవోల్లోని సారాంశం. వాటిని డీఎస్సీ ప్రకటన సమయంలో వెల్లడించకుండా, నోటిఫికేషన్ సమయంలో విడుదల చేయడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీంతో డీఎస్సీలో అర్హత మార్కులు సాధించిన వారంతా నష్టపోయే ప్రమాదముంది. జంబో డీఎస్సీ ఇస్తామనే ప్రభుత్వ ప్రకటనతో ఏడాది నుంచి టెట్, డీఎస్సీ కోచింగ్‌లకు వేల కొద్దీ డబ్బు ఖర్చుచేశారు. అతి తక్కువగా పోస్టులు ఇవ్వడం, కొన్ని జిల్లాల్లో అసలు పోస్టులే లేకపోవడంపై అభ్యర్థుల నుంచి పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

డీఎస్సీ పోస్టుల ఖాళీలపై సుప్రీంలో మరో వివాదం..

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఈ నెలాఖరులోగా భర్తీ చేయాలన్న సుప్రీం ఆదేశాల్ని ప్రభుత్వం పరిశీలిస్తుందా? లేదా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, వాటి భర్తీ ప్రక్రియపై గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై ఉభయరాష్ట్రాల ప్రభుత్వాలను సుప్రీంకోర్టు మందలించింది. హైకోర్టులో కేసు ఉందంటూ తెలంగాణా ప్రభుత్వం, ఏపీలో డీఎస్సీ పరీక్షల్ని నిర్వహిస్తున్నామని ఏపీ అధికారులు తెలిపారు.

డీఎస్సీపై న్యాయపోరాటం కొనసాగిస్తాం..

పి.నానాజీ, (ఏపీ డీఎస్సీ-2018 న్యాయపోరాట బృంద సభ్యుడు)



ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2018పై న్యాయపోరాటాన్ని కొనసాగిస్తాం. దీనిపై ఇప్పటికే హైకోర్టు, సుప్రీం కోర్టులకు వెళ్లాం. సుప్రీం కోర్టు సూచన మేరకు మళ్లీ హైకోర్టుకు వెళ్లి..డీఎస్సీ ఫలితాలపై స్టే విధించాలని పిటిషన్ వేస్తాం. ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను 26 సెషన్లలో ఆన్‌లైన్లో నిర్వహించింది. దీనివల్ల ప్రతిభగల అభ్యర్థులకు నష్టం వాటిల్లింది. 2017లో సుప్రీంకోర్టుకు 23వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 2018 నాటికి వాటిని పూర్తిచేస్తామని ప్రభుత్వం నివేదికిచ్చింది. ఈ నివేదికకు విరుద్ధంగా కేవలం 7,907 పోస్టులకే డీఎస్సీ ఇచ్చి, నిరుద్యోగులను మోసగించారు.ప్రభుత్వ విధానాలతో లక్షలాది మంది అభ్యర్థులు ఆర్థికంగా చితికిపోయారు.

వృద్ధుడిపై చింతమనేని చిందులు

- వీడు అర్హుడుకాదంటూ దుర్భాష
- ప్రశ్నించినందుకు కుమారుడు అరెస్టు
- ఎమ్మెల్యే తీరును ఖండించిన వైసీపీ



తహసీల్దార్ కార్యాలయం ఎదుట వైసీపీ నాయకుల సమావేశం

విశాలాంధ్ర - పెదవేగి : సీఎం చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పింఛన్లు, పసుపు - కుంకుమ పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, దెందులూరు వివాదస్పద ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బూతు పురాణం లంకించుకున్నారు. ఇంటికి పెద్ద కొడుకుగా పేదల పింఛన్‌ను రెట్టింపు చేశానని చంద్రబాబు చెప్పుకుంటుంటే, చింతమనేని మాత్రం వృద్దులను నానా దుర్భాషలాడి వారిని అవమాన పరుస్తూ తానేమీ మారలేదని మరోసారి నిరూపించుకున్నారు. పింఛన్ కోసం వచ్చిన వృద్ధుడిపై ఆయన చిందులేశారు. 'అసలు నీకు పింఛన్ ఎవరిచ్చార్రా, నీ కుటుంబం వైసీపీలో ఉంది, వెంటనే వేదిక నుంచి వీడిని దించేయండంటూ' హుకుం జారీ చేశారు. తండ్రిని దుర్భాషలాడటంపై ఎమ్మెల్యేని ప్రశ్నించినందుకు కుమారుడిని అరెస్టు చేయించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి మండలం విజయరాయి జడ్పీ హైస్కూల్‌లో పసుపు-కుంకుమ, పింఛన్ల పంపిణీ వేడుక ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ లేగల సుబ్బారావు (85)కు ఎమ్మెల్యే చేతుల మీదగా పింఛన్ ఇప్పించేందుకు స్థానిక టీడీపీ నేతలు వేదికపైకి ఎక్కించారు. అనంతరం వేదిక వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే, సుబ్బారావును చూడటంతోనే 'వీడు పింఛన్‌కు అర్హుడు కాదు. వీడి కొడుకులు వైసీపీలో ఉన్నారు. వీడిని వేదికపై నుంచి వెంటనే దించేయండి' అనే అధికారులను ఆదేశించారు. అంతటితో ఆగతో వృద్ధుడిని నోటికొచ్చిన పదజాలంతో తిట్టేశారు. సభా వేదిక సుబ్బారావు ఇంటి పక్కనే ఉండటంతో, ఆ మాటలు విన్న ఆయన కుమారులు శివరామకృష్ణ, సోంబాబు, ధనబాబు, రాధాకృష్ణ, గంగాధరరావు హుటాహుటీన అక్కడకు చేరుకున్నారు. వేదికపై ఉన్న తమ తండ్రిని తీసుకువెళుతూ, పింఛన్ డబ్బులేమైనా నీ జేబులో నుంచి ఇస్తున్నావా అంటూ ఎమ్మెల్యే చింతమనేని ప్రశ్నించారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేదిలేదని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే, సుబ్బారావు నాలుగో కుమారుడు రాధాకృష్ణను అరెస్టు చేసి స్టేషన్‌లో వేయాలని పోలీసులను ఆదేశించారు. అసలే తిక్క ఎమ్మెల్యే కావటంతో తమనేం తిడతాడోనన్న భయంతో పోలీసులు వెంటనే రాధాకృష్ణను అదుపులోకి తీసుకుని పేదవేగి స్టేషన్‌కు తరలించారు.

పింఛన్ సొమ్ము నీ సొంతమా: వైసీపీ

ఎమ్మెల్యే వ్యవహరించిన తీరును పెదవేగి మండల వైసీపీ నేతలు తీవ్రంగా విమర్శించారు. పింఛన్ సొమ్ము ఆయన సొంతమా అని ప్రశ్నించారు. తండ్రిని అవమానించటాన్ని ప్రశ్నించిన వైసీపీ నేతను అరెస్టు చేయటాన్ని నేతలు ఖండించారు. విజయరాయి ఘటనపై పశ్చిమ గోదావరి జిల్లా కో ఆర్డినేటర్ కొట్టారు రామచంద్రరావు, దెందులూరు సమన్వయకర్త కొట్టారు అబ్బయ్య చౌదరి పెదవేగి చేరుకున్నారు. స్థానిక నేతలు పెదవేగి స్టేషన్‌కు వెళ్లి రాధాకృష్ణను విడిపించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం ఎదుట చింతమనేని తీరుపై నాయకులు ధ్వజ మెత్తారు. చింతమనేని నోరు అదుపులో పెట్టుకోక పోతే ఎక్కడికక్కడ నిలదీయాల్సి వస్తుందని హెచ్చరించారు.

సంగీత కళాశాల శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం : విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల శతజయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ సంగీత, సాహిత్య ప్రక్రియలను వివరిస్తూ నిర్వహించిన శోభా యాత్ర కన్నుల పండువగా సాగింది. విజయనగరం కోటవద్ద ఈ యాత్రను మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రారంభించారు. అనంతరం సంగీత కళాశాలలో, కళాశాల వ్యవస్థాపకులు పూసపాటి విజయరామగజపతి విగ్రహాన్ని మంత్రి రంగారావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ విజయనగరానికి రాష్ట్ర సాంస్కృతిక రాజధానిగా ప్రకటించేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని, ఆ దిశగా తనవంతు కృషి చేస్తానని అన్నారు. మంత్రి రంగారావు మాట్లాడుతూ వందేళ్లు పూర్తి చేసుకున్న ప్రభుత్వ సంగీత కళాశాల దేశంలో ఇదొక్కటే కావడం గర్వకారణమని, కళాశాల అభివృద్ధికి అన్నివిధాలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా కోట సచ్చిదానంద భాగవతార్‌కు శతజయంతి పురస్కారాన్ని మంత్రులు అందజేశారు. నటుడు తనికెళ్ల భరణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎంఎల్‌ఏలు మీసాల గీత, కిమిడి మృణాళిని, జాయింట్ కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ,అధికారులు పాల్గొన్నారు.

ఒక నాగలి మోసుకు తిరిగే...!

- కె. శివారెడ్డి

సిరికి స్వామినాయుడు రెండో కవితా సంపుటి ఇది. 2011లో "మంటిదివ్వె" మొదటి కవితాసంపుటివచ్చింది. దానికి'ఉజ్వల భవిష్యత్తు నాశిస్తూ....'అని ముందుమాట రాసాను. దానికి మంచి గుర్తింపు వచ్చింది. ఓ నాలుగేళ్ల తర్వాత ఇది. ఒక సమాజ జీవితంలో నాలుగేళ్లు తక్కువ సమయమేమీకాదు. అలానే వ్యక్తి జీవితం లోనూ, కవిజీవితంలోనూ-చుట్టూ ఉన్న సమాజంతో ఘర్షణపడుతూ - అనేక మార్పులకు లోనవుతున్న ప్రపంచంతోనూ ఘర్షణ పడుతూ - ఒక రకంగా కలహిస్తూ - సంభాషిస్తూ ముందుకెడుతుంటాడు.

స్వామినాయుడు మొదటి కవితాసంపుటికి రాసిన ముందుమాటలో అతని నేపథ్యం, భౌగోళిక నైసర్గిక వాస్తవ స్థితిగతులూ - అవి ఎలా అతని కవిత్వాన్ని ప్రభావితం చేసాయో - ఎలా అతని కవిత్వంలో అంతర్భాగ మయ్యాయో వివరించాను. దాన్ని మళ్లీ ప్రస్తావించటం అనవసరం. స్వామినాయుడు స్వభావరీత్యా, వాస్తవంగానూ గ్రామీణుడు. పార్వతీపురం కేంద్రంగా ఏజన్సీప్రాంతంలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. పార్వతీపురం కూడా పెద్ద గ్రామం కిందే లెక్క. అతను పార్వతీపురంలో ఉన్నా, స్కూల్లో ఉన్నా, చుట్టూ గ్రామీణులు, గ్రామీణ వాతావరణం, వారిభాషాసంస్కృతులూ పరిశీలిస్తూనే ఉంటారు. నగరకవిలా polute, sophisticateగానీ అవలేదు. అతను గ్రామీణ వాతావరణంలోనే జీవిస్తూ ప్రజలకు చాలా దగ్గరగా - వాళ్లలో తనూ ఒకడిగా బతుకుతూ - వాళ్ల బతుకుల్లో వచ్చినమార్పుల్నీ, ఒడిదుడుకుల్నీ, కష్టాల్నీ, దుఃఖాన్నీ కవితలుగా అక్షర బద్ధం చేసాడు. బయట ప్రపంచంతో సంపర్కం ఉన్నా- అది తనఉనికినీ, అవగాహననీ పెంపొందించటానికి పనికివచ్చిందేతప్ప- అర్థం గానీ, అయోమయపు అల్లికలోకి దారితీయ లేదు.

ఒక కవి రెండో పుస్తకానికి - వెంటనే - నాలుగేళ్లలోపే వచ్చిన కవితా సంపుటికి మళ్లీ ముందుమాట రాయటం యిబ్బందే. అంతకు ముందే కవీ, అతని కవిత్వ స్వభావాన్ని అంచనా వేసే క్రమం జరిగి ఉంటుంది. రెండో కవితా సంపుటికి ముందుమాటంటే-తన evolution ని అంచనా వేయమని అడగటం లాంటిదే.

స్వామినాయుడు కుందుర్తి సంప్రదాయానికి చెందిన దేశికవి. దేశికవులు పాల్కురికి సోమనాధుడు దగ్గరనుంచి - భాషావస్తువుల్లో గొప్ప మార్పు తెచ్చారు. స్వామినాయుడు వస్తువు - చుట్టూ సమాజానికి సంబంధించిందే - అదెంత అల్లకల్లోలమయిందో,ఛిద్రమయిందో, ఎన్నింటిని ఎలా పోగొట్టుకుందో చూపిస్తుంది. మార్పునంటిపెట్టుకుని సంక్షోభాలు... పల్లీయుల్ని, కవినీ అతలాకుతలం చేస్తాయి. కవి, ఏ వస్తువు ఎన్నుకుంటున్నా - దాన్ని ఎలా కవితగా రూపొందిస్తున్నాడు, ఏ భాషని వాడుతున్నాడు, ఏ వ్యూహాల్ని ఎత్తుగడల్ని అనుసరిస్తున్నాడు, అంతిమంగా సామాజికమయిన ముడిసరుకు - ఒక కవితగా, కళాఖండంగా ఎలా రూపుదిద్దుకుంటుంది - అనే దాన్నిబట్టి అతనిలో వచ్చిన మార్పుల్నీ, ఎదుగుదలనీ అంచనా వేయటం జరుగుతుంది.


ఒక ఘటనచెబుతా -నేను వారానికొక మూడు రోజులు ఒక కాలేజిలో పాఠాలు చెబుతున్నా - మా ప్రిన్సిపల్‌రూంలో స్వామినాయుడు కవిత్వాన్ని చదువుతూకూర్చున్నా - ఆయనకీ సాహిత్యానికీ ఏం సంబంధంలేదు - నారాయణ గారనీ నా మిత్రులు -ఆయన రూమ్‌లో కూచునే చాలా ముందుమాటలు రాశా -చాలా పుస్తకాలు చదివా - కవితలు రాశా - నేను నా లోకంలో మునిగినపుడు ఆయన నన్నెపుడూ disturb చేయలేదు. ఆయనకుతెలుసు నావ్యాసంగం- 'ఏమిటి చదువుతున్నారు'అడిగారు కాఫీతాగుతూ-ఆ మూడు రోజులూ ఆయనతో ఆయనతో కాఫీ తాగటం ఒక అనుభవం-చెప్పా.అలానాఅన్నట్టు చూసారు. అప్పుడు నే చదువుతున్న కవిత ఆయనకి విన్పిస్తే, ఆయన reaction ఎలా ఉంటుందోచూడాలని, యీ కవిత వినండి అన్నా.

"నేలమీద పరచుకున్న నీలాకాశమా.......అది'
అడిగాన్నేను సముద్రాన్ని చూపిస్తూ......
'కాదు, బతుకుమగ్గం మీద
మా అయ్య నేసి ఆరేసిన నేతచీరన్నా' దతడు,
వేకువ కిరణాల్ని శిలప చుడుతూ.....!
'పడమట పెరటిచెట్టుకు పూసిన
ముద్దమందారమా......అది 'మళ్లీ అడిగాన్నేను
సూరీడ్ని చూపిస్తూ.......
'కాదు,మగ్గంఉరికొయ్యకుఉయ్యాలలూగుతున్న
మా అయ్య నెత్తుటిశిరస్సు' న్నాడతడు ,
చీకటిదారాల్ని పడుగు పేకలుగా నేస్తూ.....!"

కవిత చదవటం ముగించి ఆయన ముఖంలోకి చూసా-ఒకగొప్ప ఆనందం-'ఎంత బ్రహ్మాండంగా చెప్పాడు సార్' అన్నాడు - నాకు ఊపువచ్చింది - యింకో కవితవినండి అన్నా-'నవ్వాల'కవిత చదివా -

"ఏదీ....ఒక్కసారి తనివితీరా నవ్వరా !
నవ్వితే....నాగావళీ పరవళ్లు తొక్కాల !
నవ్వులో నెలవంక విరియాల !
అప్పటివరకూ పడ్డ బాధనంతా ఆవల పారేసి
పొత్తిళ్లలో శిశువును జూసి ఓ తల్లి నవ్వినట్టు
తన్మయత్వంతో నవ్వాల !
కొండలోయల్లోంచి ఓ జలధార నవ్వినట్టు
గుండెలోతులుప్పొంగిపెదవితీరాననవ్వు పోటెత్తాల !
ముసురుకున్న చీకట్లు పటాపంచలై
వేకువ పొడగట్టాల !
నవ్వితే....హరివిల్లు చిన్నబోవాల !
మంచుతెరలుతాకి. ఓ మొగ్గపూవై విప్పారినట్టు
వీచేపైరుగాలికి పంటచేనునవ్వినట్టు/ఫక్కునవ్వాల !
నెమలిపిట్ట పురివిప్పినట్టు నవ్వాల
దాయమీద పాలకడవ పొంగినట్టునవ్వాల !
పచ్చని పంటపొలంమీద/పాలపిట్టలా నవ్వాల !
తనువుపులకరించి,/ఒడలు జలధరించి నవ్వేనవ్వు,
ఓ నవ్వులతుఫాను గావాల !
కడుపు చెక్కలయ్యేట్టు నవ్వితే....
కంట ముత్యాలు రాలాల!"

ఆగా - చదవటం ఆపి ఆయన వంక చూసా - 'తనువు పులకరించి, ఒడలు జలధరించీ' అన్నాడే కవి-అలా ఉంది ఆయనస్థితి- 'అద్భుతం సార్ - ఎవరాయన అన్నారు - చెప్పాను. కవిత రెండోభాగంలో contrast image యిస్తాడు- మొదటి భాగాన్ని, రెండవ భాగంతో jextopose చేస్తాడు- ఇలా చేసినందువల్ల వస్తువును project చేయటంలో-ఒకస్పష్టతవస్తుంది-వస్తువు elevate అవుతుంది. ఒక image గానీ, ఒక metaphor గానీ, ఒక పదచిత్రంగానీపడితే కవిత దృశ్యమానమవుతుంది. కవి ఆశించింది మన కళ్లముందు కొచ్చి నిలబడుతుంది. 'నవ్వు' ఎలా ఉంటుంది - ఏ ఆకారంలో ఉంటుంది - విడిగా దానికొక వునికి ఉందా- ఆకారం వుందా? నవ్వేవాణ్ణి చూస్తాం, నవ్వు ముఖాన్ని చూస్తాం - నవ్వితే ఎట్లా ఉండాలో పోలికల్తో దృశ్యమానం చేస్తాడు కవి -నవ్వుకొక ఆకారాన్నిస్తాడు కవి - నెలవంక, నాగావళి, పురిటి తల్లి, హరివిల్లు, పంటచేనూ యివన్నీ మనకనుభూతమయివే - వాటికొక స్పష్టమయిన రూపంతో పాటు ఒక వాతావరణం ఉంది. అవి symbol గా నైరూప్యమయిన దాన్ని సారూప్యంచేయటం-పాఠకుడికి చటుక్కున అందటానికీ, అనుభవమవటానికీ - ఒక్కొక్క కవి ఒక వస్తువును కవితగా మలిచే క్రమంలో ఎన్నో వ్యూహాలు, ఎత్తుగడలు, అలంకార సామాగ్రివాడుకుంటాడు-పరమార్థం-కవి ఏది అనుభవించాడో... అదిమనకుఅందాల- కవి ఏది ఊహిస్తున్నాడో... అదికూడా మనకు అందాల - కవిత మొదట భాగాన్ని రెండవభాగంతో పోల్చటంవల్ల-కవి చెప్పదలచుకున్నది తేటతెల్లంగా బయట కొస్తుంది. సముద్రాన్ని చూపిస్తూ 'నేలమీద పరుచుకున్న నీలాకాశమా 'అని అడగటమూ,



'బతుకుమగ్గంమీద మా అయ్యనేసి ఆరేసిన నేత చీర' అని జవాబివ్వ టమూ-మగ్గం బతుకులెలా ఉన్నాయో చెప్పదల్చు కున్నాడు - చెప్పటం కాదు,అదిమనకు చూపించాలి. చూపించా లంటే దృశ్యమవ్వాలి. కవిత మొత్తం దృశ్యాల పరంపర అవుతుంది. ఒక దృశ్యం గాకపోయినా మరో దృశ్యమయినా పాఠకుడికి అందుతుందని ఆశ - యీ దృశ్యమానం చేయటంలో కవి, ఏ ఏ పోలికల్ని ఎన్నుకున్నాడంటే - ఏరుకున్నాడంటే - తన చుట్టూ ఉన్న పరిసరాలనుంచీ, జీవితం నుంచీ, అనుభవంనుంచీ-అవి అపరిచిత ఉపమానాలు కాదు, రూపకాలు కాదు, మా ప్రిన్సిపల్ 'ఓహో' అనటానికీ, ఆ బొమ్మలన్నీ రూపకాలన్నీ ఆయనకి మహాద్భుతంగా అందాయి.

భాషకి ఆయువుపట్టు పోలిక - మామూలు జనంపోలికలేకుండా మాట్లాడరు-భాష కవిత్వమయం అవటానికి యీ అలంకరణ - ఉపమ కావచ్చు - రూపకం కావచ్చు - ఉత్ప్రేక్ష కావచ్చు - మరొకటి కావచ్చు - జనంతో, జన జీవితంతో నీకున్న సంబంధాన్ని బట్టీ పోలికలు దిగుతాయి.

స్వామినాయుడు మొదటిసంపుటిలో ఈ తరహా కదా అంటే, వుందొచ్చు-బీజప్రాయంగా వుందనుకుంటా-స్వాభావికంగా దాంట్లో తొంగి చూడవచ్చు -కానీ యీ కవితా సంపుటి కవితల్లో తాను ప్రయత్నపూర్వకంగాయీమార్గాన్ని ఎన్ను కున్నాడు - పద్యాన్ని నేసాడు - ఒక పద్మశాలి ఎంతో దీక్షతో, ఏకాగ్రతతో involve అయి, చీరనేస్తాడో - అలా స్వామినాయుడు, వస్తువులో మునిగి-దాన్ని పైకెత్తి చూపించటానికి వాడు కున్న పద్ధతి యిది - దీన్నొక వ్యూహంగానూ, శిల్పరీతిగానూ వాడుకున్నాడు - 'బాల్యం - కొన్ని జ్ఞాపకాలు' కవిత ప్రారంభం చూడండి

" పసితనపు పయ్యాదకొంగు వేలాడుతూ
నాన్నేదని అమ్మనడిగినపుడు
గుంకిన పొద్దును చూపిన అమ్మకళ్లలో
ఆరని తడిమళ్లను చూసాను! "

తనకి బాధ, వేదనంటే ఏమిటో - ఎపుడర్థమయిందో చెప్పదల్చుకున్నాడు - అమ్మే కేంద్రం- ఆమె ద్వారానే అన్నీగ్రహింపు- ' కుంగిపోతున్న పొద్దు' - 'ఆరని తడి మడి' - ఒకదాన్ని బలంగా చెప్పడానికి - మరొక స్వాభావికమయిన దాన్ని, ప్రాకృతికమయినదాన్నిపోల్చటం-కవిత ముగింపు కొచ్చేసరికి - యీ దృశ్యపరంపర పరాకాష్ఠకు చేరటం-దేనికి?

'బాల్యంలో గుండెకు గుచ్చుకున్న
యీ తుమ్మముళ్ల జ్ఞాపకాలే నాలో సుళ్లుతిరిగి
మూలాలు మరచిపోతున్నవేళ ఛెళ్లున చరిచి
నేలమీద నన్నోమనిషిగా నిలబెట్టాయేమో.....'

నేటి సందర్భం మూలాలు మరచిపోవటం - యింత దృశ్యసామాగ్రి వాడుకోవటం- మూలాలు మరవొద్దని చెబటానికే - తను కవిగావటానికి - 'నట్టింటపల్లెటూరై కదలాడే అమ్మే 'కారణ మంటాడు - 'మట్టి - అతని పుట్టిల్లు' అనే కవితలో-

'హరిత ప్రపంచాన్ని' చూపించడంతో మొదలైన కవిత ఒక వ్యవసాయక ప్రపంచాన్ని, సమయాను గుణంగా చేసే పొలంపనుల్నీ , విధుల్నీ చూపిస్తూ పోతుంది -

"దమ్ము జేసినపుడు చూడాలి
ఉభాలేసినపుడు చూడాలి
మొన ఊపరిపోసుకున్నప్పుడు చూడాలి
పంటకాల్వలో-పాకటం -

పల్లెటూరితో, వ్యవసాయ సంబంధంలేని ఎవడైనా యీ కవిత చదివితే - ఆ పల్లెటూరి పొలాలు,కాలవలు,చెట్టూచేమా,దున్నటం, దమ్ము చేయటం, కలుపుతీయటం, పంటకోయటం- యిలా మొత్తం వ్యవసాయపనుల వృత్తాన్ని అనుభవిస్తాడు-

'కుదక' కవిత గూడా - 'తాతలనాటి బొచ్చె తరతరాలు' అనే సామెతకు కవితారూపం -

'నాతో - రా' కవిత ....లో

'ఆరిపోయిన దీపాన్నేమి చూస్తావ్
చీకటికి చితిపెట్టి నాతో రా .....
ఒక్కొక్క దీపాన్ని వెలిగించుకుంటూ
నేలమీద ఓ నక్షత్రమండలమవుదాం!"

అని మొదలై ముగింపుకొచ్చేసరికి

'కుళ్లిపోయిన లోకాన్నేమి చూస్తావ్
రా.....జనంచేతిలో నేనో విల్లునవుతాను
నువ్వోశరానివికా.../బతుకు రణరంగమైనచోట
పోరాటమే ఊపిరి కావాలి మరి!'

యీ రెండోపుస్తకంలో స్వామినాయుడు రూపంపట్ల శ్రద్ధపెట్టాడు. ఒక కవిత మొదలయి -దానంతటికి అది కొనసాగి ముగింపునకు రావటంలేదు -చాలా conscious గా మెలకువగా కవిత నడపటం - కవిత కొనసాగే క్రమంలో - తుమ్మదుంగ నాగలవుతుంది - ఒక వస్తువును - కవి ఎదిగేకొలదీ - చాలా విషయాలు అవగాహన లోకి తెచ్చుకునే కొలదీ - వస్తువు తనకున్న పద్ధతిలో drive చేస్తాడు, నిర్మిస్తాడు. యీ పద్య నిర్మాణక్రమంలో తన సామాగ్రి, అలంకార సామాగ్రి అంతా అతని అనుభవ ప్రపంచం నుంచీ,అధ్యయన ప్రపంచంనుంచీఏరు కుంటాడు - నిర్మాణాన్ని ఎన్నుకుంటాడు - పూనికతో, చాలాస్పృహతో నిర్మించుకొస్తాడు 'పయ్యాడ కొంగు అనే కవిత ఎక్కడ మొదలెట్టాడు-ఎలా నిర్మించాడు- చెప్పదలచుకున్నది పైటచెంగులు మాయమవుతున్నాయని - మధ్యలో ఒకచోట అంటాడు -

'నాన్న భుజంమీద కండువాలా
అమ్మకీ పయ్యాడ కొంగు'

పైటకొంగు ఎన్నిరకాలుగాఅమ్మకి పనికొచ్చిందో చెబుతాడు -

'యిపుడే పాశ్చాత్య సంస్కృతి
అమ్మతనానికి అంటుసోకిందో గానీ
పయ్యాడకొంగులు మాయమైపోతున్నాయి
పయ్యాడంటే ఒట్టి చీరకొంగేకాదు
అది నాదేశపు ఆత్మగౌరవ పతాక'

ఒక వస్తువుననుకోవటం-దాన్ని చివరిదాకా పట్టు సడలకుండా నడపటం-climax చేర్చటం - ఒక పద్ధతిప్రకారం నాయుడు యీసంపుటిలోచేసాడు.

'పావలా' అన్న కవితలో
పావలా మా పూరిగుడిసెలమీద పున్నమిచందమామ.
'నా బాల్యంలానే యిపుడు పావలా
ఓ పురాజ్ఞాపకమయిపోయింది'

త్వరితగతిన మారుతున్నసమాజంలో-విలువలు గావచ్చు, మానవ సంబంధాలు గావచ్చు -చెల్లని సత్తునాణెంకావచ్చు-ఒకదాన్నుంచి-ఒక వస్తువును దాని సామాజిక సందర్భంలో - ఒక కాలంలో నించోబెట్టి వైనం వైనంగా వివరాలు వివరించి, విస్తరించి - ఒక తత్వాన్ని లాగటం - తత్వమంటే ఏమీకాదు -ఒకపాఠం -ఒకసారం -ఒకబాధ- ఈ కవితాసంపుటిలో కనబడుతుంది -ఉత్తరాంధ్రలో జరిగిన ఘోరాలమీదా-లక్ష్మీపేట-బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేక పోరాటాలు - యిత్యాదులమీద రాసిన కవితలున్నాయి-openగా ఉండాల్సిన చోట-సూటిగా పలకాల్సినచోట-సూటిగానే, నిర్మొహమాటంగానే పలికాడు- 'అడవుల్ని అరుణ పతాకాలు జేసీ 'కవితలాంటి చాలా కవితలు-ఆప్రాంతంతో గాఢ పరిచయం లేనివాడు రాయలేడు- మొదటిభాగంలో వస్తువుని పరిచయంచేస్తాడు- అద్భుతమయిన వర్ణనతో మొదలవుతుంది-పాఠకుడిని పద్యంలోకి దింపటానికి వర్ణనాత్మక పరిసరాల పరిచయం పనికొస్తుంది - అక్కడ నుంచి పాఠకుణ్ణి పద్యమే లాక్కెళుతుంది-తనవెంట ముగింపునకు చేరుస్తుంది.

'బతుకంటే...ఆకాశాన స్వేచ్ఛగా ఎగరటమే
స్వేచ్ఛలేని బతుకు ఒక మరణం
యిపుడు స్వేచ్ఛకోసం వాళ్లెంతకైనా తెగిస్తారు
శిలకోలలనెక్కుపెట్టి నిర్బంధాల్ని ఛేదిస్తారు
అడవుల్ని అరుణపతాకాలు జేసీ రెపరెపలాడిస్తారు'

అనేక పోరాటాలుచేస్తున్న వాళ్లూ, పోరాటాల్లో అమరులయిన వాళ్లూ - అందరికీ గొప్ప ప్రతీక యీ కవిత -

సిరికి స్వామినాయుడు కవిత్వాన్ని ఈ కోణంలో, ఈదిశలో, ఈ పద్ధతిలో వ్యాఖ్యానించటానికి నా శక్తిచాలదు-నా అలంకారిక పరిజ్ఞానం చాలదు - ఏ పెన్నా శివరామకృష్ణలాంటి వాళ్లో అయితే మహాద్భుతంగా విశ్లేషించి చెప్పగలరు-

మొదటి కవితాసంపుటి కంటే, రెండో కవితాసంపుటిలో ధ్యానం పెరిగింది - స్పృహతో వస్తువును deal చేయటం కనపడు తుంది - ఉత్తరాంధ్రఏజన్సీప్రాంతపు భౌగోళిక స్వరూపాన్ని, స్వభావాన్నీ ఈ కవితా సంపుటిలో సాధికారికంగా పట్టుకున్నాడు.

ఈ కవితలు సిరికి స్వామినాయుడు తప్ప మరొకరు రాయలేరు అనే భావన కలిగేట్టు కవితలు నిర్మించాడు - ఈ పుస్తకం చదివితే ఉత్తరాంధ్రని, దాని చారిత్రక నేపథ్యంలో పెట్టి చూపినట్టు -గమనించినట్టు- గ్రహించినట్టు -

నాకు అంతగా పార్వతీపురం ప్రాంతంతో పరిచయంలేదు - గిరిజనుల గురించీ, గిరిజన పోరాటాల గురించీ, వాళ్ల ఆచార వ్యవహారాల గురించీ తెలియదు - ఈ కవితా సంపుటి నాకు ఆ ప్రాంతపు స్వరూపాన్నీ, స్వభావాన్నీ చూయించింది -

మొదటి పుస్తకం కంటే యీ పుస్తకంలో వస్తువును కవిత చేయటం మీద దృష్టి పెట్టాడు - శ్రద్ధ పెట్టాడు - ప్రతీ కవితకీ దానిదైన ఒక వాతావరణాన్నీ, ఆవరణనీ సృష్టించీ - ఆ కవిత దాని కాళ్లమీద అది నిలబడేట్టు చేసాడు -

ఈ కవితాసంపుటిని చదివి ఆనందించాను - diversions లేకుండా ముందుకు సాగుతున్నందుకు - బలోపేతుడవు తున్నందుకు - చూడటం నేర్చుకున్నాడు - వస్తువులోకి జొరబడటం నేర్చుకున్నాడు - దాన్ని ఎలా విస్తృతి చేయాలో - పాఠకుణ్ణి ఎలా నిమగ్నంచేయాలో నేర్చుకున్నాడు.

'ఒక నాగలి మోసుకు తిరిగే
సామాన్యుడిని నువ్వు చూస్తావు !
నేను సామాన్యుల్లో తిరుగే
అసమాన్యుణ్ణి దర్శిస్తాను
అతనిలో అనంత శక్తిసంపన్నమైన
సైన్యసమూహాన్ని వీక్షిస్తాను'
అదీ.... సిరికి స్వామినాయుడు

కళలు కుల అడ్డంకులు అధిగమించాలి

కర్ణాటక సంగీత కచేరీలలో బ్రాహ్మణాధిక్యతను ప్రశ్నించిన బ్రాహ్మణ గాయకుడు టి.ఎమ్. కృష్ణన్ (మెగాసెసే అవార్డు గ్రహీత)

తన 22వ ఏట నుండి కర్నాటక సంగీతానికి పూర్తి కాలం వెచ్చిస్తూ వున్న ప్రముఖ గాయకుడు టి.ఎమ్. కృష్ణన్ సంగీత కచేరీని న్యూఢిల్లీలో హిందుత్వవాదుల బెదిరింపు లతో నిర్వాహకులు రద్దు చేశారు. నవంబరు 17, 18 తేదీల్లో చాణిక్యపురిలోని నెహ్రూపార్కులో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) - స్పిక్-మాకే సంస్థకు చెందిన సాంస్కృతిక విభాగం వారు ఈ కచేరీని నిర్వహించ దలిచారు. కాని హిందుత్వవాదుల బెదిరింపులతో రద్దు చేసుకున్నారు.

ఇది రద్దు అయినట్లు తెలిసిన కొన్ని గంటలలోనే నవంబరు 18న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆహ్వానంపై 'ప్రజాగొంతుక' (ఆవామ్‌కీ ఆవాజ్) పేరుతో గార్డెన్ ఆఫ్ ఫైవ్ సెన్సెస్‌లో టి.ఎమ్.కృష్ణ తన బృందంతో కచేరీ నిర్వహించారు. ఆయనకు ఆర్.ఏ శ్రీరామ్‌కుమార్ (వయోలిన్), ప్రవీణ్ (మృదంగం), అనిరుధ్ ఆత్రేయ (కంజర) వాద్య సహకారం అందించారు. ఢిల్లీ విద్యామంత్రి మనీష్ సిసోడియా, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కచేరిని ప్రారంభిస్తూ అతి క్లుప్తంగా ప్రసంగించారు. గతంలో కూడా హిందుత్వ వాదుల ఆగడాల వల్ల పాకిస్తానీ గాయకుడు గులామ్ ఆలీ కచేరి రద్దు కాగా, న్యూఢిల్లీ ప్రభుత్వం ఆయనను ఆహ్వానించి కచేరీని నిర్వహించింది.

ఇంతకీ టి.ఎమ్.కృష్ణపై హిందుత్వవాదుల అభియోగా లేమిటి? ఆయన తన కచేరీలలో జీసస్‌పైనా, అల్లాపైనా కీర్తనలు గానం చేస్తున్నారన్నది వారి అభ్యంతరం. నిజానికి అదొక్కటే కాదు. గత నాలుగైదేళ్లుగా టి.ఎమ్.కృష్ణ కర్నాటక సంగీతం ఇసాయీ వెల్లలార్ కులాల వారి నుండి, దేవదాసీల నుండి క్రమంగా అగ్రకులమైన బ్రాహ్మణుల గుత్తాధిపత్యానికి రావడాన్ని ప్రశ్నిస్తూ సంచలనం సృష్టిస్తున్నాడు. దేవదాసీల నాట్యమే ఆ తర్వాత భరతనాట్యమైంది. అదే విధంగా హిందుస్తానీ సంగీతం మరాఠీ బ్రాహ్మణుల వశమైంది. ఈ విధంగా ఇది అగ్రకుల హిందువులది కావడం ఒక విషాదం అన్నాడాయన.

అంతే కాదు, దేశంలో ఇటీవల వ్యాపించిన అసహనాన్ని, ఒంటెత్తు జాతీయవాదాన్నీ, గో రక్షణ పేరుతో జరుగుతున్న హత్యలనూ ఆయన నిరాకరించాడు. ఇక హిందుత్వవాదులు ఆయన్ను దేశ వ్యతిరేకి అని, అర్బన్ నక్సల్ అనీ ప్రచారం ప్రారంభించారు.

భారతీయ సంస్కృతి వివిధ మతాలు, ఆలోచనల సమ్మేళనం. మన శిల్పం, కళలు, సాహిత్యంపై వివిధ మతాల ప్రభావం ఉంది. మహ్మద్ రఫీ ఎన్నో భక్తి పాటలు (అన్ని మతాల వారివీ) పాడారు. ముస్లిములైన ఉస్తాద్ బిస్మిల్లాఖాన్, ఉస్తాద్‌బిడే అలాంఖాన్, ఎ.ఆర్.రహమాన్ అన్ని మతాల పాటలూ గానం చేశారు.

మైసూర్‌లోని కువెంపునగర్‌లో ఏర్పాటు చేసిన కృష్ణ సంగీత కచేరిని హిందూత్వ వాదులు అడ్డుకున్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కృష్ణ మాత్రం 'సంగీతానికి దేశం, ప్రాంతం, జాతి, మతం, భాష, పరిమితులు లేవు' అని ప్రకటించారు. బహుభాషల, బహుమతాల, బహు



సంస్కృతుల దేశంలో కళలకు అల్లా, జీసస్, రాముడు అనే తేడా ఉండకూడదు అన్నారు.

ఢిల్లీలోని కచేరీని తుకారాం రాసిన మరాఠీ అభంగ్‌తో ప్రారంభించారు. నిజానికి కర్నాటక సంగీత కచేరీని ఒక వర్ణంతోను, కీర్తనతోనూ ప్రారంభించడం ఆనవాయితీ కాగా కృష్ణ దానికి భిన్నంగా తీశారు. 2 1/2 గంటల పాటు సాగిన కచేరీలో వివిధ రకాల పాటలు, కీర్తనలు, రాముడు, జీసస్, అల్లాలపై పాటలు, మలయాళం, బెంగాలీ, తమిళం, హిందీ, కన్నడ గేయాలను పాడారు. సమకాలీన రచయితలు రాసిన వాటినీ, సినిమాల్లోని పాటలనూ పాడారు. ఒక అరబిక్ పాటను, పోరోమ్‌బోకె అనే కర్నాటక పాటలే కాక, ప్రేక్షకులను తనతో గొంతు కలపమని ప్రోత్సహించారు. కచేరీలు ప్రధానమైన నాదోపాసన బేగడరాగంలో ఎన్నో కొత్త సంగతులతో, స్వరాలతో గానం చేశారు. ద్విజేంద్రలాల్ రాయ్ బెంగాలీలో రాసిన 'అమర జన్మభూమి' పాటను వాద్య సహకారం లేకుండా పాడారు. ఇదే పాటకు ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి 1997లో తన చివరి బహిరంగ కచేరీలో పాడారు.

సంప్రదాయ సంగీత కచేరీల సంస్కృతిని నిరసిస్తూ కృష్ణ 2015 నుండీ సామాన్య జనం ప్రేక్షకులుగా మత్స్యకారుల గ్రామమైన ఉరూర్ కుప్పంలో వార్షిక కళా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కర్నాటక సంగీత కచేరీలలో శ్రోతలు కూడా బ్రాహ్మణులు. బ్రాహ్మణ భావజాలంతో నిండి ఉండటాన్ని కూడా కృష్ణ విమర్శించారు. అక్కడ ఒక బ్రాహ్మణ సమావేశం జరుగుతున్నట్లుగా ఉంటుందన్నారు. కచేరీలో కూడా మొదట దేవుళ్ల ప్రార్థనలు చేస్తారు. కొందరైతే వేదికపై వున్న కళాకారులకు విబూది పంచిపెడతారు. అదంతా బ్రాహ్మణీయ సంస్కృతికి ప్రతి రూపం అన్నారు కృష్ణ. తాను ఈ సంగీతాన్ని సాధారణ ప్రజల వద్దకు తీసుకువెళ్తున్నానన్నారు.

కచేరీలలో రైతుల గురించి, స్త్రీల పోరాటాల గురించి, నగర జీవితం గురించి, ప్రకృతి గురించి, పలు మతాల గురించి, నిరసన ఉద్యమాల గురించి, సమాజంలోని వివిధ వర్గాల వారి గురించి పాటలు, కీర్తనలు కృష్ణ నిర్వహించే సంగీత కచేరీలలో చోటు చేసుకోవడం సనాతన సంప్రదాయ సంగీతకారులకు నచ్చలేదు. 2016 నుండి కృష్ణ ఏటేటా డిసెంబరులో తమిళనాడులో జరిగే రకరకాల సంగీతోత్సవాలను బహిష్కరించి తన కచేరీలను మత్స్యకారుల గ్రామమైన ఉరూర్ ఆల్కాట్ కుప్పంలో నిర్వహిస్తున్నారు.

ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో 2016లో జరిగిన రామన్ మెగాసెసే అవార్డు స్వీకరిస్తూ ఇచ్చిన ఉపన్యాసంలో "కళలకు కుల అడ్డంకులు ఉండకూడదు" అన్నారు. "భారతదేశంలో లోతుగా పాతుకుపోయిన సామాజిక దొంతరలకు వ్యతిరేకంగా కళలను ఉపయోగిస్తున్నందుకు, కుల, వర్గ తేడాలు లేకుండా సంగీతం అందరికీ చెందాలంటూ సామాజిక మార్పు కోసం అసమానమైన కృషి చేసినందుకు ఈ అవార్డును ఆయన పొందారు.

ఆయన ఏడుగురు కర్నాటక సంగీతకారులపైన రాసిన "వాయిసెస్ విథిన్" (2011), "ఎ సదరన్ మ్యూజిక్, ది కర్నాటక స్టోరీ (2013)", "అషిస్‌నంది ఎవైఫ్ ఇన్ డిస్సెంట్", "రీషేపింగ్ ఆర్ట్" (2018) పుస్తకాలను రచించారు. "రీ షేపింగ్ ఆర్ట్"ను పెరుమాళ్ మురుగన్ ఆవిష్కరించారు.

- కొత్తపల్లి రవిబాబు,
ప్రజాసాహితీ ప్రధాన సంపాదకులు




అంకెల పాస్‌వర్డ్

దిక్కులు నాలుగు/నెలలు పన్నెండు
నక్షత్రాలు ఇరవై యేడు
నీవు చిన్నప్పుడు బట్టీ వేసిన
రెండొకట్ల రెండు ఎక్కంలా
నీ నోటి వెంట ఇప్పుడు రావాల్సింది
నీవు చదవాల్సింది అంకెలే
నీ అస్తిత్వాన్నీ అనస్తిత్వాన్నీ
రుజువుచేసుకోవాలంటే/ తప్పదు/నీవిపుడు
ఆ నాలుగో పదో పదహారో అంకెలూ నేర్వాల్సిందే
నీవు పీల్చే వూపిరి నీదేనని చెప్పాలన్నా
నీ కాళ్ళూ చేతులూ అంతెందుకు
నీ సర్వాంగాలూ/ నీవేనని చూపాలన్నా
నీవిపుడు/ కొన్ని అంకెలు అప్పచెప్పాల్సిందే
వెలుగులూ చీకట్లూ/ ఇళ్ళూ బళ్ళూ
రోడ్లను చీల్చుకుని/లోపల నిదురిస్తున్న
పారని కాల్వలూ/ కాంక్రీటు భవనాల కాళ్ళకింద
తొక్కివేసిన పచ్చటి పొలాలూ
వాటికై కలలుకన్న నేలలూ
పోలో మని కొట్టుకుంటున్న నదుల పరాలూ
అన్నీ అన్నీ అంకెలైపోయినపుడు
వాడినీ వీడినీ / వాళ్ళిద్దరి చేతుల్లో నిన్నూ
అంకెలే గారడీ చేసి ఆడిస్తున్నప్పుడూ
వారిద్దరి అంకెనీ/ నిలపాల్సిన నువుకూడా
ఓ అంకై పోవాల్సిందే
ఓ గజిబిజిగా వుండే అంకెల
పాస్ వర్డ్ కనుక్కోవాల్సిందే

- డా.విజయ్ కోగంటి

మౌనం



ఒక మౌనం యుద్ధ వ్యూహం
ఇంకో మౌనం బుద్ధ ధ్యానం

ఒక మౌనం తీరని వేదన
ఇంకో మౌనం అంత:శోధన

ఒక మౌనం నిగ్రహ ప్రకటన
ఇంకో మౌనం నిరసన ఉద్ఘాటన
ఆగ్రహంపై పరిచిన అచ్ఛాదన
వినమ్రంగా దాగివున్న విస్ఫోటన

మిత్రమా,
మౌనం ముద్రల్ని ఛేదించడమంటే
మహా సముద్రాల్ని శోధించడమే
అర్థం కాని అర్థభాగమింకా
అంధకారంలో మిగిలే ఉంటుంది.
అట్టడుగు పొరల్లో దాగే ఉంటుంది.

-డా॥డి.వి.జి.శంకరరావు,✆ : 944083693

విశాలాంధ్ర
బతుకు
The Life
సోమవారం
04 ఫిబ్రవరి 2019



గెట్ రెడీ ఫర్ దాండియా

ఫిబ్రవరి మాసమంటే చాలు యువతకు గుర్తుకు వచ్చేది ప్రేమికుల రోజు. ఆ రోజు ప్రత్యేకత దాండియా ఆడడం. దీని కోసం సంవత్సమంతా ఎదురు చూస్తూ ఉంటారు. ఒకప్పుడు గుజరాత్‌లో మాత్రమే ఆడే ఈ దాండియా ఇప్పుడు దేశమంతా పాకింది. ప్రేమికుల రోజు నృత్యంగా మారిపోయింది. ప్రేమికుల రోజు దాండియా ఆడటానికి యువత ఉవ్విళ్ళూరుతుంటారు. దాండియా కోసం కనీసం పది రోజుల ముందు నుంచే షాపింగ్ మొదలు పెట్టేస్తారు. దాండియాకు ప్రత్యేక వస్త్రాలున్నాయి అవే ఇవి. ఇందుకు మీరు సిద్ధమవుతున్నారా? అయితే మీరు కొనేయండి వీటిని.





బ్రెడ్ పదే పదే తింటున్నారా ?

బ్రెడ్‌ను అధికంగా తీసుకుంటే జీర్ణ సమస్యలు తప్పవని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. బ్రెడ్‌తో తయారయ్యే పిజ్జా, మఫిన్స్ వంటివి అధికంగా తీసుకుంటే అనారోగ్య సమస్యలు తప్పవు.. ఇందులోని హై కెలోరీలు ఒబెసిటీకి దారితీస్తాయి. బ్రెడ్ ముక్కల్లోని పంచదార స్థాయిలు డయాబెటిస్‌కు దారితీస్తాయి. ఇన్సులిన్ స్థాయిలను వైట్ బ్రెడ్ పెంచేస్తుంది. అయితే గోధుమలతో చేసిన బ్రెడ్ ద్వారా మధుమేహాన్ని నియంత్రించుకోవచ్చు.

కానీ వైట్ బ్రెడ్ తీసుకుంటే బరువు పెరుగుతారు. అధికంగా తీసుకుంటే.. ఒత్తిడి పెరుగుతుంది. అలాగే కొన్ని ఫాస్ట్ పుడ్స్ సెంటర్లలో ఉపయోగించే బ్రెడ్లలో పొటాషియం, బ్రోమేట్, అయోడెట్ వంటి క్యాన్సర్ కారకాలున్నాయి.. వాటివల్ల థైరాయిడ్ కూడా వచ్చే ప్రమాదం వుంది.

బ్రెడ్ తయారీకి పిండిని తయారు చేసుకునే ప్రాసెస్‌లో వినియోగించే రసాయనాలు, జన్యుపరంగా రూపాంతరం చెందించిన సోయా లెసిథిన్, కార్న్ ఆయిల్, సోయా బీన్ ఆయిల్, సోయాపిండి పేపర్లు, నిల్వ వుంచే రసాయనాలు, మితిమీరిన చక్కెర బ్రెడ్‌లో వుంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి మేలు చేసేవి కావు. కాబట్టి బ్రెడ్‌ను ఎంత తక్కువ తింటే అంత మంచిది.

ఆహారంలో ఎక్కువశాతం బ్రెడ్‌ని ఎక్కువకాలం వాడితే దీర్ఘకాలంలో పోషకాహార లోపం కలుగుతుంది. వైట్ బ్రెడ్‌లో కంటే గోధుమ బ్రెడ్‌లో పోషకాలు కాస్త మెరుగ్గా వుంటాయి. తృణధాన్యాలతో తయారుచేసిన బ్రెడ్ కాస్త బెటరని.. కాకపోతే ఇందులో పండ్లు, నట్స్ కూరగాయలతో పోలిస్తే పోషకాలు తక్కువని.. ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



కెరీర్‌లో అడ్డంకులను తొలగించుకుంటేనే
జీవితంలో రాణింపు

కెరీర్ గ్రాఫ్ ఎక్కుపెట్టిన బాణంలా పైపైకి సాగి లక్ష్యాన్ని చేరుకోవాలి కానీ గాలిలో విసిరిన రాయిలా ఎక్కడ పడుతుందోనన్నట్లుగా వుండరాదు. సహజంగా కెరీర్‌లో స్థిరపడ్డాక ఎదుగుదల కోసం ప్రయత్నించాలి. ఐతే కుటుంబపరమైన సమస్యలు, వ్యక్తిగత సమస్యలను కెరీర్ పైన రుద్దుకుంటూ చేసే పనిపై ధ్యాస కోల్పోయేవారి సంఖ్య 40 శాతానికి పైగానే వున్నట్లు ఇటీవలి సర్వేల్లో వెల్లడైంది. ఈ 40 శాతం మంది ఉద్యోగంలో ఓడిపోయి రాజీనామాలు చేసేసి ఆ తర్వాత పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోతుంటారు.

ఆ పరిస్థితి రాకుండా కెరీర్ గ్రాఫ్ ఆరోగ్యకరంగా వుంచుకునేందుకు రోజూ ప్రయత్నించాలి. ఎలాగంటే... ఉద్యోగంలో చేరిన కొత్తలో ఉద్యోగం వచ్చిందన్న సంతోషం, ఆ ఉద్యోగాన్ని పదిలంగా చూసుకోవాలన్న ఆరాటం... దానితో ముందుకు సాగాలన్న లక్ష్యం ఎలా వుంటుందో... అలాగే ప్రతిరోజూ మొదటిరోజులా పరిగణించుకుంటూ ఉత్సాహంగా ముందుకు సాగాలి. ఇకపోతే కెరీర్ ఎదుగుదలలో చాలామంది చేసే మూడు తప్పులు వున్నాయి. అవేంటో చూద్దాం.

మద్దతు లేదని ఒంటరి కావడం...

- పనిచేసే చోట తనకు ఎవరి సహకారం లేదని ఒంటరిగా మారిపోవడం. ఇది చాలా తప్పు. ఎవ్వరూ మీ కోసం పనిచేయరు. వాళ్లకోసం వారు పని చేస్తుంటారు. కాబట్టి ఏ విషయంలోనైనా సహకారం కావాలంటే నిరభ్యంతరంగా తోటి ఉద్యోగులను, పై అధికారులను సంప్రదించడం ద్వారా చేసే పనిలో అవరోధాలను అధిగమించాలి. కానీ ఈ పని చేయడం నావల్ల కాదని వదిలేస్తే కెరీర్ ఎదుగుదలకు అది అడ్డంకిగా మారుతుంది.

తప్పు చేయడమే కాక ఒత్తిడితో సతమతం...

- పనిపై ధ్యాస లేనప్పుడు పనిలో తప్పులు దొర్లుతాయి. ఫలితంగా పైఅధికారుల నుంచి మందలింపులు సహజమే. ఆ మందలింపునకు కారణం తెలుసుకుని సరిదిద్దుకోవాలి తప్ప ఒత్తిడికి లోనై ఉద్యోగం మానేయడం సరైంది కాదు. ఇలా ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోతే తాత్కాలికంగా ఆ సమస్య నుంచి బయటపడవచ్చు కానీ అంతకుమించి వందరెట్లు సవాళ్లు కాచుకుని కూర్చుని వుంటాయని గుర్తుంచుకోవాలి.

ప్రణాళికాలోపం...

- పని పట్ల ఓ ప్రణాళిక లేకపోవడంతో అంతా చిందరవందరగా మారిపోతుంది. దాంతో సరైన సమయానికి లక్ష్యాన్ని చేరలేకపోతారు. ఫలితంగా విసుగు వచ్చేస్తుంది. దాంతో... ఇక్కడ చేసే కంటే ఏదైనా రోడ్డు పక్కన పనిచేసుకుని బతకవచ్చు అని తమలో తామే అనుకుంటారు. కానీ రోడ్డు పక్కన పని చేస్తే కానీ తెలియదు అది ఎంత కష్టమైనదో. కాబట్టి ఏ పనీ అంత సులభంగా ఏమీ ఉండదు. అది రోజుకి 10 రూపాయల పనైనా పదివేల రూపాయల పనైనా. కాబట్టి కెరీర్ ఎదుగుదలకు ప్రధానమైన అడ్డంకులను తొలగించుకుంటూ ముందుకు సాగితేనే వ్యక్తిగతంగా సంతోషంగా వుండటమే కాకుండా యాజమాన్యానికీ సంతోషం పంచినవారుగా వుంటారు.



వంటింటి చిట్కాలు



నేటి తరుణంలో కల్తీ పదార్థాలు ఎక్కువై పోతున్నాయి. అవి కల్తీవేనని తెలుసుకోవాలంటే ఈ చిట్కాలు పాటించి చూడండి..

- పిండి కలిపిన పాలు మరీ చిక్కగా ఉంటాయి. ఈ కల్తీని కనిపెట్టాలంటే.. చెంచా పాలలో.. ఇంట్లో ఉండే టించర్ అయోడిన్‌ను రెండు చుక్కలు వేసి చూడండి.. పాలు గనుక ఊదారంగులోని మారినట్లయితే ఆ పాలు కల్తీవన్నమాట.
- ఆకుకూరలను రెండు నిమిషాల పాటు మరుగుతున్న నీటిలో ఉంచాలి. ఆ తరువాత నీటితో శుభ్రంగా కడిగి నీరు లేకుండా వంపేసి.. ఫ్రిజ్‌లో ఉంచితే.. దాదాపు రెండు వారాల పాటు నిల్వ ఉంటాయి.
- బెండకాయ కూర వండేటప్పుడు జిగురు కారణంగా కూర అంటుకుపోతూ ఉంటే.. ఆ కూరలో కొంచెం పెరుగు కలిపి వండితే ముక్కలు అంటుకోకుండా విడివిడిగా ఉంటాయి.
- బంగాళాదుంపలు ఉడికించిన నీటిని పారబోయకుండా.. చపాతీ పిండి కలిపేటప్పుడు నీటికి బదులుగా వాటిని వాడుకోవచ్చు. ఇలా చేయడం వలన శరీరానికి అవసరమైన పోషకాలు వృధా కాకుండా కాపాడుతున్నవారవుతారు.



- అరటి పూసలోని పీచు తీసేయాలంటే.. పూసను చిన్న చిన్న ముక్కలుగా తరిగి కొంచెం మజ్జిగ జిలకరిస్తే పీచు కవ్వంతో తేలికగా వచ్చేస్తుంది. పెరుగులో చిన్న పచ్చి కొబ్బరి ముక్కను వేస్తే పులవకుండా ఉంటుంది.

డిప్రెషన్
లక్షణాలివే...



చాలా మంది తీవ్రమైన ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతుంటారు. ఇలాంటి వారికి ఆత్మీయులు, అయినవారు, స్నేహితుల అండ చాలా ముఖ్యం. తీవ్రమైన ఒత్తిడిని మానసిక స్థైర్యాన్ని నింపేందుకు ఎంతో ముఖ్యం. బాధగా ఉండటం, ఆత్మన్యూనతకు లోనుకావడం, నిరాశ, నిస్పృహలతో రోజులు గడపడం, జీవితంపై నిరాసక్తత, చేసే పనులపై ఆసక్తి లేకపోవడం, ఒంటరిగా గడపాలని అనిపించడం... ఇలాంటి లక్షణాలున్నట్లయితే డిప్రెషన్‌లో ఉన్నారని గుర్తించాలి. అసలు డిప్రెషన్‌కు లక్షణాలు ఎలా ఉంటాయో తెలుసుకుందాం.

- మనసులో ఎప్పుడూ ఆందోళన.
- నిరాశ, నిస్పృహ, జీవితంపై నిరాసక్తత.
- కోపం, బాధ, చిరాకు, చేసే పనిపై ఆసక్తి లేకపోవడం.
- జీవితం అగమ్యగోచరంగా ఉండటం.
- శరీరంలో శక్తి లేనట్లుగా ఉండటం.
- ఆకలి లేకపోవడం, లేదంటే విపరీతంగా ఆకలేయడం.
- ఏకాగ్రత లోపించడం, మతిమరుపు, నిద్రపట్టకపోవడం.
- శృంగారం పట్ల ఆసక్తి లేకపోవడం.
- ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు రావడం.

డైనింగ్ టేబుల్ శుభ్రత ముఖ్యం

డైనింగ్ టేబుల్ ప్రతీ ఇంట్లో తప్పకుండా ఉంటుంది. కానీ సరిగ్గా శుభ్రం చేసుకోకుండా పెట్టుకుంటారు. మీ డైనింగ్ టేబుల్ ఎప్పుడూ కొత్తగా ఉండాలనుకుంటున్నారా.. అయితే ఇలా చేయండి చాలు.

- డైనింగ్ టేబుల్ మీద స్టాండ్ లేకుండా వేడి పదార్థాలను ఉంచిన గిన్నెలను పెట్టకూడదు. డైనింగ్ ప్లేట్లను టేబుల్ మీద పెట్టేటప్పుడు తప్పనిసరిగా మేట్స్‌ను ప్లేట్ అడుగున ఉంచాలి.
- భోజనానికి ముందు టేబుల్ మీద దుమ్ములేకుండా మెత్తటి బట్టతో శుభ్రంగా తుడిచి ఆహార పదార్థాలను, ప్లేట్లను, గ్లాసులను అమర్చాలి. భోజనమయిన వెంటనే టేబుల్ మీద ఉన్న ప్లేట్లను, గిన్నెలను, గ్లాసులను తీసేసి.. టేబుల్‌ని శుభ్రం చేసేయాలి.





- కరెంటు పోయిన సమయంలో కొవ్వొత్తి వెలిగించి భోజనం చేస్తున్నప్పుడు ఆ కొవ్వొత్తిని స్టాండ్ లేకుండా టేబుల్ మీద పెట్టకూడదు.
- డైనింగ్ టేబుల్ మీద ఉపయోగించే స్టాండ్స్, మేట్స్ టేబుల్ మీదనే ఉంచేయకూడదు. వాటిని వేరేచోట శుభ్రంగా పెట్టాలి. డైనింగ్ టేబుల్ మీద చక్కగా అందమైన ఫ్లవర్ వాజ్‌ను ఉంచితే ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

నేను - సుడిగుండం

(నవల) 35



పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి

"చిన్నప్పటి భక్తి నుండి నేను మారిపోయాను. ఇప్పుడు భక్తి ఛానల్ అంటే..." అన్నాను.

"మనం ప్రకటనల విషయంలో రాయితీలు యివ్వాలి. ప్రకటనల ధరలు తగ్గించమంటే కుదరదు. అందుకని బోనస్ ఏడ్స్ కింది ఈ ఛానల్‌ని వాడుకుందాం. ఇప్పుడు మన దగ్గర ప్రవచించే వారికి కొదవ లేదు" అన్నాడు.

చిన్నగా తలూపాను.

"అన్ని ఛానల్స్ ని ఓవరాల్‌గా నువ్వే చూసు కుంటావు. నీకు అందులో ఏదయినా ఒకదాన్ని పూర్తిగా నీకే యిస్తాను. అది నువ్వు చూజ్ చేసుకో. అందులో నువ్వు నీ అభిరుచి ప్రకారం దేన్నయినా ప్రచారం చేసుకో" అన్నాడు రమాకాంత్!

****

ఆ తర్వాత పార్టీ అధ్యక్షుడు ప్రస్తుతానికి ఛానల్ ఆలోచనను విరమించుకున్నామని అన్నాడు. "భవిష్యత్‌లో అలాంటి ఆలోచన చేయవచ్చు" అంటూ "ఎప్పుడయినా నీకు ప్రిఫరెన్స్ వుంటుంది" అని జోడించాడు.

****

నేను ఢిల్లీ వెళ్లాను - ఆఫీస్ పనుల కోసం.

అప్పుడు అమితను కలుసుకున్నాను.

"ఈ ఎన్.జి.ఓ.ల గురించి నీకు తెలుసు. వారికి ఓ ఎజెండా వుంటుంది. అయినా నేను ఎంతకాలం వుంటానో తెలియదు. ఉన్నంతకాలం నేను చేయాలను కున్నది చేస్తాను. ప్రస్తుతం ఓ ప్రాజెక్టుకి వ్యతిరేకంగా మేధావులని కలుస్తున్నాం. అలాగే అక్కడ నష్టపోతున్న జనాన్ని కూడగట్టే ప్రయత్నం మొదలవుతుంది" అంది.

"నువ్వు ఓ హాస్పటల్ పెడితే బాగుండేదేమో" అన్నాను.

"చిన్నదయినా నేను పెట్టవచ్చు. కార్పొరేట్ ఆసుపత్రుల నుండి ఆఫర్స్ వున్నాయి. కన్సల్టెంట్‌గా వుండమన్నారు. నేను బేసికల్‌గా డాక్టర్ని కాదుగా"

"అయితే ప్రొఫెసర్‌గా జాబ్ చేయాల్సింది" అన్నాను.

"ఈ ప్రాజెక్టు గురించి విన్నాక ఇందులో పని చేయాలనిపించింది. ముందు ముందు ఎలాంటి నిర్ణయం తీసుకుంటానో తెలియదు" అని

"నీ కార్యక్రమాల గురించి తెలుసుకుంటు న్నాను. అందులో నాకు కొన్ని అభ్యంతరాలున్నాయి ప్రభాత్"

"చెప్పు"

"నీ సర్కిల్ మారిపోయింది. ఒకప్పుడు నువ్వు నేల మీద వున్నావు. నేల మీద నడిచావు. ఇప్పుడు ఆకాశంలో విహరిస్తున్నావు" అంది.

"సూటిగా చెప్పు అమితా" అన్నాను.

"ఇదివరకటిలా చిన్న చిన్న సమస్యలు నిన్ను కదిలించటం లేదు అనుకుంటాను"

"అలా ఎందుకు అనుకుంటున్నావు?"

"నువ్వు వార్తల్లో వుండేవారికి ప్రాధాన్యం ఇస్తున్నావు. ఒకప్పుడు సినిమా మీద నీ దృష్టి వేరు. ఇప్పుడు ఆడియో వేడుకల్ని మీరు నిర్వహిస్తున్నారు. హీరోలని ప్రమోట్ చేస్తున్నారు. వందల కోట్ల కలెక్షన్లు వస్తున్నాయని మీరు ప్రజల్ని నమ్మిస్తున్నారు. అలాగే ఇంకొన్ని...."

"ఇలాంటివి తప్పదు కదా అమితా..."

"మీ దగ్గర పెట్టుబడి వుంది. ఆల్టర్‌నేటివ్ సినిమాని మీరు ఎందుకు తీయరు. మీ ఛానల్లో కొత్త కొత్త నినాదాలు వస్తుంటాయి. ఆ సినిమాలు డబ్బుని తీసుకు రాకపోవచ్చు. కొద్దిపాటి నష్టాలను కూడా మీరు భరించలేరా?"

నావరకు ఇలాంటి ఆలోచన రాలేదు. మేం మంచి సినిమాల్ని ప్రమోట్ చేస్తున్నామని అమితకు చెప్పటం జవాబు కాదు. రమాకాంత్‌తో మాట్లాడాలి.

"మనుషులు మారకూడదని నేను అనను. అయితే ఆ మార్పు మానవులకు ఉపయోగపడాలి. ముందు ముందు చర్చ 'నీతి' మీద నడుస్తుంది" అంది.



నేను మాట్లాడలేదు.

"నువ్వు నిదాతో ఆగిపోయావు. మళ్లీ ఆడపిల్ల పుడుతుంది అనుకున్నావా?"

"ఇది అన్యాయం. నాకు వారసులు అవసరం లేదు అనుకోవచ్చుగా. ముందు నీ సంగతి చెప్పు" అన్నాను.

"నేను టెస్టులు చేయించుకున్నాను. రావ్‌గారూ చేయించుకున్నారు. పిల్లలు పుట్టరు అని ఎవరూ చెప్ప లేదు. మందులు వాడుతున్నాను. రావ్‌గారు తీరిక దొరికిన ప్పుడు బాధ పడతారు" అంది.

"నేను కూడా వద్దనుకోలేదు. ముందు ముందు ఏం జరుగుతుందో నాకు తెలియదు" అన్నాను.

****

అయిదో అధ్యాయం

అనిందిత!

'అనిందిత' అనే పేరు బాగుందా" అని నాకు అమ్మాయి పుట్టినప్పుడు పేరు చెప్పమంటే అంది అమిత.

ఇప్పుడు 'అనిందిత' అనే స్త్రీతో పరిచయం అయ్యాక కాస్త థ్రిల్లింగ్‌గా అనిపించింది.

మేం ఇంగ్లీష్‌లో ఛానల్ మొదలు పెట్టాలను కున్నప్పుడు కలిసింది ముంబయ్‌లో. అప్పటికే ఎస్టాబ్లిష్ అయిన సంస్థలు వున్నాయి. అలాంటి చోట విపరీతమైన పోటీ వుంది. మేం ఈ ఛానల్ ఛాలెంజింగ్‌గా తీసుకున్నాం.

రకరకాల చర్చలు. మధ్యలో ఢిల్లీ, బెంగళూర్ ప్రయాణాలు. నేను ఈ కాలమంతటిలోనూ హిందీ, ఇంగ్లీష్ మీద పట్టు సాధించాను. ఇతర భాషల్లో గొప్పగా ప్రవేశం లేకపోయినా అర్థం అవుతాయి. అవసరం అన్నిటినీ నేర్పిస్తుంది అంటారు.

ఆరు నెలల కాలంలో నేను ఇంటికి రెండుసార్లు రావటం జరిగింది. అది కూడా ఆఫీస్‌లోనే సరిపోయింది. ఇక్కడ కూడా లుకలుకలు మొదలు అయ్యాయి. ఇంతకుముందు టీమ్‌గా వర్క్ చేసాం. ఇప్పుడు కొత్త రాష్ట్రం కోసం ఉద్యమం మొదలయింది. అంతకుముందే ఇది మొదలయినా, తీవ్రత లేదు.

ఆంధ్రా, తెలంగాణా అనే ఫీలింగ్ పత్రికా రంగంలోనూ విజువల్ మీడియాలో ప్రవేశించింది. ఇక్కడ పనిచేసేవారిలో ఎక్కువ భాగం వామపక్ష ఉద్యమాలతో ఏదో రకంగా సంబంధం వున్నవారే. ఆ ఉద్యమాల్లోనే ఎన్నో చీలికలు వున్నాయి. తర్వాత స్త్రీలు, దళితులు, మైనారిటీలు, బీ, సీ వర్గాల కులాలు ఇలా ఎవరి అస్తిత్వం వారిది.

అప్పటిదాకా స్నేహపూర్వకంగా పని చేసిన వారు కులం, మతం, ప్రాంతంగా చీలిపోయారు. ముందు ఇవన్నీ అస్తిత్వంలో భాగంగా మొదలయ్యాయి. అన్యాయం జరిగిన ప్రతి ప్రాంతం, భాష, యాస, పండగలు, అన్నింటినీ చర్చిస్తున్నారు. అవి ఎంతగా మారిపోయా యంటే ఒకరి మీద ఒకరికి ద్వేషం, అనుమానం. అన్ని ఉద్యమ పార్టీలో పనిచేసిన వారి నుండి కొంతమంది బయటకు వచ్చారు.

ఇవన్నీ సహజం అనుకుంటూ వచ్చాం. అప్పుడు ఎవరో అన్నారు. ప్రపంచీకరణ కూడా సహజం అంటూ, ఇదివరకు ప్రధానంగా భావ, భౌతిక దృష్టి మాత్రం వుండేది. ఇప్పుడు అనేక దృష్టులు వచ్చాయి. ఎవరికి వారు తమ దృష్టి మాత్రమే సరయింది అనుకుంటున్నారు.

గ్లోబలైజేషన్ సృష్టిస్తున్న విష పరిణామం ఇది. అయితే ఈ వాతావరణం సంయమనంతో ఆలోచించే వారిని వెక్కిరించటం చేస్తుంది.

వ్యాపారం చేసేవారికి ఇవన్నీ పట్టవు. అవసరం అయితే విప్లవం గురించి, మతం గురించి, కులం గురించి ఎంతయినా స్పేస్ ఇస్తారు. ఒక్క సంతకంతో ఎవరయినా బయటకు పంపగలరు. అలా రమాకాంత్ కొంతమందిని బయటకు పంపాడు. దాంతో చిన్న భయం ఏర్పడింది. అంతేకాదు ముందు ముందు జీతాలు తగ్గుతాయని. ప్రకటనల ఆదాయం తగ్గిందనే ఫీలర్లు ఎంప్లాయిస్‌లో ఆందోళనను కలిగించాయి.

అందుకే వారు తమ ఆవేశాలు అణుచుకుని పని చేస్తున్నారు.

ఇవి ఎప్పుడయినా మళ్లీ ఎగదన్నవచ్చు. అయితే అందరూ అప్పటికప్పుడు ఆవేశంగా బయటకు వెళ్లరు. ఆర్థికంగా ఎవరో ఒకరి అండ వుంటే తప్ప.

నేను చూసిన వారిలో అనిందితను మించి డైనమిక్‌గా వున్నవారు లేరు. తన ప్రవర్తనలో, మాటల్లో ఎక్కడా ఆడా, మగా అన్న తేడా వుండదు.

అనిందితకు ఇంతకుముందు పెళ్లి అయింది. వారిద్దరికీ పడలేదు. డివోర్స్ తీసుకున్నారు. ఓసారి అడిగాను. మళ్లీ మ్యారేజ్ చేసుకోవచ్చు కదా అని.

"మైగాడ్... మ్యారేజా! ఓసారి దాని అందమేంటో చూసాను. ఇంకోసారి అలాంటి అనుభవం అవసరం లేదు" అంది.

మేం రాత్రిపూట కూడా ఎక్కువ సమయం ఆఫీస్‌లో వుండేవాళ్లం. తను తన కారులో వెళ్తాను అనేది. నేను ఒప్పుకునే వాడిని కాదు. డ్రైవర్‌ని పంపించేవాడిని. ఆ రోజు రాత్రి డ్రైవర్ లేదు.

"బై ప్రభాత్" అంది బయలుదేరుతూ.

"మీ ఫ్లాట్ నాకు చూపించవా?" అన్నాను.

"వైనాట్" అంది.

నేను కారు డ్రైవ్ చేస్తున్నాను. తను మ్యూజిక్ వింటోంది. మధ్యలో ఓ చోట కారు ఆపింది. సాఫ్ట్ డ్రింక్స్, ఇంకేవో తినుబండారాలు తీసుకుంది.

ఫ్లాట్‌కి వెళ్లాం. అప్పటికే మేం భోజనం చేసాం. తన అభిరుచికి తగ్గట్లు డిజైన్ చేసుకుంది. తను ముంబయ్‌లో వుంటోంది కాబట్టి మోడ్రన్ డ్రస్‌లు ధరిస్తుంది. హైదరాబాద్‌లో ఆడపిల్లలు అలాంటివి తొడు క్కోరని కాదు. నగరం నగరానికి తేడాలు వుంటాయి.

"నేను బయలుదేరతాను" అన్నాను.

"వెయిట్ బాబా" అంటూ సాఫ్ట్ డ్రింక్, లైట్‌స్నాక్స్ తీసుకు వచ్చి ఎదురుగా కూర్చుంది.

"ఇప్పుడేగా భోజనం అయింది" అన్నాను.

"అందుకే ఇవి" అని....

(ఇంకా ఉంది)

పోటీ పరీక్షలకు కరెంట్ ఎఫైర్స్ సాధన కూడా కీలకమే



గ్రూప్స్, సివిల్స్, ఇతర పోటీ పరీక్షల్లో వర్తమాన అంశాల (కరెంట్ ఎఫైర్స్)కు ప్రాముఖ్యం ఏటా పెరుగుతోంది. ఇటీవల వీటి సరళి మారింది. సంపూర్ణమైన అవగాహన ఉంటేనే జవాబు గుర్తించగలిగేలా ప్రశ్నలను లోతుగా అడుగు తున్నారు. 'కరెంట్ అఫైర్సే కదా, పరీక్షలకు కొద్దిరోజుల ముందు చూసుకుంటే చాలు' అని తక్కువ అంచనా వేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సివస్తుంది. ఉద్యోగార్థులు ఈ విషయం గుర్తుంచుకుని, చదివే పద్ధతిలో మార్పు చేసుకోవాలి. అప్పుడే పోటీలో ముందు నిలిచి, విజయానికి పునాది వేసుకోగలుగుతారు.

పోటీ పరీక్షల్లో దేనికి హాజరవుతున్నా తప్పనిసరిగా కనిపించే అంశం- వర్తమాన వ్యవహారాలు. సబ్జెక్టు విస్తృతమైనప్పటికీ జనరల్ స్టడీస్‌లోని ఇతర సబ్జెక్టులతో కూడా ముడిపడి ఉన్న నేపథ్యంలో ఉత్సాహంతో అనుసంధాన పద్ధతిలో సన్నద్ధత కొనసాగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. దాదాపు అన్ని పరీక్షల సిలబస్‌లోనూ మొదట పేర్కొనే అంశం కరెంట్ అఫైర్సే. 'జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న సంఘటనలుటీ వర్తమాన అంశాలు- జాతీయం, అంతర్జాతీయం, ప్రాంతీయం' అంటూ సిలబస్‌లో కరెంట్ అఫైర్స్‌ని పేర్కొన్నారు. దీన్ని రెండు భాగాలుగా పేర్కొనడం ద్వారా ఎక్కువ ప్రాధాన్యం ఉన్నట్లు చెప్పకనే చెప్పారు.

మనకు తెలిసి, మన కళ్ల ముందు జరుగుతున్న పరిణామాల కలయికే వర్తమాన వ్యవహారాలు. కాకపోతే జాతీయ, అంతర్జాతీయ, ప్రాధాన్యం ఉన్న సంఘటనలు కొంచెం లోతుగా ఉంటాయి. ఈ విభాగంపై అవగాహన పెంచుకోవాలంటే గతంలో జరిగిన పరిణామాలపై కూడా పట్టు అవసరం. సాధన చేస్తే ఈ స్థాయికి తేలిగ్గానే చేరుకోవచ్చు. ఈ విభాగంలో ఇటీవల జరిగిన ప్రముఖ సదస్సులు - సమావేశాలు, ప్రముఖుల విదేశీ పర్యటనలు, దేశాల మధ్య కుదిరిన ఒప్పందాలు - సహాయ సహకారాలు, అంతర్జాతీయ సంస్థలు, శాస్త్ర సాంకేతికరంగ విజయా లను భారత కేంద్రంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

ఇక వర్తమాన అంశాలు- జాతీయం, అంతర్జాతీయం, ప్రాంతీయం అనే విభాగం.. దీని గురించి అభ్యర్థులు పెద్దగా భయపడాల్సిందేమీ లేదు. సాధారణంగా ప్రతిరోజూ వార్తలను అనుసరించేవారికి ఈ విభాగంలో పట్టు ఉంటుందనే చెప్పాలి. వార్తల్లో వ్యక్తులు, ప్రదేశాలు, దేశ విదేశాల్లో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రముఖ సంఘటనలు, క్రీడలు, అవార్డులు, ఇటీవల జరిగిన ఎన్నికలు, ఆర్థికంగా, రాజకీయంగా చోటు చేసుకున్న పరిణామాలు, తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులు, పథకాలు, మంత్రివర్గాలు ఇలా అన్నింటిపై అవగాహన పెంచుకుంటే ఈ విభాగంలో మార్కుల సాధన తేలికే.

సొంత నోట్సు ఉత్తమం

కరెంట్ అఫైర్స్ ప్రిపరేషన్‌లో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సొంతంగా నోట్స్ తయారుచేసుకోవడం ఉత్తమ ఫలితాలనిస్తుంది. సమయం ఎక్కడ ఉంటుందనుకుంటున్నారా? అది మన చేతుల్లో పనే. రోజూ గంట సమయాన్ని దినపత్రికలు చదువుతూ ముఖ్యమైన విషయాలను నోట్స్ రూపంలో రాసుకోవడం అత్యుత్తమ ఫలితాలనిస్తుంది. దీనివల్ల గణాంకాలు, సమాచారాన్ని తప్పుగా రాసుకోవడం, అనవసరపు విషయాలను చదవడం లాంటి సమస్యల నుంచి బయటపడవచ్చు. సబ్జెక్ట్‌పై ఆసక్తి పెరుగుతుంది. పునశ్చరణ త్వరగా పూర్తవుతుంది. దీంతోపాటు ప్రశ్నల సరళిపై కూడా అవగాహన రావచ్చు. గ్రూప్ 1 మెయిన్స్ పేపర్ 1 జనరల్ ఎస్సే విభాగానికి కూడా ఈ ప్రాక్టీస్ ఉపయుక్తంగా ఉంటుంది. సొంత నోట్సుతో పాటు యోజన, ఆంధ్రప్రదేశ్ లాంటి ప్రభుత్వ మ్యాగజైన్లను చదవాల్సి ఉంటుంది.



సిలబస్‌లోని కొన్ని విభాగాలతో కరెంట్ అఫైర్స్ ముడిపడి ఉండటం కూడా అభ్యర్థులకు అనుకూలిస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆర్థిక రంగం, భారత రాజకీయ వ్యవస్థ, విపత్తు నిర్వహణ, పర్యావరణ అంశాలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనే విభాగాలు వర్తమాన వ్యవహారాలతో సంబంధం కలిగి ఉంటాయి. కాబట్టి ఒక్క కరెంట్ అఫైర్స్ ప్రిపరేషన్‌తో జనరల్ స్టడీస్‌లోని కీలక విభాగాలపై కూడా కొంత పట్టు సాధించవచ్చు. కరెంట్ అఫైర్స్‌ను ఇది మన సబ్జెక్ట్ అని సొంతం చేసుకుని తయారైతే అన్ని విభాగాల్లో ప్లస్ అవుతుంది. స్థూలంగా అంతర్జాతీయం, జాతీయం, ప్రాంతీయం అంటూ చెప్పుకొనే కరెంట్ అఫైర్స్‌ను సూక్ష్మంగా చూస్తే రాష్ట్రీయం, ఆర్థిక రంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, అవార్డులు, క్రీడలు, వార్తల్లో వ్యక్తులు, మరణాలు, నియామకాలు, కమిటీలు - కమిషన్లు, గ్రంథాలు - రచయితలు, సదస్సులు - సమావేశాలు, పర్యటనలు, నివేదికలు - సర్వేలు, దినోత్సవాలు, వార్తల్లో ప్రదేశాలు అనే ఉపవిభాగాలుగా అంతర్జాతీయం, జాతీయం, ప్రాంతీయం అనే అంశాలకు అన్వయించుకోవచ్చు.

ప్రశ్నల తీరు మారింది

ఇటీవల జరిగిన పరీక్షలను గమనిస్తే కరెంట్ అఫైర్స్ ప్రశ్నల సరళిలోనూ మార్పు వచ్చినట్లు స్పష్టమవుతోంది. గతంలో ప్రశ్నలను ఒక అంశానికి సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానం లేదా ఏదో ఒక ముఖ్యమైన విషయాన్ని కేంద్రంగా చేసుకుని అడిగేవారు. కానీ ఇటీవలి కాలంలో ఆ అంశానికి సంబంధించిన పూర్తి పరిజ్ఞానం అభ్యర్థికి తెలిసి ఉంటేనే జవాబు గుర్తించగలిగేలా ప్రశ్నలను లోతుగా అడుగుతున్నారు. కాబట్టి అభ్యర్థులు ఒక అంశానికి సంబంధించి చదివేటప్పుడు ఆసాంతం దానిపై అవగాహన ఏర్పరచుకోవడం ఉత్తమం. ఒక అంశం వార్తల్లో వచ్చినప్పుడు అది పరీక్షలో ప్రశ్నగా మారే అవకాశం ఎంతవరకుందనేది గుర్తించగలగాలి. ఆ స్థాయికి చేరుకుంటే సమయం ఆదా అవుతుంది. దీనికి పెద్దగా కష్టపడాల్సింది కూడా ఏమీ లేదు. ఒక అంశాన్ని చదివేటప్పుడు ఆ అంశం ప్రభావం, దాని పరిధి, కాలమాన పరిస్థితుల్లో దాని నేపథ్యం లాంటివి ఒక్కసారి కూలంకషంగా పరిశీలిస్తే సరిపోతుంది.

పరీక్షకు వెళ్లేవరకూ...

ప్రశ్నల కాలావధిపై కూడా అభ్యర్థులు ఓ కన్నేయాలి. గతంలో పరీక్షకు ముందు ఒక నెల వదిలిపెట్టి ప్రశ్నలు అడిగేవారు. పోటీ పెరుగుతున్న నేపథ్యంలో పరీక్షకు ఒక వారం, పదిరోజుల ముందు జరిగిన సంఘటనలపై కూడా ప్రశ్నలు అడుగు తున్నారు. అంటే కరెంట్ అఫైర్స్ సన్నద్ధత అనేది పరీక్షకు వెళ్లేవరకూ కొన సాగాలి. పరీక్షకు ముందు 6 నెలల నుంచి 8 నెలల కాలంలో చోటు చేసుకున్న పరిణామాలు ప్రశ్నల రూపంలో ఎదుర్కోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు గమనించా ల్సిన మరో విషయం ఏమిటంటే ఒక నాలుగైదు ప్రశ్నలు కాలవ్యవధితో సంబంధం లేకుండా వచ్చే అవకాశం ఉంటుంది. ఆ సంఘటనల ప్రభావం ఇప్పటికీ కొనసాగుతున్నప్పుడు ఇలాంటి ప్రశ్నలు చోటు చేసుకుంటాయి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ముఖ్యమైన చట్టాలు, దేశవిదేశాల్లో సంచలనం సృష్టించిన ఘటనలు, ఉగ్రవాద దాడులు, ముఖ్యమైన క్రీడా విశేషాలు, శాస్త్ర సాంకేతిక విజయాలు ఈ కోవకు చెందినవే. ఇలాంటివి అభ్యర్థి ఉద్యోగిగా మారే వరకూ గుర్తు పెట్టుకోవాల్సి ఉంటుంది.

బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు 'నాటా-2019' నోటిఫికేషన్

బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్) కోర్సుల్లో ప్రవేశించాలనుకునేవారు నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా) పరీక్ష రాయాల్సి ఉంటుంది.. 2019-2020 విద్యా సంవత్సరానికి సంబంధించి నాటా-2019కు నోటిఫికేషన్ విడుదలైంది.

ఈ సంవత్సరం నుంచి ది కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్(సీఓఏ).. నాటాను సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించనుంది. నాటాలో పొందే స్కోర్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపుపొందిన ఆర్కిటెక్చర్ కళాశాలల్లో బీఆర్క్ కోర్సులో చేరొచ్చు.

కోర్సు పేరు : బీఆర్క్(బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్).

కోర్సు వ్యవధి : ఐదేళ్లు

అర్హతలు : మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం మార్కులతో, మొత్తంగా కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత సాధించాలి. ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి : 2019, జులై 31 నాటికి 17 ఏళ్లు నిండాలి.

పరీక్ష విధానం :

నాటా మొత్తం 200 మార్కులకు ఉంటుంది. ఇందులో 2 భాగాలు, పార్ట్-ఎ, పార్ట్-బి ఉంటాయి.

పార్ట్-ఎకు 120 మార్కులు కేటాయించారు. ఈ విభాగాన్ని 60 నిమిషాల్లో పూర్తిచేయాలి. ఇందులో మ్యాథమెటిక్స్ నుంచి 20 ప్రశ్నలు, జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి 40 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు. అంటే.. మ్యాథ్స్ 40 మార్కులకు, జనరల్ ఆప్టిట్యూడ్‌కు 80 మార్కులకు ఉంటుంది. ఇది ఆన్‌లైన్ పరీక్ష.

పార్ట్-బి డ్రాయింగ్ పరీక్ష. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఏ4 సైజు పేపర్‌పై రెండు ప్రశ్నలకు డ్రాయింగ్స్ గీయాలి. ఒక్కో ప్రశ్నకు 40 మార్కుల చొప్పున మొత్తం 80 మార్కులకు డ్రాయింగ్ పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు రెండు సెక్షన్లలో విడివిడిగా కనీసం 25 శాతం మార్కులు సాధిస్తే అర్హత లభిస్తుంది.

జూలై 7న నిర్వహించే పరీక్ష కూడా ఇదే విధానంలో ఉంటుంది. మెరుగైన ర్యాంకు కోసం లేదా మొదటిసారి పరీక్ష రాయలేని వారు రెండోసారి జరిగే పరీక్షకు హాజరుకావచ్చు.

సిలబస్ :

పార్ట్-ఏలోని మ్యాథ్స్, జనరల్ ఆప్టిట్యూడ్ విభాగాల్లో... ప్యూర్ మ్యాథ్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఆల్జీబ్రా, లాగారిథమ్స్, మాట్రిసెస్, ట్రిగనామెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, 3 డైమెన్షనల్ కోఆర్డినేట్ జామెట్రీ, థియరీ ఆఫ్ క్యాలికులస్, అప్లికేషన్ ఆఫ్ క్యాలికులస్, పర్ముటేషన్ అండ్ కాంబినేషన్, స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ అధ్యాయాల నుంచి మ్యాథ్స్ సెక్షన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. జనరల్ ఆప్టిట్యూడ్ సెక్షన్‌లో.. మ్యాథమెటికల్ రీజనింగ్, సెట్స్ రిలేషన్స్, ఆర్కిటెక్చర్ అండ్ నిర్మాణాలకు సంబంధించిన ఆబ్జెక్ట్స్, డ్రాయింగ్‌కు సంబంధిన ప్రశ్నలు అడుగుతారు. వీటితోపాటు జాతీయ, అంతర్జాతీయ ఆర్కిటెక్ట్స్, ప్రఖ్యాత ఆర్కిటెక్చరల్ క్రియేషన్స మీద జనరల్ అవేర్‌నెస్ ప్రశ్నలు ఉంటాయి. అనలిటికల్ రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ(విజువల్, న్యూమరికల్, వెర్బల్)పై కూడా ప్రశ్నలు ఎదురవుతాయి.

పార్ట్ బీ డ్రాయింగ్ టెస్ట్‌లో అభ్యర్థిలోని సృజనాత్మకతను పరీక్షించే విధంగా డ్రాయింగ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో నిర్ణీత ఆకారం లేదా వస్తువును అభ్యర్థి ముందుంచి.. దాని ఆధారంగా ఊహాశక్తితో డ్రాయింగ్ వేయమంటారు. ఒక వస్తువును పలు కోణాల్లో చిత్రించమనడం, నిర్ణీత ఆకారానికి ఆకట్టుకునే రంగులు వేయడం వంటి ప్రశ్నలు ఉంటాయి. నిజ జీవితంలో ఎదురైన సంఘటనలను ఊహించుకుంటూ.. వాటికి సంబంధించిన పెన్సిల్ చిత్రాలను గీయమంటారు. ఈ పేపర్ వాల్యూయేషన్‌ను ఒకరి కంటే ఎక్కువ ఎగ్జామినర్లు చేస్తారు. వారు ఇచ్చిన మార్కులను సగటు చేసి తుది మార్కులు కేటాయిస్తారు. అంతిమంగా ఈ సెక్షన్ అభ్యర్థి డ్రాయింగ్ నైపుణ్యాలు, ఊహా శక్తి, పరిశీలన దృక్పథాన్ని అంచనా వేసే పరీక్ష.

ఆర్కిటెక్చర్లు ఏం చేస్తారు?

అత్యాధునిక ఎయిర్‌పోర్టు టర్మినల్స్.. అందమైన స్టేడియాల నిర్మాణం.. ఇలా ఒకటేమిటి ఎన్నో అద్భుతమైన కట్టడాలు, నిర్మాణాలు, వంతెనలు, టవర్స్‌కు ఆద్యులు ఆర్కిటెక్చర్ ఇంజనీర్లు. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు, విశాలమైన హోటల్స్, భారీ ఆసుపత్రుల డిజైన్, నిర్మాణంలో ఆర్కిటెక్చర్లు ప్రధాన పోషిస్తారు. సుందర మైన డిజైన్లతో వెలుస్తున్న కట్టడాలు, నిర్మాణాల వెనక సివిల్ ఇంజనీర్లతో పాటు ప్రధాన పాత్ర ఆర్కిటెక్టుదే. ఇటీవల కాలంలో సృజనాత్మక ఆర్కిటెక్టులకు డిమాండ్ కనిపిస్తుంది.

క్లయింట్లకు నచ్చిన విధంగా కట్టడాలను ప్లాన్ గీయడం, అందరూ మెచ్చే రూప మివ్వడం ఆర్కిటెక్చర్ ఇంజనీర్ల ప్రధాన విధి. నిర్మాణ ప్లాన్ రూపొందించడం.. నిర్మాణం ప్రారంభించడం కోసం సంబంధిత శాఖల అనుమతులు.. సివిల్ ఇంజనీర్లు, సర్వేయర్లు తదితర నిపుణుల బృందంతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది.

ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ ఔత్సాహికులకు సృజనాత్మకత, పరిశీలన జ్ఞానం, విశ్లేషణ నైపుణ్యాలు, మ్యాథమెటికల్ ఎబిలిటీ, డ్రాయింగ్ స్కిల్స్ ఉండాలి. ఈ రంగంలో వస్తున్న మార్పులను నిరంతరం అందిపుచ్చుకునే నేర్పు సొంతం చేసుకోవాలి.

ఉన్నత విద్య : బీఆర్క్ కోర్సు పూర్తయ్యాక ఆసక్తి ఉంటే.. అనేక ఉన్నత విద్యావకాశాలు సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఉన్నత విద్య పరంగా పీజీ స్థాయిలో ఎంఆర్క్ కోర్సుల్లో చేరొచ్చు. పీజీలో అర్బన్ డిజైనింగ్, రీజనల్ ప్లానింగ్ వంటి అనేక స్పెషలైజేషన్లు అందుబాటులు ఉన్నాయి. పీజీ తర్వాత ఆసక్తి ఉంటే.. పీహెచ్‌డీ సైతం చేయవచ్చు.

ఉపాధి మార్గాలు..

బీఆర్క్ పూర్తిచేసిన వారికి ఇటీవల కాలంలో ఉద్యోగావకాశాలు పెరుగు తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ కోర్సు పూర్తిచేసుకున్న అభ్యర్థులు ప్రైవేటు రంగంతోపాటు ప్రభుత్వ రంగంలోనూ ఉద్యోగాలను సంపాదించు కోవచ్చు. టౌన్ ప్లానింగ్, మౌలిక వసతుల సముదాయాలు, రియల్ ఎస్టేట్ వెంచర్స్ వంటి వాటిల్లో అవకాశాలను పొందవచ్చు. ఆర్కిటెక్చర్ డిజైన్ సంస్థలు, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్ సేవల కంపెనీలు, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్ మెంట్, అర్బన్ డవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ వంటి వాటిల్లో అవకాశాలు పొందవచ్చు. దాంతోపాటు ప్రైవేట్ రంగంలోని నిర్మాణ సంస్థల్లోనూ అవకాశాలు లభిస్తాయి. సొంతంగా ఆర్కిటెక్చర్ కన్సల్టెంట్‌గా కూడా ఉపాధి పొందొచ్చు. ఏదైనా సంస్థలో కొంత కాలం పనిచేసి అనుభవం సొంతం చేసుకున్నాక.. సొంతంగా కన్సల్టెంట్ లుగా కెరీర్ ప్రారంభించవచ్చు.

ముఖ్య తేదీలు :


ఆన్‌లైన్‌లో దరఖాస్తు తేదీలు : మొదటిసారి పరీక్షకు దరఖాస్తులు : 2019, జనవరి 24 నుంచి మార్చి 11 వరకు.

రెండోసారి పరీక్షకు దరఖాస్తులు : 2019, జనవరి 24 నుంచి జూన్ 12 వరకు.

పరీక్ష కేంద్రాలు : తెలంగాణలో హైదరాబాద్, వరంగల్; ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, కాకినాడ, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.

- **మొదటి పరీక్ష తేదీ :** 2019, ఏప్రిల్ 14.
- **ఫలితాలు విడుదల :** 2019, మే 3.
- **రెండోసారి జరిగే పరీక్ష తేదీ :** 2019, జూలై 7.
- **ఫలితాలు విడుదల :** 2019 జూలై 21.
- **పరీక్ష ఫీజు :** రూ.1800 (ఎస్సీ/ఎస్టీలకు రూ.1500)
- **వెబ్‌సైట్ :** http://www.nata.in

శరవేగంగా తిరుగుతున్న కృష్ణబిలాన్ని కనుగొన్న భారత్, అమెరికా అబ్జర్వేటరీలు



అంతరిక్షంలోని భారత్, అమెరికాల అబ్జర్వేటరీలు శరవేగంతో తిరుగు తున్న ఒక కృష్ణబిలానిన కనుగొ న్నాయి. ఇది దాదాపుగా గరిష్టస్థాయి వేగంతో తిరుగుతోంది. భారత తొలి ఖగోళ అన్వేషణ ఉపగ్రహం 'ఆస్ట్రోశాట్', అమెరికా పరిశోధన సంస్థ నాసాకు చెందిన 'చంద్ర' ఎక్స్‌రే అబ్జర్వేటరీలు కలిసి ఈ ఖగోళ వస్తువును పసిగట్టాయి. '4యు 1630-47' అనే జంట తార వ్యవస్థలో ఈ కృష్ణబిలం కనిపించింది. తాజా కృష్ణబిలం భ్రమణ వేగానికి సంబంధించిన కొలతలను తీసుకోవడంలో ఆస్ట్రోశాట్‌లోని సాఫ్ట్ ఎక్స్‌రే టెలిస్కోపు, లార్జ్ ఏరియా ఎక్స్‌రే ప్రపోర్షనల్ కౌంటర్ (ఎల్ఏఎక్స్‌పీసీ)లు కీలక పాత్ర పోషించాయి. వీటిని చంద్ర అబ్జర్వేటరీ ధ్రువీకరించింది.

మన పాలపుంత సమీపంలో మరో గెలాక్సీ !



మన పాలపుంత సమీపంలో కనిపించకుండా ఉన్న ఓ భారీ నక్షత్ర మండలాన్ని (గెలాక్సీ) శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అత్యంత పలుచగా ఉన్న ఈ గెలాక్సీని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన గియా ఉపగ్రహం ద్వారా గుర్తించారు. ఈ గెలాక్సీ భారీ సైజులో ఉన్నప్పటికీ చాలా పలుచగా.. కొన్ని నక్షత్రాలను మాత్రమే కలిగి ఉండటంతో గెలాక్సీల నిర్మాణంపై ఇప్పటివరకు ఉన్న సంప్రదాయ సిద్ధాంతాలకు పలు సవాళ్లు ఎదురవుతున్నాయని లండన్ ఇంపీరియల్ కాలేజ్‌కు చెందిన పరిశోధకులు పేర్కొన్నారు. ఈ గెలాక్సీకి వారు యాంట్లియా-2 లేదా యాంట్-2 అని నామకరణం చేశారు. ఇది ఇప్పటివరకు ఏ పరిశోధనకు, ఏ గుర్తింపునకు అందలేదని శాస్త్రవేత్తలు తెలిపారు. తక్కువ సాంద్రత కలిగిన ఈ గెలాక్సీ.. మన పాలపుంతకు చెందిన ప్రకాశవంతమైన కేంద్రభాగం వెనుక దాగి ఉన్నదని వెల్లడించారు.

హ్యాకింగ్‌కు వీలుకాని క్రిప్టో ఫోన్..!



మాస్కో: హ్యాకింగ్‌కు వీలుకాని క్రిప్టో ఫోన్‌ను రష్యాకు చెందిన ఒక సంస్థ తయారు చేసింది. ఈ ఫోన్‌ను హ్యాక్, వైర్‌టాప్ చేయడం అసాధ్యమని ఈ కంపెనీ చెబుతోంది. రష్యాకు చెందిన రోస్‌టెక్ సంస్థ క్రూయిజ్-కె పేరుతో ఒక స్మార్ట్ ఫోన్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ధర 1,298 డాలర్లు. వాణిజ్య పరంగా విక్రయానికి సిద్ధమైన ఈఫోనును వ్యక్తులకు విక్రయించరు. ఏవైన సంస్థలు మాత్రం ఆర్డర్‌పై వీటిని కొనుగోలు చేయవచ్చు.దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఇచ్చేందుకు రోస్‌టెక్ నిరాకరించింది. దీనికి సంబంధించిన ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఎవటోమేటికా అనే రోస్‌టెక్ అనుబంధ సంస్థ అభివృద్ధి చేసింది. క్రూయిజ్ కె సాంకేతికతను రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసు సంస్థ ధ్రువీకరించింది. రష్యాలో ఇదే తొలి క్రిప్టో ఫోన్. దీన్ని రష్యా భద్రతా దళాలు, వ్యాపారుల కోసం డిజైన్ చేశారు. ఈ సంస్థకు చెందిన ఇంజినీరు ఫ్యోడర్ వోల్కోవ్ మాట్లాడుతూ " ఈ ఫోన్ వినియోగించే వ్యక్తి సమాచారం భద్రంగా ఉంటుంది. అటు వైపు మాట్లాడే వ్యక్తి కూడా ఇటువంటి ఐపీ ఫోన్‌నే వినియోగించాలి.

మొబైల్ ఫోన్‌లో కార్టున్ నెట్‌వర్క్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: చిన్నారులకు ఎంటర్టైన్మెంట్ అందిస్తూ ఎప్పటికప్పుడు సరికొత్త కార్యక్రమాలతో అలరిస్తున్న కార్టున్ నెట్‌వర్క్ ఇప్పుడు మొబైల్ ఫోన్‌లో కూడా సరికొత్తగా అందుబాటులోకి రానుంది. కార్టున్ నెట్‌వర్క్ వాచ్, ప్లే పేరుతో మొబైల్ యాప్‌ని రూపొందించారు. ఈ మొబైల్ యాప్‌లో ఇప్పటివరకు చిన్నారుల్ని అలరించిన అన్ని కార్టూన్ కేరక్టర్లు ఉన్నాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధార్ జైన్ తెలిపారు. వాటికి సంబంధించిన వివరాల్ని కూడా ఇందులో పొందుపరచడం జరిగిందని, వీటితో పాటు మిమ్మల్ని అలరించేందుకు ఫన్ గేమ్స్, వీడియోలు ఉన్నాయన్నారు. సాధారణంగా చిన్నారులకు ఫోన్ ఇవ్వాలంటే పెద్దవాళ్లు భయపడిపోతారని, కానీ ఇక్కడ ఈ యాప్‌ని చాలా సేఫ్‌గా రూపొందించినట్లు చెప్పారు. చిన్నారులకు కోసం ప్రత్యేకంగా తయారు చేసిన యాప్ అని, ఇందులో ఎలాంటి అనవసర కంటెంట్ రాదన్నారు. చిన్నారులు ఉపయోగించేందుకు చాలా సౌలభ్యంగా కూడా ఉంటుందని, ఈ యాప్‌లో చిన్నారులకు కార్టూన్స్ చూడడం, గేమ్స్ ఆడడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

విజ్ఞానం

దంతక్షయానికి దారితీసే టూత్ పేస్ట్‌లు



టూత్‌పేస్ట్ తియ్యగా ఉంటుందని ఎక్కువగా బ్రష్‌మీద వేసుకొని తోమే పిల్లల పళ్లు త్వరగా పుచ్చిపోయే అవకాశంఉంది. ఫ్లోరైడ్ అధికంగాఉం డటంతో డెంటల్ ఫ్లోరోసిస్‌కు అవకశాశం ఉన్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లల్లో పళ్లు ఏర్పడే దశలో అవసరాని కన్నా మించి టూత్‌పేస్ట్ వాడకంతో వయసుపెరిగేకొద్దీ పళ్లు దెబ్బతినే అవకాశంఉంది. మొదటి ఎనిమిదేళ్లవయసులో పళ్లపై ఫ్లోరోసిస్ ప్రభావం ఎక్కువగాఉంటుంది. తాగే నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్నట్లయితే పళ్లపగుళ్లు, కేవిటీలను మనం గుర్తించవచ్చు. దీనికితోడు సహజసిద్ధంగా కొన్ని ప్రాంతాల్లో నీటిలోనే ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉంటుంది. టాప్ వాటర్, టూప్ పేస్ట్, మౌత్‌వాష్‌లలో ఫ్లోరైడ్ ఉంటుంది. వేరుశనగ గుండంత పేస్ట్ సరిపోతుంది. 3 నుండి ఆరేళ్ల వయసుపిల్లల్లో 40శాతం పిల్లలు టూత్ బ్రష్ మొత్తం పేస్టుతో నింపి నోట్లోపెట్టుకుని తియ్యగా ఉండటంతో తింటుంటారు. ఇది గమనించి అరికట్టవలసిన బాధ్యత పెద్దలదే...

కేన్సర్ రిస్క్ నుంచి కాపాడుకుందాం...



ఇంట్లో కొద్దిపాటి మార్పులతో కేన్సర్ వంటి రిస్క్‌లను ఎదుర్కోవచ్చునని తెలుస్తోంది ఇల్లు అనేది సుఖ సంతో షాలకు ఆలవాలంగాఉండాలి. కేన్సర్ వంటి వ్యాధులను ఎదుర్కొనేందుకు ఇంట్లో కొద్దిపాటి మార్పులతో చెక్ చెప్పవచ్చు... శరీరంలో ఉండే సెల్స్ అసంఖ్యాకంగా పెరిగిపోవడమే కేన్సర్..భారతీయ మహిళల్లో బ్రెస్ట్ కేన్సర్ ఎక్కువవుతోంది. పురుషుల్లో అధికశాతం ప్రోస్టేట్, లంగ్, స్కిన్ కేన్సర్లకు గురవుతున్నారు. కేన్సర్‌కు చికిత్సపై ఇప్పటికీ పరిశోధన కొనసాగుతోంది. జీవనవిధానంలో మార్పులతో కొంతవరకు కేన్సర్‌ను అరికట్టవచ్చు..ఇంటిలో స్వల్ప మార్పులతో వ్యాధులనుండి దూరంగాఉండవచ్చు.

ఇంట్లో ఉంటే సానుకూల వాతావరణం, శుభ్రత ఆరోగ్యానికి మూలకారణం.. శుభ్రంగా ఉండే ఇంటిలో హానికారక క్రిములు ఉండవు.. సిగరెట్లు వంటివాటికి దూరంగాఉండటం, ఎలక్ట్రిక్ హోమ్ ప్యూరిఫైర్స్ నిషేధించి మొక్కలను పెంచడం ద్వారా పరిశుభ్రమైన గాలిని పీల్చుకో వచ్చు... పాకే చెట్లు పెంచడం ద్వారా దుమ్ము ధూళికి దూరంగా ఉండవచ్చు...

అమెజాన్, వాల్‌మార్ట్ మార్కెట్ విలువ ఢమాల్

ఒక్కరోజులో రూ.3,64,400 కోట్లు నష్టం

- అమెరికా స్టాక్ మార్కెట్లలో కుప్పకూలిన షేర్లు
- భారతీయ కొత్త ఈ-కామర్స్ విధానం దెబ్బ

న్యూఢిల్లీ : దేశంలో కొత్త ఈ-కామర్స్ విధానం రాక నేపథ్యంలో విదేశీ ఆన్‌లైన్ రిటైల్ దిగ్గజాల మార్కెట్ విలువ ఒక్కసారిగా హరించుకుపోయింది. అమెరికాకు చెందిన ఈ మార్కెటింగ్ సంస్థలు అమెజాన్, వాల్‌మార్ట్‌లు శుక్రవారం ఒక్కరోజే ఏకంగా 50 బిలియన్ డాలర్లకుపైగా మార్కెట్ విలువను కోల్పోయాయి. నాస్‌డాక్ స్టాక్ మార్కెట్‌లో అమెజాన్ షేర్ విలువ 5.38 శాతం పతనమై 1,626.23 డాలర్ల వద్ద స్థిరపడింది. దీంతో 45.22 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ శుక్రవారం ట్రేడింగ్‌లో ఆవిరైపోయింది. అలాగే న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌వైఎస్‌ఈ)లో వాల్‌మార్ట్ షేర్ విలువ 2.06 శాతం క్షీణించి 93.86 డాలర్ల వద్ద నిలిచింది. ఫలితంగా సంస్థ మార్కెట్ విలువ 5.7 బిలియన్ డాలర్లు పడిపోయింది. రెండు సంస్థలు కలిసి 50.92 బిలియన్ డాలర్ల (డాలర్‌తో పోల్చితే ప్రస్తుతం రూపాయి మారకం విలువ ప్రకారం దాదాపు రూ.3,64,400 కోట్లు) మార్కెట్ విలువను నష్టపోయాయి. అమెరికాలో శుక్రవారం మార్కెట్లు ముగిసే సమయానికి అమెజాన్ మార్కెట్ విలువ 795.18 బిలియన్ డాలర్లు, వాల్‌మార్ట్ మార్కెట్ విలువ 272.69 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

ఆందోళనలో ఈ-మార్కెటీర్లు

దేశీయ సంప్రదాయ మార్కెట్ ఆందోళనలు, పారదర్శక వ్యాపార విధానమే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు కొత్త ఈ-కామర్స్ పాలసీని అమల్లోకి తెచ్చింది. ఈ నెల 1 నుంచి ఈ నూతన విధానం అమల్లోకి రాగా, అప్పటిదాకా ఉన్న ఆన్‌లైన్ మార్కెటింగ్ జోష్ ఒక్కసారిగా చల్లబడింది. భారీ ఆఫర్లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్న ఈ-కామర్స్ సంస్థలు.. ఉత్పాదకదా రులతో నేరుగా సంబంధాలు పెట్టుకుంటున్నాయని, ఆయా ఉత్పత్తులను తమ ఆన్‌లైన్ వేదికల్లో విక్రయిస్తున్నాయని, ఇది మార్కెట్ నిబంధనలకు, ఆరోగ్యకరమైన పోటీకి వ్యతిరేకమని సంప్రదాయ మార్కెట్‌దారుల నుంచి కేంద్రానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వీటన్నిటికీ చెక్ పెడుతూ నూతన ఈ-కామర్స్ విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీంతో ఒక్క అమెజాన్ సంస్థనే రాత్రికిరాత్రి లక్షలాది వస్తువులను తమ వెబ్‌సైట్ నుంచి తొలగించాల్సి వచ్చింది. వాల్‌మార్ట్‌పైనా కొత్త పాలసీ ప్రభావం పడింది. ప్రపంచ ఆన్‌లైన్ మార్కెట్‌లో భారత్ వాటానే ప్రధా నం. దీంతో బహుళజాతి సంస్థల చూపంతా దేశీయ మార్కెట్‌పైనే. ఈ క్రమంలో కొత్త పాలసీ.. విదేశీ ఆన్‌లైన్ మార్కెటీర్ల దూకుడుకు బ్రేకులు వేయగా, ఈ సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరులు ఆందోళనలో పడ్డారు. దీంతో స్టాక్ మార్కెట్లలో ఆయా సంస్థల షేర్లు నష్టాలపాలవుతున్నాయి.

ఆన్‌లైన్ మార్కెట్ క్రేజ్‌కు కారణం

నిత్యం ఉరుకులు, పరుగులతో కూడిన ఈ యాంత్రిక జీవనంలో షాపింగ్‌కంటూ కొంత సమయాన్ని కేటాయించడం అసాధ్యమైపోతున్నదంటే అతిశయోక్తి కాదు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ మార్కెట్ ఊపందుకున్నది. మొబైల్ ఫోన్లలో చౌక ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం కూడా ఆన్‌లైన్ మార్కెట్‌ను అత్యంత వేగంగా విస్తరించేలా చేసింది. దీంతో కావాల్సిన వస్తువులన్నీ కూడా మొబైల్ ఇంటర్నెట్ ద్వారానే అంతా కొనుక్కుంటున్నారు. ప్రస్తుతం రోజంతా ఆఫీసుల్లో, ఇతరత్రా పనుల్లో క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్నవారే ఎక్కువ. ఇలాంటివారందరూ ఈ-కామర్స్ షాపింగ్‌కే మొగ్గు చూపుతున్నారు. అది.. ఇది అనే తేడా లేకుండా అన్ని వస్తువులు, అన్ని వర్గాలకు అవసరమైనవి దొరుకుతుండటం, పైగా భారీ ఆఫర్లకే లభిస్తుండటం కూడా ఆన్‌లైన్ మార్కెట్‌ను బలపరుస్తున్నది. దీంతో ట్రాఫిక్ సమస్యలను అధిగమిస్తూ బజార్లోని షాపులన్నీ తిరిగి కొనడం తక్కువైపోయింది. పాత పెద్ద నోట్ల రద్దుతో ఏర్పడిన నగదు కొరతనూ కొనుగోలుదారులు ఆన్‌లైన్ షాపింగ్‌తో అధిగమిస్తున్నారు. ప్రభుత్వం కూడా తగిన ప్రోత్సాహకాలను అందించడం.. దేశంలో ఆన్‌లైన్ మార్కెట్‌ను పరుగులు పెట్టించింది. కానీ తాజా పాలసీ ఆన్‌లైన్ మార్కెట్ ఆనందాన్ని ఆవిరి చేసింది.

సర్కారుతో సంప్రదింపులు

కొత్త ఈ-కామర్స్ పాలసీ అమలును మరికొంత కాలం వాయిదా వేయాలని అమెజాన్, వాల్‌మార్ట్‌లు కేంద్ర ప్రభుత్వంతో విశ్వ ప్రయత్నాలనే చేస్తున్నాయి. మరోవైపు సంప్రదాయ మార్కెటీర్లు, వర్తక సంఘాలు దీన్ని అంతే గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. 4 నెలలు వాయిదా వేయాలని అమెజాన్, 6 నెలలు ఆపాలని వాల్‌మార్ట్ కోరుతున్నాయి. తాజా విధానం ప్రభావం.. తమ అమ్మకాలను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తున్నాయని, దీనివల్ల అన్ని రకాలుగా నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆన్‌లైన్ మార్కెటీర్లు వాదిస్తున్నారు. అయితే పారిశ్రామిక విధాన, ప్రగతి శాఖ (డీఐపీపీ) మాత్రం ససేమిరా అంటున్నది. గతేడాది డిసెంబర్‌లో కొత్త విధానాన్ని విడుదల చేశామని, సుమారు మూడు నెలల వరకు సమయం ఇచ్చామని గురువారం గుర్తుచేసింది. ఇక వాయిదా వేయడం కుదరదంటూ శుక్రవారం అమల్లోకి తెచ్చేసింది. అయినప్పటికీ తమ కొనుగోలుదారులు, అమ్మకందారులపై ప్రభావాన్ని తగ్గించడం కోసం అమెజాన్.. ప్రభుత్వ వర్గాలతో సంప్రదింపులను కొనసాగిస్తూనే ఉన్నది.

పెట్టుబడులపై ప్రభావం

ప్రపంచంలోనే చైనా తర్వాత అత్యంత జనాభా కలిగిన భారత్‌లో ఉన్న విస్తృత వ్యాపారావకాశాలను అందిపుచ్చుకోవడానికి విదేశీ సంస్థలు విపరీతమైన ఆసక్తినే కనబరుస్తున్నాయి. ఈ క్రమంలోనే అన్ని రంగాల్లోకి పెట్టుబడులు వెల్లువలా తరలివస్తున్నాయి. ఇందుకు ఈ-కామర్స్ మార్కెట్ మినహాయింపు కాదు. గతేడాది ఫ్లిప్‌కార్ట్‌ను వాల్‌మార్ట్ 16 బిలియన్ డాలర్లతో సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అమెజాన్ సైతం చిన్నచిన్న రిటైల్ సంస్థలను హస్తగతం చేసుకుంటూ భారతీయ ఆన్‌లైన్ మార్కెట్‌పై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఇప్పటిదాకా 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను పెట్టింది. ఈ నేపథ్యంలో దేశీయ ఆన్‌లైన్ రిటైల్ వ్యాపారంలో ఈ రెండు సంస్థల వాటానే 75-80 శాతానికి చేరింది. అందుకే కొత్త పాలసీ ప్రభావం మిగతా ఆన్‌లైన్ సంస్థల కంటే కూడా వీటిపైనే ఎక్కువగా కనిపిస్తున్నది. కాగా, తాజా ప్రతికూలతల మధ్య భారత్‌లో మరిన్ని పెట్టుబడులకు ఈ సంస్థలు ఆసక్తి చూపడం లేదు. దీంతో విదేశీ పెట్టుబడులు తగ్గిపోవచ్చన్న అభిప్రాయాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

రూ. 5,000 కోట్లకు పైగా ఎఫ్‌పీఐలు వెనక్కి



న్యూఢిల్లీ : ఒక్క జనవరిలోనే భారత కాపిటల్ మార్కెట్ నుంచి విదేశీ ఫోర్ట్‌పోలియో ఇన్వెస్టర్లు రూ. 5,000 కోట్లను వెనక్కి తీసుకున్నారు. డిపాజిటర్ల దగ్గర ఉన్న సమాచారం మేరకు రూ. 5,264 కోట్లను ఈక్విటీ మార్కెట్ నుంచి, రూ. 97 కోట్లను డెట్ మార్కెట్ నుంచి వారు వెనక్కి తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో విదేశీ ముదుపర్లు ఆచీతూచీ అడుగు వేస్తున్నారు. గడిచిన నవంబరు, డిసెంబరు నెలల్లో రూ. 17,000 కోట్లను విదేశీ ముదుపర్లు ఈక్విటీ, డెట్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టారు. అయితే అక్టోబరులో రికార్డు స్థాయిలో రూ. 38,900 కోట్ల ఎఫ్‌పీఐలను మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్నారు. ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, డాలర్‌తో రూపాయి విలువ బలహీనపడటం, అమెరికా-చైనాల మధ్య కొనసాగుతున్నవాణిజ్య యుద్ధం లాంటి పరిణామాలు ఎఫ్‌పీఐల రాకపై ప్రభావం చూపుతున్నాయి.

అమెరికా నుంచి భారీగా రైఫిళ్ల కొనుగోలు



న్యూఢిల్లీ : భారత ఆయుధ సంపత్తిని ఆధునికీకరించడంలో భాగంగా అమెరికా నుంచి భారీ స్థాయిలో అత్యాధునిక తుపాకుల కొనుగోలుకు రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు శుక్రవారం మోక్షం లభించింది. సిగ్ సౌర్ రకానికి చెందిన 73 వేల తుపాకుల కొనుగోలుకు రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదం తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. వీటిని అమెరికాతో పాటు పలు ఐరోపా దేశాలు ఇప్పటికే వినియోగిస్తున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీటిని చైనా సరిహద్దు వెంట ఉన్న భారత సైనికులకు అందించనున్నారు.

"మరోవారంలో కొనుగోలు ఒప్పందం పూర్తయ్యే అవకాశం ఉంది. ఒప్పందం జరిగిన తేదీ నుంచి ఒక సంవత్సర కాలంలో రైఫిల్స్‌ను అందించాల్సి ఉంటుంది" అని ఒప్పందంలో పాల్గొన్న ఓ ఉన్నతాధికారి తెలిపారు. భారత బలగాలు ప్రస్తుతం వినియోగిస్తున్న ఇన్సాస్ రైఫిల్స్ స్థానంలో వీటిని ఉపయోగించనున్నారు. పాక్, చైనా సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని అధికారులు తెలిపారు.ఇప్పటికే 2017 నుంచి ఏడు లక్షల రైఫిల్స్, 44వేల లైట్ మెషిన్ గన్స్, 44,600 కార్బైన్స్‌ను భారత్ కొనుగోలు చేసింది. దేశీయంగా తయారు చేసిన రైఫిల్స్ ప్రయోగాత్మక పరీక్షల్లో విఫలమవ్వడంతో కొనుగోలుకే మొగ్గు చూపాల్సి వచ్చిందని రక్షణశాఖ వర్గాలు తెలిపాయి.

పబ్లిక్ ఇష్యూ ద్వారా వాటాల విక్రయం



న్యూఢిల్లీ : ఏప్రిల్ నుంచి ప్రారంభంకానున్న కొత్త ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రభుత్వ రంగ కంపెనీలను (పీఎస్‌యూ) పబ్లిక్ ఇష్యూ బాట (ఐపీవో) పట్టించనున్నట్టుగా ప్రభుత్వం వెల్లడించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు పది ప్రభుత్వ రంగ కంపెనీలు ప్రాథమిక మార్కెట్లోకి రానున్నాయని 'డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్' (దీపమ్) కార్యదర్శి అటను చక్రబొర్తి తెలిపారు. 2019-20 సంవత్సరానికి గాను పీఎస్‌యూలలో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.90,000 కోట్ల వాటాలను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. 2018-19లో రూ.80వేల కోట్ల వాటాల ఉపసంహరణ లక్ష్యాన్ని చేరకుంటామని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పీఎస్‌యూలల భారీగా వాటాల విక్రయానికి ఎత్తుగడలు రూపొందిస్తోందని సమాచారం. ఈ క్రమంలో భాగంగా నే ఇప్పటికే 10 ఐపీవోలు వరసలో ఉన్నాయని చక్రబొర్తి తెలిపారు. చాలా కంపెనీలు ఇంకా కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ లక్ష్యాన్ని చేరాల్సి ఉందన్నారు. గడిచిన 10 నెలల్లో కేంద్ర పీఎస్‌యుల్లో రూ.36,000 కోట్ల విలువ చేసే వాటాలను ఉపసంహరించుకుంది. వచ్చే నెల మార్చి ముగింపు నాటికి మరో రూ.44,000 కోట్ల వాటాలను విక్రయించాలని కేంద్రం నిర్దేశించుకుందని.. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా పెట్టుకున్న రూ.80,000 కోట్ల వాటాల ఉపసంహరణ లక్ష్యం నెరవేరనుందని చక్రబొర్తి పేర్కొన్నారు. 2019 మార్చి కల్లా పవన్ హాన్స్‌లో కీలక వాటాలను విక్రయించనున్నామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.90వేల కోట్ల వాటాలను ఉపసంహరణకు ఇప్పటికే తాము ప్రణాళికలు రూపొందించామన్నారు.

యూఐడీఏఐకి తగ్గిన కేటాయింపులు

న్యూఢిల్లీ :ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో భారత విశిష్ట సంఖ్య ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ)కు కేటాయింపులు తగ్గాయి. గతేడాదితో పోలిస్తే, 8.7శాతం తగ్గగా, మొత్తం రూ.1,227కోట్లు కేటాయించారు. 2018-19 సంవత్సరంలో ఈ మొత్తం రూ.1,345కోట్లుగా ఉండటం గమనార్హం. మార్చి 2019తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి గానూ గత బడ్జెట్‌లో యూఐడీఏఐకి రూ.1,375కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించగా, సవరించిన అంచనాలతో రూ.1,345కోట్లు అందించారు.

ఈ విషయమై యూఐడీఐఏ సీఈవో అజయ్ భూషణ్ మాట్లాడుతూ.. సంస్థ అవసరాల మేరకు నిధుల కేటాయింపు జరుగుతుందని, తదనుగుణంగా ఖర్చులుంటాయని తెలిపారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించి పాత హార్డ్‌వేర్ స్థానంలో కొత్తదాన్ని తీసుకురావడం, సరికొత్త ఆలోచనలు మొదలైన వాటికి నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. అదే సమయంలో యూఐడీఏఐని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. యూఐడీఏఐకి అవసరాలకు అనుగుణంగా ఆర్థికశాఖ నుంచి పూర్తి సహకారం ఉందని అజయ్ భూషణ్ పేర్కొన్నారు.

ఫోన్‌పేలో లక్ష ఆఫ్‌లైన్ రిటైలర్లు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్‌పే తెలుగు రాష్ట్రాల్లో 1.4 లక్షల రిటైల్ వర్తకులను నమోదుచేసిందని సంస్థ ఆఫ్‌లైన్ ఆర్గనైజుడ్ బిజినెస్ హెడ్ యువరాజ్ సింగ్ షేకావత్ తెలిపారు. ఇందులో చిన్న, మధ్యతరహా స్టోర్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. వినియోగదారుల నుంచి యుపిఐ, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్లు తదితర బహుళ పద్ధతుల చెల్లింపులను ఫోన్‌పే అంగీకరిస్తుందన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో క్యూఆర్ కోడ్ ఇతర సమీకృత చెల్లింపుల పరిష్కారాలను ఆమోదిస్తుందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రోజుకు కోటికి పైగా లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. 2019 మార్చి నాటికి నాలుగు రెట్లు పెరిగి 40 మిలియన్ లావాదేవీలకు చేరొచ్చన్నారు.



ఈ బైక్ ఖరీదు రూ.75 లక్షలు

రోమ్: ఇటలీకి చెందిన ప్రముఖ డిజైన్ సంస్థ ఆఫిసిన్ జీపీ డిజైన్ తాజాగా దుకాటీ పనిగేల్ వీ4లో కస్టమ్ బైక్‌ను మార్కెట్‌లోకి ఆవిష్కరించింది. దీని ధర దాదాపు రూ.74.5 లక్షలు. దుకాటీ పనిగేల్ వీ4 కస్టమ్ బైక్ పేరు వీ4 పెంటా. వీ4 ఎస్ బైక్‌లకు పలు అదనపు ప్రత్యేకతలను జోడించి ఈ బైక్‌ను రూపొందించారు. ఇందులో కస్టమ్ స్పోక్డ్ వీల్స్, ఇంజిన్‌పై బ్రాంజ్ పౌడర్ కోటింగ్, క్రాంక్‌కేస్ కవర్స్, క్లాసిక్ స్టైల్డ్ గిర్‌డర్ ఫ్రంట్ ఎండ్ వంటి ప్రత్యకతలున్నాయి. ఈ బైక్‌ను లూకా పొజాటో డిజైన్ చేసింది. ఇది కేవలం స్ట్రీట్‌ఫైటర్ మాత్రమే కాదు. అంతకు మించేలా ఉంది. ఫెరింగ్ తొలగింపుతో బైక్ నేక్‌డ్ స్ట్రీట్ ఫైటర్‌లా కనిపిస్తుంది. ఇది లిమిటెడ్ ఎడిషన్. కేవలం 10 బైక్స్ మాత్ర మే అందుబాటులో ఉండనున్నాయి. బైక్‌కు సంబంధించిన హ్యాండ్ బార్స్, ఇండికేటర్లు, ఫుట్‌పెగ్స్ సహా పలు ఇతర భాగాలను రిజోమా సంస్థ రూపొందించడం విశేషం. అయితే వీటిలో ఎన్ని ఎక్కువ బైక్‌లను భారత్‌లోనే విక్రయించేలా సంస్థ ప్లాన్ చేసుకున్నట్టుగా సమాచారం.

సినిమా థియేటర్లలో బాదుడు

జీఎస్టీ 18 శాతానికి తగ్గించినా అమలు చేయని వైనం



హైదరాబాద్ : పది..ఇరవై రూపాయల సమోసా...పాప్‌కార్న్‌లకు రూ.వందలు గుంజే కొన్ని మల్టీప్లెక్స్‌లు, సినిమా థియేటర్లు టిక్కెట్ల అమ్మకాల్లో కూడా ప్రేక్షకుల జేబులను ఖాళీ చేస్తున్నాయి. జీఎస్టీ తగ్గింపు విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయి. రూ.100 పైన ఉన్న సినిమా టిక్కెట్లపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించినా వాటిని ప్రేక్షకులకు అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. తాజాగా ఎన్టీఆర్ మార్గ్‌లోని ప్రసాద్ ఐమాక్స్‌పై ఫిర్యాదు రావడంతో వాణిజ్య పన్నుల శాఖ దృష్టి సారించింది. పలుచోట్ల తనిఖీలు చేసిన వాణిజ్య పన్నుల శాఖలోని యాంటీ ప్రాఫిటరింగ్ బృందం ఐమాక్స్‌లో పాత పద్ధతిలోనే ప్రేక్షకుల నుంచి జీఎస్టీ వసూలు చేస్తున్నట్లు గుర్తించింది. తదుపరి చర్యలు కోసం వెంటనే ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయి స్క్రీనింగ్ కమిటీ దృష్టికి తీసుకెళుతున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ వినయ్‌కుమార్ కంతేటి శుక్రవారం మీడియాకు తెలిపారు. గ్రేటర్‌లో కొంతకాలంగా మల్టీప్లెక్స్‌ల సంస్కృతి బాగా పెరిగింది. వందల సంఖ్యలోనే తెరలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి థియేటర్‌లో టిక్కెట్ ధరలు రూ.250 నుంచి రూ.150 వరకు అందుబాటులో ఉన్నాయి. మల్టీప్లెక్స్‌లు వచ్చిన తర్వాత ఎక్కువ మంది ఆ థియేటర్లలోనే సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తొలుత జీఎస్టీ రూ.100 దాటిన టిక్కెట్లపై 28 శాతం వరకు వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే వీటిపై విమర్శలు తలెత్తడంతో గత ఏడాది 27వ తేదీన జీఎస్టీ తగ్గిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ లెక్కన రూ.150 ఉన్న టిక్కెట్ రూ.138 వరకు తగ్గింది. కొన్ని థియేటర్లు ఇప్పటికే ఈ మేరకు టిక్కెట్ ధరను తగ్గిస్తున్నాయి. కొన్ని మల్టీప్లెక్స్‌లు, థియేటర్లు మాత్రం లెక్క చేయడం లేదు. టిక్కెట్ ధర రూ.150 తీసుకుంటున్నాయి. వాణిజ్య పన్నుల శాఖకు 18 శాతమే చెల్లిస్తున్నాయి. దీంతో అంతిమంగా ప్రేక్షకుడిపై భారం పడుతోంది.


మరింత తగ్గనున్న ధరలు.. తాజా బడ్జెట్‌లో సినిమా టిక్కెట్లపై జీఎస్టీని 18 నుంచి 12 శాతానికే పరిమితం చేయనున్నట్లు ప్రకటించడంతో టిక్కెట్ ధరలు మరింత తగ్గనున్నాయి. ఈ మేరకు అన్ని థియేటర్లలో తగ్గిన రేట్లు అమలయ్యేలా చూసేందుకు వాణిజ్య పన్నుల శాఖ రంగం సిద్ధం చేస్తోంది.



కొత్తూరులో ఎంఆర్ఎఫ్ మజిల్ జోన్ సెంటర్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ టైర్ల సంస్థ ఎంఆర్ఎఫ్ హైదరాబాద్ సమీపంలోని కొత్తూరు వద్ద తన మజిల్‌జోన్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ కొషి వర్ఘీస్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న టైర్ల ఉత్పత్తి కేంద్రానికి అదనంగా ఈ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ సెంటర్ ద్వారా కమర్షియల్, ప్యాసింజర్ వాహనాలకు సంబంధించిన వీల్ అలైన్‌మెంట్, వీల్ బ్యాలెన్సింగ్, ఆటోమెటిక్ టైర్ పిట్‌మెంట్ సేవలు అందించవచ్చని ఆయన వెల్లడించారు.

కొచ్చర్ పై మనీ లాండరింగ్ కేసు



న్యూఢిల్లీ: ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ రుణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీ లాండరింగ్ క్రిమినల్ కేసును నమోదు చేసింది. బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌లతోపాటు వీడియోకాన్ గ్రూప్ అధినేత వేణుగోపాల్ ధూత్ మరికొందరిపై ఈ కేసును ఈడీ దాఖలు చేసింది. వీడియోకాన్‌కు బ్యాంక్ ఇచ్చిన రూ.1,875 కోట్ల రుణంలో అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఈడీ ఈ కేసును నమోదు చేసింది. ఈ మేరకు శనివారం ఈడీ వర్గాలు తెలిపాయి. గత నెల కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ నమోదు చేసిన కేసు ఆధారంగా మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఓ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) దాఖలు చేసినట్లు పేర్కొన్నాయి. ఈడీ దాఖలు చేసిన ఈసీఐఆర్.. పోలీస్ ఎఫ్ఐఆర్‌కు సమానం. ఈసీఐఆర్‌లో పేర్లున్నవారికి త్వరలోనే సమన్లు జారీ కానున్నాయి. సీబీఐ కేసులో ఉన్నవారే ఈసీఐఆర్‌లోనూ ఉంటారని ఈడీ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ కేసులో అక్రమాస్తుల సృష్టికి ఈ రుణాల ఒప్పందం కారణమైతే విచారణ చేస్తామని ఈడీ అధికారులు వెల్లడించారు.

జీఎంలో 4 వేల ఉద్యోగాల తొలగింపు

న్యూయార్క్ : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ జనరల్ మోటార్స్(జీఎం) భారీ స్థాయిలో ఉద్యోగులపై వేటు వేసింది. గడిచిన సంవత్సరంలో ఏకంగా 4 వేల మంది సిబ్బందిని తొలగించినట్లు తెలుస్తున్నది. నిర్వహణ ఖర్చులను తగ్గించుకోనున్నట్లు గత నవంబర్‌లో సంస్థ ప్రకటనకు అనుగుణంగా మొత్తం ఉద్యోగుల్లో 15 శాతం మందిపై వేటు వేయనున్నట్లు గతంలోనే సంకేతాలిచ్చింది. ఇతర సంస్థల నుంచి పోటీ తీవ్రతరమవడం, కంపెనీకి చెందిన వాహనాలకు అంతగా డిమాండ్ లేకపోవడంతో ఏకంగా ఏడు ప్లాంట్లను మూసివేసింది. వీటిలో ఉత్తర అమెరికాలో ఐదు ఉన్నాయి. వీటిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించింది. మీడియా నివేదిక ప్రకారం ఇప్పటి వరకు తొలగించిన వారి ఉద్యోగుల సంఖ్య 14 వేల వరకు ఉండగా, వీరిలో 6 వేల మంది పలు కార్మిక సంఘాలకు చెందిన వారు. అమెరికా, కెనడా దేశాలకు చెందిన రాజకీయ నాయకుల కారణంగా సంస్థ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తున్నదని, ముఖ్యంగా వీరి కారణంగా 600 కోట్ల డాలర్ల మేర నష్టపోవాల్సి వచ్చిందని కంపెనీ వాపోతున్నది. ఎంతమందిని తొలగించిన దానిపై కంపెనీ వర్గాలు స్పందించడానికి నిరాకరించారు. అలాగే 2,300 మంది వేతన జీవులు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయాలని నిర్ణయం తీసుకున్నారని, మరో 1,500 మంది కాంట్రాక్టు స్టాఫ్ కూడా ఇదే బాటలో పయనిస్తున్నారు.

సరిగా కూర్చోకపోతే అనారోగ్యమే..

ఉద్యోగులు సాధారణంగా రోజంతా ఆఫీసులో కూర్చుని పనిచేస్తుంటారు. ప్రస్తుత కాలంలో చాలామంది తల వంచుకొని మొబైల్‌ఫోన్లను చూస్తుంటారు. సోఫాలో కూర్చుని ఎటుపడితే అటు వంగిపోతుంటారు. నడుం, మెడను ఏమాత్రం పట్టించుకోకుండా ఇలాంటి పనులెన్నో చేసేస్తుంటారు. చివరికి 'మెడనొప్పి, నడుంనొప్పి' అని బాధ పడుతుంటాం. శరీర భంగిమ సరిగా లేకపోవటం వల్ల ఇలాంటి నొప్పులు మాత్రమే కాదు.. నిలబడినప్పుడు తూలిపోవటం, తలనొప్పి, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందుల వంటివీ వేధించవచ్చు. మలవిసర్జన సమయంలో సరిగా కూచోకపోతే మలబద్ధకం కూడా తలెత్తవచ్చు. మూత్రం లీక్ కావటం, ఛాతీలో మంట వంటి సమస్యలూ బయలుదేరవచ్చు.

మూత్రం లీక్ :

- శరీర భంగిమ సరిగా లేకపోవటం మూలంగా ఒత్తిడితో ముడిపడిన మూత్రం లీక్ సమస్య తలెత్తవచ్చు. ఎక్కువసేపు బాగా ముందుకు వంగినప్పుడు కడుపు మీద ఒత్తిడి పెరిగిపోతుంది. దీంతో మూత్రాశయం మీదా ఒత్తిడి పడుతుంది. అంతేకాదు.. కటిభాగంలోని కండరాల దృఢత్వమూ దెబ్బతింటుంది. ఇవన్నీ మూత్రాన్ని పట్టి ఉంచే సామర్థ్యం తగ్గిపోయేలా చేస్తాయి. ఫలితంగా నవ్వినా, దగ్గినా తెలియకుండానే మూత్రం లీకయ్యే ముప్పు పెరుగుతుంది.

ఛాతీలో మంట, అజీర్ణం :

- భోజనం చేసిన తర్వాత చాలాసేపు ముందుకు వంగిపోతుంటే ఛాతీలో మంట తలెత్తవచ్చు. ఎందుకంటే ముందుకు వంగినపుడు కడుపు మీద ఒత్తిడి పడుతుంది. దీంతో జీర్ణాశయంలోని ఆమ్లం పైకి గొంతులోకి ఎగదన్నుకొని రావచ్చు. పేగుల్లోంచి ఆహారం కిందికి కదిలే వేగం నెమ్మదించే అవకాశమూ ఉంది. ఫలితంగా జీర్ణప్రక్రియ కూడా ఆలస్యం కావొచ్చు.

ఏం చేయాలి?

- వెన్ను నిటారుగా ఉండేలా చూసుకోవటం ముఖ్యం. నిరంతరం నిటారుగా ఉండటం ఎవరికైనా కష్టమే గానీ ఎక్కువసేపు మరీ ముందుకు గానీ వెనక్కు గానీ వంగిపోకుండా చూసుకోవటం మంచిది. ఎప్పుడైనా ముందుకు వంగినట్టు అనిపిస్తే.. భుజాలను వదులుగా కిందికి వేలాడేలా చేసి.. వెనక్కి లాక్కోవాలి. తలను కూడా వెనక్కి లాక్కోవాలి. ఇప్పుడు కడుపును లోపలికి లాక్కొని (ప్యాంటు బొత్తాలు పెట్టుకుంటున్నప్పుడు కడుపును లోపలికి తీసుకున్నట్టుగా) కాసేపు అలాగే ఉండాలి. దీంతో కడుపు భాగంలోని కండరాలు కుదురుకొని వెన్నెముకకు మంచి దన్ను లభిస్తుంది. ఇక శరీర భంగిమ సరిగా లేకపోవటం వల్ల సమస్యలు వస్తున్నట్టు గుర్తిస్తే కడుపు, కటిభాగం, వెన్ను కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు బాగా ఉపయోగపడతాయి. దీంతో వెన్నెముక కూడా బలపడుతుంది. కటి కండరాలను దృఢపరచే ప్రత్యేకమైన వ్యాయామాలతో మూత్రం లీక్ కాకుండా చూసుకోవచ్చు.



పచ్చి బఠాణీలతో మలబద్ధకం సమస్య దూరం

చాలా మంది మలబద్ధకం సమస్యతో బాధపడుతుంటారు. దీనిని పచ్చి బఠాణీలతో పరిష్కరించుకోవచ్చు. సాధారణంగా వీటిని అనేక రకాల కూరల్లో వేస్తుంటాం. కుర్మా, బిర్యానీ వంటివాటిల్లో ఎక్కువగా వాడుతుంటాం. ఇవి వేయడం వల్ల కూరకు చక్కని రుచి వస్తుంది. అలాగే, ఎన్నో పోషకాలను కూడా కలిగి ఉంటాయి. వీటిని మనం తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే దాంతో శరీరానికి చక్కని పోషణ అందుతుంది. పలు అనారోగ్య సమస్యలు కూడా దూరమవుతాయి. పచ్చి బఠానీలను తరచూ తీసుకుంటే వాటితో కలిగే ప్రయోజనాలు..

- మలబద్ధకంతో బాధపడేవారు పచ్చి బఠాణీలను ఆకుకూరలు, కూరగాయలతో కలిపి కూరగా చేసుకుని తింటే విరేచనం సాఫీగా వస్తుంది
- మధుమేహంతో బాధపడేవారికి పచ్చి బఠాణీలు చక్కటి ఆహారం. వీటిలో ఫైబర్ అధికంగా ఉండటంతో రక్తంలో గ్లూకోజ్ త్వరగా చేరదు. టైప్-2 మధుమేహం ఉన్నవారికి ఇవి బాగా పని చేస్తాయి.
- చెడు కొలెస్ట్రాల్‌ను నాశనం చేసి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుంది. దీంతో అధిక బరువు తగ్గవచ్చు. గుండె సమస్యలు రాకుండా చేస్తుంది.
- పచ్చి బఠాణీల్లో కేన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడే ఔషధ గుణాలు ఉన్నాయి. రోజుకు ఒక కప్పు మోతాదులో తీసుకుంటే కేన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని పరిశోధల్లో తేలింది.
- 100 గ్రాముల పచ్చి బఠానీలు అరగడానికి సుమారు 3 గంటల సమయం పడుతుంది. బరువు తగ్గాలనుకునే వారు వీటిని ఇతర కూరగాయలతో కలిపి తీసుకుంటే ఆకలి త్వరగా వేయదు. బరువు కూడా పెరగకుండా ఉంటారు.
- పచ్చి బఠానీల్లో విటమిన్ ఎ, బి1, బి2, సిలతోపాటు ఐరన్, కాల్షియం, పాస్ఫరస్‌లు సమృద్ధిగా లభిస్తాయి. కాబట్టి బఠానీలను ఉడికించి ముద్దలా చేసి ఎదుగుతున్న పిల్లలకు, బలహీనంగా ఉన్న వారికి ఇస్తే బలవర్ధక ఆహారాన్ని అందించిన వారమవుతాం.
- గుండె జబ్బులు రాకుండా చూస్తాయి. రక్తనాళాలను సంరక్షిస్తాయి.



విటమిన్ కె వీటిలో కావల్సినంత దొరుకుతుంది. రోజుకు 1 కప్పు పచ్చి బఠానీలను తింటే శరీరానికి నిత్యం కావల్సిన విటమిన్ కెలో దాదాపు 44 శాతం వరకు అందుతుంది.

చర్మంపై బ్లాక్ హెడ్స్‌ను తొలగించాలంటే..

ముఖం మీద బ్లాక్ హెడ్స్‌తో బాధపడుతున్నట్లయితే... క్లాత్‌ను వేడినీటిలో ముంచి బ్లాక్ హెడ్స్ ఉన్న ప్రాంతంలో కాపడం పెట్టాలి. ఇలా చేసినట్లయితే చర్మం రంధ్రాలు తెరచుకుంటాయి. అప్పుడు నెమ్మదిగా బ్లాక్ హెడ్స్‌ని నొక్కిపట్టి బయటకు తీసివేయాలి. సులభంగా రాకపోతే మళ్లీ కాపడం పెట్టి బయటకు తీయాలి.



అలా మొత్తం బ్లాక్ హెడ్స్‌ను తీసివేసిన తరువాత సహజసిద్ధమైన సబ్బుతో కడిగి, నిమ్మరసంతో ముఖాన్ని తుడుచుకోవాలి. చివరిగా ఐస్‌క్యూబ్స్‌ను వస్త్రంలో పెట్టి వాటితో.. బ్లాక్ హెడ్స్ తీసివేసిన ప్రాంతంలో మర్దన చేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేసినట్లయితే.. బ్లాక్ హెడ్స్ సమస్య నుండి క్రమంగా బయటపడవచ్చును. ముఖంపై ఏర్పడే ట్యాన్ తొలగించాలంటే.. నిమ్మరసం, కీరా రసాలను సమపాళ్లలో తీసుకుని ముఖానికి పట్టించి అరగంట తరువాత చల్లని నీటితో కడిగేస్తే సరిపోతుంది. చేతులపై ఏర్పడే ట్యాన్‌ను తొలగించాలంటే. సన్‌ఫ్లవర్ ఆయిల్, నిమ్మరసం, చక్కెర కలిపి ఆ మిశ్రమాన్ని చేతులకు పట్టించి, కాసేపటి తరువాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే చేతులు మృదువుగా మారుతాయి.

ఆస్తమా వ్యాధికి చెక్ పెట్టాలంటే..

ఆస్తమా వ్యాధి చాలా ప్రమాదకరమైనది. ఈ వ్యాధి వయసు తేడా లేకుండా ఎవరు పడితే వారికి వచ్చేస్తుంటుంది. బరువు ఎక్కువగా ఉన్నవారిని ఈ సమస్య అధికంగా వేధిస్తుంది. ఇప్పటి చలికాలంలో ఈ ఆస్తమా వ్యాధి రావడం సహజమే. ఈ వ్యాధికి చెక్ పెట్టాలంటే.. ఏం చేయాలో తెలుసుకుందాం. ఆస్తమా వ్యాధిగలవారు ప్రతిరోజూ వేన్నీళ్లు తాగిలి. తీపి పదార్థాలు తీసుకోవడం మానేయాలి. ఎందుకంటే.. ఆస్తమాకి తీపి అంటే చాలా ఇష్టమట. మీరు సాధారణంగా తీపి పదార్థాలు తీసుకోకపోయినా.. ఈ వ్యాధి వచ్చినప్పుడు స్వీట్స్ తింటే బాగుంటుందని అని పిస్తుంది. అందుకని మీరు వెం టనే స్వీట్స్ తినడం ప్రారం భించకండి.. ఒకవేళ తీసు కుంటే..





శ్వాస పీల్చుకోవ డానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. దాంతో పలు రకాల సమస్యలు ఎదుర్కో వలసి వస్తుంది. కనుక వీలైనంత వరకు స్వీట్స్ తీసుకోవడం మానేస్తే మంచిది. ఇక బరువు అధికంగా ఉన్నవారు.. ఓ 5 నిమిషాలు నడిస్తే చాలు.. వారిని ఆస్తమా విపరీతంగా బాధిస్తుంది. దీని కారణంగా శరీరమంతా ఒత్తిడి, అలసట, నీరసంగా ఉంటుంది. దాంతో సరిగ్గా నిద్రకూడా రాదు. ఇంకా చెప్పాలంటే.. తలనొప్పి తీవ్రంగా ఉంటుంది. వీటన్నింటి నుండి విముక్తి పొందాలంటే.. బరువు తగ్గించడమే మొదటి పద్ధతి. బరువును తగ్గించాలంటే.. ప్రతిరోజూ గ్లాస్ నిమ్మరసం తీసుకుంటే చాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. కనుక తప్పక రోజుకో గ్లాస్ నిమ్మరసం తాగండి.. బరువు తగ్గండి.

విజయ్ దేవరకొండ చిత్రంలో నలుగురు భామలు



వినూత్న కథలని ఎంచుకుంటూ వైవిధ్యమైన పాత్రలలో నటిస్తున్న హీరో విజయ్ దేవరకొండ. ఆయన సినిమాలపై అభిమానులలో ఫుల్ క్రేజ్ నెలకొంది. త్వరలో డియర్ కామ్రేడ్ అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్న విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' ఫేమ్ క్రాంతి మాధవ్ దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడు. క్రియేటివ్ కమర్షియల్ పతాకంపై కె.ఎస్. రామారావు సమర్పకుడిగా వ్యవహరిం చనున్న ఈ చిత్రానికి కె.ఏ వల్లభ నిర్మాత. రాశీఖన్నా, ఐశ్వర్యరాజేష్, బ్రెజిల్ మోడల్ ఇసాబెల్లె డి కథానాయికలుగా నటించనున్నారు. తాజాగా కేథరిన్ థెస్రా కూడా చిత్రంలో కథానాయికగా నటిస్తుందని ప్రకటించారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. వినూత్న ప్రేమ కథా చిత్రంగా రూపొందనున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ పాత్ర వైవిధ్యంగా ఉండనుండగా, ప్రేమలో అతని దృష్టి కోణం విభిన్నంగా సాగుతుందని అంటున్నారు. నలుగురు హీరోయిన్లకి, హీరోకి మధ్య జరిగే సంఘటనలు ప్రేక్షకులకి సరికొత్త అనుభూతిని అందిస్తుందని చెబుతున్నారు. నవ్యపంథాలో సాగనున్న అతని పాత్ర ప్రేక్షకులని ఎంతగానో అలరిస్తుందట. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేష్ కాగా సంగీతం గోపీసుందర్ అందిస్తున్నారు.





ఇళయరాజాకు ఘన సన్మానం

మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా అంటే తెలియని సంగీత ప్రేమికులు ఉండరు. ఆయన సంగీతానికి చెవి కోసుకుంటారు. 1000కు పైగా చలనచిత్రాలకు సంగీతాన్ని సమకూర్చాడు ఇళయరాజా. ఆయన 75వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంలో తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఇళయరాజా 75 అనే కార్యక్రమాన్ని గ్రాండ్‌గా ఏర్పాటు చేసి అతడిని సన్మానించింది. ఈ ఈవెంట్‌ని ఫిబ్రవరి 2, 3 తేదీల్లో చెన్నైలోని వైఎంసీఏ మైదానంలో గ్రాండ్‌గా జరిపేందుకు ఏర్పాట్లు చేసుకోగా, శనివారం జరిగిన జరిగిన కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులతో పాటు తమిళనాడు గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంగీత విభావరిలో సంగీత జ్ఞాని ఇళయరాజాకి ఘన సత్కారం చేసిన తర్వాత ఏఆర్ రెహమాన్, విశాల్, బన్వర్ లాల్ తదితరులు సంగీతానికి ఆయన చేసిన కృషిని వివరించారు. సినీ పరిశ్రమ తరఫున ఇళయరాజాకు బంగారంతో చేసిన వయోలిన్‌ను బహుకరించి తమ అభిమానం చాటుకున్నారు. వేదికపై ఇళయరాజా, ఏఆర్ రెహమాన్‌లు కలిసి స్వరపరచిన సంగీతానికి వీక్షకులు మంత్రముగ్ధులయ్యారు.



మల్లేశం ఫస్ట్‌లుక్ విడుదల..

పద్మశ్రీ చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా మల్లేశం. అగ్గిపెట్టెలో పట్టేంత చిన్న చీరలను కూడా నేసి ప్రపంచాన్ని అబ్బుర పరిచిన వ్యక్తి మల్లేశం. తను సాధించిన విజయాలతో చేనేత ప్రాముఖ్యతను దేశవ్యాప్తంగా చాటి చెప్పిన ఘనత మల్లేశం గారి సొంతం. ఇలాంటి గొప్ప వ్యక్తి జీవితం ఆధారంగా మల్లేశం సినిమా తెరకెక్కుతుంది. రాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా.. శ్రీ అధికారి, రాజ్ ఆర్ నిర్మిస్తున్నారు. ఇందులో మల్లేశం పాత్రలో ప్రియదర్శి నటిస్తున్నారు. అనన్య, ఝాన్సీ, చక్రపాణి కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. చిత్రయూనిట్ సిరిసిల్ల జిల్లాలో ఈ చిత్ర ఫస్ట్‌లుక్ విడుదల చేసారు. బాబు శాడిలాస్య ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. లక్ష్మణ్ ఆలే ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు అందుకున్న సౌండ్ డిజైనర్ నితిన్ లుకోస్ ఈ చిత్రానికి సౌండ్ డిజైన్ చేస్తున్నారు. మార్క్ కే రాబిన్ సంగీతం అందిస్తున్నారు. పెద్దింటి అశోక్ కుమార్ ఈ చిత్రానికి మాటలు రాస్తున్నారు. ప్రముఖ రచయిత గోరేటి వెంకన్న, చంద్రబోస్ ఈ చిత్రానికి పాటలు రాస్తున్నారు. వెంకట్ సిద్ధిరెడ్డి ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు.

అమావాస్య ఆడియో విడుదల

సచిన్ జోషి హీరోగా వైకింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్ పై '1920 ఈవిల్ రిటర్న్స్', 'రాగిని యంయంఎస్, 'అలోన్' లాంటి సూపర్‌హిట్ చిత్రాల దర్శకుడు భూషన్ పటేల్ దర్శకత్వంలో రైనా సచిన్‌జోషి, దీపెన్‌అమిన్ నిర్మాణంలో నర్గిస్ ఫక్రి హీరోయిన్‌గా నటిస్తున్న హర్రర్ చిత్రం 'అమావాస్య'. ఈ సినిమా ఫిబ్రవరి 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత సి కళ్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొని బిగ్ ఆడియోసీడీని విడుదల చేశారు. ఈ సందర్భంగా..

సి.కళ్యాణ్ మాట్లాడుతూ 'నాకు హర్రర్ జోనర్ అంటే చాలా ఇష్టం. నేను ఇప్పటి వరకు చాలా హర్రర్ సినిమాలు నిర్మించాను. హర్రర్ జోనర్ ఎప్పుడూ విజయం సాధిస్తుంది. ఈ సినిమాలో సచిన్ చాలా బాగా కనపడుతున్నారు. సచిన్ మంచి నటుడు. తనకు చాలా వ్యాపారాలు ఉన్నా సినిమా పై తనకు ఉన్న ప్యాషన్‌తో నటిస్తున్నారు. ఆయన భార్య రైనా సచిన్ జోషి నిర్మాతగా మంచి విజయాన్ని అందుకోవాలని కోరు కుంటున్నాను. వారిద్దరూ కలిసి తెలుగులో ఎన్నో సినిమాలను నిర్మించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. భూషణ్ ఈ సినిమాను చాలా అద్భుతంగా తెరకెక్కించారని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. ఆయన చాలా టాలెంటెడ్ డైరెక్టర్. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు.

హీరో సచిన్ జోషి మాట్లాడుతూ 'నేను చాలా కాలంగా హర్రర్ జోనర్ ఓ సినిమా చేయాలని ఎదురుచూస్తున్నాను. అలాంటి సమయంలో భూషణ్ పటేల్ నాకు ఈ స్క్రిప్ట్ చెప్పారు. నా గత చిత్రాలకు ఇది పూర్తి భిన్నమైన సినిమా. అమావాస్య ఓ క్లాసిక్ హర్రర్ మూవీ. తెలుగులో హర్రర్ చిత్రాలకు మంచి ఆదరణ దొరుకుతున్న సమయంలో మంచి కాన్సెప్ట్‌తో సినిమా చేయడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం ఉన్న లెటెస్ట్ టెక్నాలజీ వి.ఎఫ్.ఎక్స్ వర్క్‌ను ఉపయోగించాం. మంచి కథే సినిమాకు హైలెట్.



సినిమాను రెండు భాషల్లో చిత్రీకరించాం. ఎందుకంటే తెలుగు సినిమాకు నా తొలిప్రాధాన్యత ఎప్పుడూ ఉంటుంది. భూషణ్ ఇప్పటికే 1920 ఈవిల్ రిటర్న్స్, రాగిణి ఎం.ఎం.ఎస్2, అలోన్ వంటి సూపర్‌హిట్ చిత్రాలను డైరెక్ట్ చేశారు. అలాంటి హర్రర్ స్పెషలిస్ట్ డైరెక్టర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలో కథకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. హాలీవుడ్ స్థాయిలో హర్రర్ చిత్రాన్ని అందించాలని ఛాలెంజింగ్‌గా భావించి ఈ సినిమా చేశాం. అమావాస్య యూనిక్ స్క్రీన్‌ప్లేతో తెరకెక్కింది. కథకు తగ్గట్లు మ్యూజిక్‌కు తగ్గ ప్రాధాన్యముంటుంది. నాకు సినిమాలంటే ప్యాషన్. చాలా కథలు వింటూ ఉంటాను. నచ్చిన సినిమాలు చేయడానికి ఆసక్తి చూపుతుంటాను. ఫిబ్రవరి 8న మా సినిమా తెలుగు, హిందీ భాషల్లో విడుదల వుతుంది. తప్పకుండా అందరూ చూడండి' అన్నారు.

దర్శకుడు భూషణ్ పటేల్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో కథతో పాటు వి.ఎఫ్.ఎక్స్‌కు చాలా ప్రాధాన్యముంది. ఇప్పటివరకూ ఉపయోగించని సాంకేతికతను ఇందులో ఉపయోగించాం. బెస్ట్ వి.ఎఫ్.ఎక్స్ టెక్నీషియన్స్ ఈ సినిమాకు పని చేశారు. దీనికి ఆసక్తికరమైన కథ కూడా తోడైంది. క్లైమాక్స్ అందరినీ ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. సచిన్‌తో చాలా కాలంగా సినిమా చేయాలని అనుకుంటున్నాను. కానీ ఇద్దరం వారి వారి పనులతో బిజీగా ఉండటం వల్ల కలిసి సినిమా చేయలేకపోయాం. గత ఏడాది ఓ సందర్భంలో ఇద్దరం కలుసుకున్నప్పుడు సచిన్‌కు మూడు నిమిషాల ప్లాట్ చెప్పాను. తను ఈ సినిమా కలిసి చేస్తున్నామని చెప్పాడు. తననే హీరోగా పెట్టి సినిమా చేయాలని అప్పుడే నేను నిర్ణయించుకున్నాను. మా టీం అందరం చాలా కష్టపడి ఈ సినిమాను తెరకెక్కించాం సినిమా చాలా బాగా వచ్చింది. హీరోయిన్ నర్గిస్ ఈ సినిమాలో మంచి నటనతో అందరిని ఆకట్టుకుంటుంది. సినిమా ఫిబ్రవరి 8న విడుదల అవుతుంది. అందరూ తప్పకుండా చూడండి'' అన్నారు.

నటుడు అలీ అస్గర్ మాట్లాడుతూ 'నేను మొదటిసారి ఒక హర్రర్ సినిమాలో నటిస్తున్నాను. నేను ఈ చిత్రంలో నేను ఎలాంటి ఆత్మ పాత్రను చేయలేదు. సచిన్, నర్గిస్ కలిసి వచ్చే వీకెండ్ సమ్మర్ గెస్ట్ హౌస్ కేర్ టేకర్‌గా వ్యవహరిస్తుంటాను. ఎలా ఆ బంగ్లాకు కేర్‌టేకర్‌గా మారానో తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే. హర్రర్ సినిమాలో నాది కాస్త లైటర్ వేలో ఉండి నా పాత్ర డిజైన్ చేసిన తీరు.. ప్రేక్షకులను నవ్విస్తుంది" అన్నారు.

ఫైట్ మాస్టర్ విజయ్ మాట్లాడుతూ 'అమావాస్య' ట్రైలర్ చాలా బాగుంది. డైరెక్టర్ హర్రర్ జోనర్ స్పెషలిస్ట్. నాకు సచిన్ జోషి సినిమాలంటే చాలా ఇష్టం. నేను ఇంత వరకు తనతో సినిమా చేయలేదు.. త్వరలోనే తనతో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశిస్తున్నాను" అన్నారు.



తమన్నా చిత్రానికి వివాదాలు తప్పవా ?

కంగన రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన చారిత్రాత్మక చిత్రం మణికర్ణిక చిత్రం కొద్ది రోజులుగా పలు వివాదాలతో హాట్ టాపిక్‌గా నలుస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను 70 శాతం తానే రూపొందించానని కంగన క్రెడిట్ తీసుకోవడంతో దర్శకుడు క్రిష్ ఇటీవల అసంతృప్తిని వ్యక్తం చేస్తూ కంగనపై సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ మూవీ రూట్లోనే తమన్నా దటీజ్ మహాలక్ష్మీ చిత్రం వివాదాలతో హాట్ టాపిక్‌గా నిలుస్తుందా అనే దానిపై అభిమానులలో చర్చ జరుగుతుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుపుకుంటున్న దటీజ్ మహాలక్ష్మీ చిత్రానికి మొదట నీలకంఠ దర్శకత్వం వహించాడు. పలు కారణాల వలన ప్రాజెక్ట్ మధ్యలోనే ఆయన తప్పుకున్నాడు. మిగతా భాగాన్ని ప్రశాంత్ విహారి పూర్తి చేసాడు. అయితే సినిమా రిలీజ్ అప్పుడు టైటిల్స్‌లో దర్శకుడిగా నీలకంఠ, ప్రశాంత్ విహారి ఇద్దరి పేర్లు వేస్తారా లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. టైటిల్స్‌లో ఏ ఒక్కరి పేరు తొలగించినా మణికర్ణిక మాదిరిగా ఈ చిత్రం చుట్టూ వివాదాలు నెలకొనడం ఖాయమంటున్నారు విశ్లేషకులు.

పోలీసు కమిషనర్‌పై మమత ప్రశంసలు



కోల్‌కతా : శారదా పోంజి, రోజ్‌వ్యాలీ స్కాముల్లో కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌కు సీబీఐ సమన్లు జారీ చేయడంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను ప్రశంసించారు. ఆయన అత్యుత్తమ పోలీస్ అని అన్నారు. బీజేపీ నీచ రాజకీయాలతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తోందని విమర్శించారు. కుమార్ సామర్థ్యం, ధైర్యం, నిజాయితీలను ప్రశ్నించలేమని, ఆయన రోజుకు 24 గంటలూ పనిచేస్తారని మమత ట్వీట్ చేశారు. అసత్యాలు ఎప్పటికీ అసత్యాలుగానే ఉంటాయని ఆమె తెలిపారు.

జర్నలిస్టులపై దాడి.. నలుగురు బీజేపీ నేతలు అరెస్టు



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ బీజేపీ కార్యాలయంలో జర్నలిస్టులపై దాడికి పాల్పడ్డ నలుగురు బీజేపీ నేతలను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బీజేపీ కార్యాలయం ముందు జర్నలిస్టులు నిరసను దిగారు. బీజేపీ రాయ్‌పూర్ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ అగర్వాల్, స్థానిక నేతలు విజయ్ వ్యాస్, ఉత్కర్ష్ త్రివేది, దీనా డోంగ్రేలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండు చేశారు. ఈ దాడిలో సుమన్ పాండే అనే జర్నలిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై పాండే స్పందిస్తూ బీజేపీ నేతలే మీడియాను పిలిచారు. అక్కడి చేరుకున్న అనంతరం రాజీవ్ అగర్వాల్ సహా మరో ముగ్గురు నాపై దాడికి దిగారు. వారిని అడ్డుకోబోయిన జర్నలిస్టులపైనా విరుచుకుపడ్డారు' అని తెలిపారు. మరో జర్నలిస్టు మాట్లాడుతూ 'ఆ మీటింగ్ కవరేజికి వెళ్లాం. కొంత మంది బీజేపీ కార్యకర్తలు ఒక్కసారిగా మాపై దాడికి దిగారు. ఈ సంఘటనను మొబైల్‌లో రికార్డ్ చేశారు. ఆ వెంటనే రాజీవ్ అగర్వాల్ నన్ను కొట్టాడు. ఫోన్ లాక్కొని వీడియోను తొలగించారు. అక్కడ ఉన్న జర్నలిస్టులను ఓ గదిలో 20 నిమిషాల పాటు బంధించారు' అని అన్నాడు. సుమన్ పాండే ఫిర్యాదు మేరకు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎఎస్పీ ప్రఫుల్ కుమార్ తెలిపారు.

భవిష్యత్‌లో ఇంకా పెంచుతాం

రైతు రుణసాయంపై జైట్లీ



న్యూయార్క్ : రైతులకు ఇప్పుడు ప్రకటించిన నెలకు 500 రూపాయల సాయాన్ని భవిష్యత్‌లో మరింత పెంచుతామని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ సూచనప్రాయంగా చెప్పారు. ప్రభుత్వ వనరులు పెరుగుతున్నందున రైతు సాయాన్ని పెంచడానికి వీలు కలుగుతుందని తెలిపారు. తమ ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన రైతు సాయం పథకాన్ని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించడాన్ని జైట్లీ తప్పుబట్టారు. రోజుకు 17 రూపాయలు ఇచ్చి రైతులను అవమానిస్తారా అంటూ రాహుల్ ఆరోపించడాన్ని ఖండించారు. ముందుగా ప్రతిపక్ష నేత ఇంకా ఎదగాల్సి ఉందని వ్యాఖ్యానించారు. రాహుల్ జాతీయ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, కాలేజీ యూనియన్ ఎన్నికల్లో కాదని ఎద్దేవా చేశారు. 12 కోట్లమంది చిన్న, మధ్యతరగతి రైతులకు ఏడాదికి రూ.6 వేల నగదు అందజేస్తామని, వీటితో పాటు ఈ 12 కోట్ల మందికి గృహం, సబ్సిడీ ఆహారం, ఉచిత వైద్యసేవలు, ఉచిత పారిశుధ్యం, విద్యుత్, రోడ్లు, గ్యాస్ కనెక్షన్లు వంటివి లభిస్తాయని చెప్పారు. తక్కువ ధరకే ఇలాంటివన్నీ దొరుకుతాయని వివరించారు. తద్వారా వ్యవసాయ సమస్యలు కొంత మేరకు పరిష్కారమవుతాయని అన్నారు. జైట్లీ ఆదివారం పీటీఐకి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 'రైతు ఆదాయ మద్దతు పథకాన్ని ఈ ఏడాదే మొదటి సారిగా ప్రారంభించాం. ప్రభుత్వ వనరులు కచ్చితంగా మెరుగవుతాయి. అప్పుడు ఈ మొత్తం కూడా పెంచుతాం' అని చెప్పారు. 15 కోట్లమంది భూమిలేని రైతులు ఉన్నారు గదా అని ప్రశ్నించగా వారి కోసం ఉపాధి హామీ పథకం, ఇతర ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. యూపీఏ హయాంలో పి.చిదంబరం ఆర్థికమంత్రిగా రూ.70వేల కోట్ల రైతు రుణమాఫీ ప్రకటించారని, రూ.52 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని ఆరోపించారు. అందులో ఎక్కువ సొమ్ము అక్రమమార్గాల ద్వారా నకిలీ లబ్దిదారులకు చేరినట్టు కాగ్ గుర్తించిందని తెలిపారు. ఆ డబ్బు వ్యాపారులు, వాణిజ్య వేత్తల జేబుల్లోకి వెళ్లిందన్నారు. అది ఓ పెద్ద కుంభకోణమని జైట్లీ వ్యాఖ్యానించారు.

ఖర్గే నిత్య అసంతృప్తివాది

కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గేపై జైట్లీ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి నియామకానికి ఖర్గే అసంతృప్తి వ్యక్తంచేస్తారని అన్నారు. సీబీఐ చీఫ్ నియామకాన్ని సైతం రాజకీయ యుద్ధంగా మారుస్తారని ఆరోపించారు. సీబీఐ కొత్త చీఫ్ రిషికుమార్ శుక్లా నియామకంపై తన అసమ్మతిని తెలుపుతూ శనివారం మోడీకి ఖర్గే లేఖ రాశారు. అవినీతి కేసులు పరిష్కరించే అనుభవం ఆ అధికారికి లేదని విమర్శించారు. శుక్లా నియామకంలో చట్టం, సుప్రీంకోర్టు తీర్పులను మోడీ ప్రభుత్వం ఉల్లంఘించిందని అన్నారు. దీనిపై జైట్లీ స్పందిస్తూ శుక్లా నియామకంపై ఖర్గే మరోసారి అసమ్మతిని వెలిబుచ్చారని అన్నారు.

సీమాంచల్ ఎక్స్‌ప్రెస్‌కు

ఘోర ప్రమాదం

- పట్టాలు తప్పిన 11 బోగీలు
- ఆరుగురి మృతి : 29 మందికి గాయాలు : ఇద్దరి పరిస్థితి విషమం
- బీహార్‌లోని వైశాలీ జిల్లాలో ఘటన
- రూ.5లక్షలు ప్రకటించిన కేంద్రం, రాష్ట్రం నుంచి రూ.4 లక్షలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం



పాట్నా : ఢిల్లీకి చెందిన సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ బీహార్‌లోని వైశాలీ జిల్లాలో ఘోర ప్రమాదానికి గురైంది. 11 బోగీలు పట్టాలు తప్పడంతో ఆరుగురు మరణించారు. 29 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ఆదివారం తెల్లవారుజాము 4 గంటలకు ఈ ఘటన చోటుచేసుకున్నట్టు రైల్వే, పోలీసు అధికారులు వెల్లడించారు. పట్టాకు పగుళ్లు రావడంతో ఈ ప్రమాదం జరిగిందని తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈస్ట్ సెంట్రల్ జోన్, ప్రజా సంబంధాల ప్రధానాధికారి రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ, 'సోన్‌పూర్ డివిజన్, మహానార్ రోడ్డుకు దగ్గర్లో ఉన్న సహాదై బుజుంగ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఒక జనరల్ బోగీ, ఏసీ బోగీ 'బీ3', స్లీపర్ కోచ్‌లు ఎస్8, ఎస్9, ఎస్10తో పాటు మరో ఆరు బోగీలు పట్టాలు తప్పాయి' అని చెప్పారు. ఏడుగురు చనిపోయినట్లు తొలుత ప్రకటించిన రైల్వే.. చనిపోయినది ఆరుగురేనని తర్వాత వెల్లడించింది. వైశాలీ జిల్లాలోని ఆసుపత్రులతో సరైన సంప్రదింపులు లేకపోవడంతో మృతుల సంఖ్యపై గందరగోళం నెలకొందని వివరించింది. ఆసుపత్రిలో చనిపోయిన ఒకరిని రైలు ప్రమాద మృతుల్లో చేర్చడంతో ఏడుగురు మరణించినట్టు తొలుత పేర్కొన్నట్టు వెల్లడించింది. అయితే ఆ వ్యక్తి రైలు ప్రయాణికుడు కాదని తెలుసుకొని తప్పును సవరించుకుంది. మృతులను ఇచ్చా దేవి(66), ఇందిరా దేవి(60), షంసున్నీసా ఆలమ్ (26), అన్సర్ ఆలమ్ (29), సైదా ఖాతూన్ (40), సుదర్శన్ దాస్ (60)గా గుర్తించినట్టు ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ) వెల్లడించింది. గాయపడిన 29 మందిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారని పేర్కొంది. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించగా, తీవ్రంగా గాయపడిన వారిని ముజఫర్‌నగర్, పాట్నాలకు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించినట్టు అధికారులు వెల్లడించారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగాయని, సహాయక చర్యలు చేపట్టే రైలు, ఎన్డీఆర్ఎఫ్ కూడా సహాయక చర్యలు చేపట్టాయని కుమార్ తెలిపారు. ఈ రైలు ప్రమదంపై దర్యాప్తునకు ఆదేశించినట్లు రైల్వే భద్రత (ఈస్టరన్ జోన్) కమిషనర్ లతీఫ్ ఖాన్ వెల్లడించారు. సోనేపూర్, బరౌనీ జిల్లాల నుంచి వైద్యుల బృందాలను రప్పించామన్నారు. సహాయక చర్యల్లో నిమగ్నమైన సిబ్బందికి స్థానికులు సాయపడ్డారని చెప్పారు. సురక్షితంగా ఉన్న బోగీలలో 500మంది ప్రయాణికులతో రైలు ఉదయం 9.52 గంటలకు దానాపూర్‌కు పయనం కాగా, మరి కొందరిని 10 బస్సుల్లో హాజీపూర్‌కు తరలించినట్టు అధికారులు తెలిపారు. దానాపూర్, హాజీపూర్‌లలో ప్రయాణికుల కోసం తగిన ఏర్పాట్లు చేశామని, వారి బాగోగులు చూసేందుకు కమర్షియల్ అధికారులను నియమించామన్నారు. బాధితుల కోసం సోన్పూర్ 06158221645, హాజీపూర్ 06224272230, బరౌనీ 06279232222 హెల్ప్‌లైన్లను రైల్వేశాఖ ఏర్పాటు చేసింది.

ఎక్స్‌గ్రేషియా ప్రకటన

మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన రూ.50వేలు చొప్పున నష్ట పరిహారాన్ని కేంద్ర రైల్వేశాఖ ప్రకటించింది. అయితే రాష్ట్రంలోని నితీశ్ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.4లక్షలు, క్షతగ్రాత్తులకు రూ.50వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది.

ప్రధాని, సీఎం దిగ్భ్రాంతి

ఈ ఘటనపై ప్రధాని నరేంద్రమోడీ, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా మెజిస్ట్రేట్, ఎస్పీలు రైల్వేతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నట్టు నితీశ్‌కుమార్ పేర్కొన్నారు.

బాధాకరం : రాహుల్

ఈ ఘటన తనను బాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. మృతులకు సంతాపాన్ని, వారి కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు.

కాంగ్రెస్‌కు మహిళా ఎమ్మెల్యే రాజీనామా



అహ్మదాబాద్ (గుజరాత్) : లోక్‌సభ ఎన్నికలకు ముందు గుజరాత్‌లో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మెహసన జిల్లా ఉంఝా ఎమ్మెల్యే ఆషా పటేల్ తన ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి పంపించారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామాను స్పీకర్‌కు పంపారు. ప్రధాని మోడీ ఒకవైపున ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈబీసీ) పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తుంటే, కాంగ్రెస్ పార్టీ కులాల మధ్య విబేధాలు సృష్టిస్తోందని ఆమె విమర్శించారు. పార్టీలో ఫ్యాక్షన్ పెరిగిందని ఆరోపించారు.

టీఎంసీకి రోజులు దగ్గరపడ్డాయ్ : యోగి

బలూర్‌ఘాట్ : పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రజా వ్యతిరేక పాలనకు రోజులు దగ్గరపడ్డాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఆదివారం విమర్శించారు. జనవరి 19న టీఎంసీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ప్రతిపక్షపార్టీల నాయకులు ఆ రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులు నిర్వీర్యంపై ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అక్కడి ప్రజలను కలుసుకునే అవకాశం కల్పించడం లేదని, అందుకే దక్షిణ దీనజ్‌పూర్ జిల్లాలో నిర్వహించాల్సిన గణతంత్ర బచావ్ ర్యాలీని అనుమతించలేదని, దీంతో మోడీ ఆవిష్కరించిన డిజిటల్ ఇండియా ద్వారా మాట్లాడుతున్నానన్నారు. ప్రజలకు, ప్రజాస్వామ్యానికి టీఎంసీ వ్యతిరేకమని, దీంతో జాతీయ భద్రతకు ముప్పు పొంచి ఉందన్నారు.

పౌరసత్వ బిల్లుపై మహంత ఆగ్రహం



న్యూఢిల్లీ : రాజ్యసభ ఆమోదం పొందిన వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లు అమలైతే రాష్ట్రంలో అస్థిర పరిస్థితులు ఏర్పడతాయని అసోం మాజీ ముఖ్యమంత్రి ప్రఫుల్లా కుమార్ మహంత ఆదివారం హెచ్చరించారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన అసోం గణపరిషత్ (ఏజీపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు మహంత మాట్లాడుతూ 1979-85 కంటే మరింత ఉధృతమైన పరిస్థితిని ఎన్‌డీఏ ప్రభుత్వం నెలకొల్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం లేదని అన్నారు. రాష్ట్రంలోని అల్లకల్లోల పరిస్థితికి మోడీయే కారణమని ఆరోపించారు. 2014 నుంచి రాష్ట్రంలో నివాసముంటున్న ముస్లింయేతరులందరికీ పౌరసత్వం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించడంతో రాష్ట్రంలో నిరసన సెగలు వెల్లువెత్తుతున్నాయని ఆయనన్నారు.

యూపీలో 12 లక్షలమంది కొత్త ఓటర్లు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 14.40 కోట్లమంది ఓటర్లు ఉండగా, వారిలో 12 లక్షలమంది కొత్తగా నమోదయ్యారు. వీరంతా రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మొదటిసారి ఓట్లు వేయనున్నారు. 12,36,000 మంది ఓటర్లు 18-19 ఏళ్లవారు ఉన్నారని ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రధాని పిలుపుమేరకు కొత్త ఓటర్లకు చేరువ కావడానికి బీజేపీ యువ విభాగం భారతీయ యువ మోర్చా ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలోని 80 ఎంపీ సీట్లలో బీజేపీ 71 సీట్లను గెలుచుకోగా, ఎస్పీ ఐదు స్థానాల్లో విజయం సాధించింది.

ఈనెల్లోనే 'కిసాన్' తొలి విడత

- లబ్దిదారుల డేటా సిద్ధం
- పీటీఐ ఇంటర్వ్యూలో గార్గ్



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం కింద ఏడాదికి రూ.6వేలు చొప్పున రైతులకు ఆర్థికసాయం అందిస్తామని బడ్జెట్ సందర్భంగా ఆర్థికమంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. ఈ క్రమంలో తొలి విడత చెల్లింపులు ఈనెల్లోనే జరుగుతాయని ఆర్థిక శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే లబ్దిదారుల వివరాలు సిద్దంగా ఉన్నాయని చెప్పారు. ఈ పథకం ద్వారా 12 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, రైతులకు తొలి విడత చెల్లింపులకుగానూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కోట్లను కేటాయించినట్టు ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్రగార్గ్ తెలిపారు. బడ్జెట్ నేపథ్యంలో పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, 'ఈ పథకాన్ని 2018, డిసెంబరు 1 నుంచే అమల్లోకి తేవాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయించింది. భూరికార్డుల వివరాలన్నింటిని సేకరించింది. చిన్న, సన్న కారు రైతులకు సంబంధించి సమాచారం మొత్తం మా వద్ద ఉంది' అని అన్నారు. ప్రభుత్వం గతేడాదిలో 2015-16కిగాను వ్యవసాయ లెక్కలను ప్రకటించిందని, చాలా రాష్ట్రాల్లో ఇప్పటికే ఎలక్ట్రానిక్ రికార్డుల విధానం అమల్లో ఉందని చెప్పారు. తమ వద్ద ఉన్న వివరాలను పరిశీలించి లబ్ధిదారులను ఖరారు చేయడమే తరువాయి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో పాటుగా వ్యవసాయ శాఖ అధికారులు సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తారన్న విశ్వాసాన్ని గార్గ్ వ్యక్తంచేశారు. ఈ క్రమంలో ఫిబ్రవరిలోనే రైతులకు తొలి విడత చెల్లింపులు అందుతాయని అన్నారు.

ఈ పథకం ఖర్చుకు అదనంగా మరో రూ.20వేల కోట్లు కోసం పార్లమెంటు ఆమోదం పొందేందుకుగాను ఈ సెషన్‌లోనే ప్రయత్నిస్తామని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న బడ్జెట్ సమావేశాలు ఈనెల 13న ముగియనున్నాయి. 2019-20 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.1,49,981 కోట్లను ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే.

'పద్మశ్రీ'ని వాపసు చేస్తా..

పౌరసత్వ బిల్లుకు నిరసనగా నిర్మాత శ్యామ్‌శర్మ ప్రకటన



న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ బిల్లుపై ప్రజల ఆవేదనను అర్థంచేసుకోలేని ప్రభుత్వం ఇచ్చిన గౌరవం 'పద్మశ్రీ అవార్డు'ను అట్టిపెట్టుకోవడం నైతికంగా తప్పు అని, దానిని తిరిగిచ్చేస్తానని మణిపూరీ సినీనిర్మాత అరిబమ్ శ్యామ్‌శర్మ (83) ప్రకటించారు. 2006లో ఆయనను పద్మశ్రీ వరించింది. 1979-85లో జరిగిన విదేశీయుల వ్యతిరేక అసోం ఉద్యమంలో అమరులైన 855 మంది కుటుంబాలు సర్బానంద సోనోవాల్ అందించిన ప్రశంసా పత్రాన్ని తిరిగి ఇచ్చిన విషయం తెలిసింది. ఇది జరిగి వారం రోజులు గడవక ముందే పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తూ ప్రభుత్వం తనకు అందజేసిన పద్మశ్రీ పురస్కారాన్ని తిరిగిస్తానంటూ శ్యామ్‌శర్మ ప్రకటించారు. పౌరసత్వ బిల్లుతో ఈశాన్య రాష్ట్రాలు, మణిపూర్ ప్రజలకు ఏ ప్రయోజనం లేదన్నారు. మణిపూర్‌లో నిరసనలు మిన్నంటినా కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ బిల్లును ఆమోదించేందుకు గట్టి ప్రయత్నం చేస్తోందని శ్యామ్‌శర్మ తెలిపారు. 'పద్మశ్రీ' పొందడం గౌరవప్రదమే అయినప్పటికీ ప్రజాందోళనను లెక్కచేయని ప్రభుత్వం అందించినందు వలన దానిని తన వద్ద ఉంచుకోవడం నైతికంగా తప్పే అవుతుందని అన్నారు. అందుకే దానిని తిరిగిచ్చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. ప్రభుత్వ తీరుపై తన నిరసనను వ్యక్తం చేయడానికి ఇదే సరైన విధానమని శ్యామ్‌శర్మ అభిప్రాయపడ్డారు.

40ఏళ్ల సినీజీవితంలో 'ఇమాగీ నింగ్‌థెమ్' (అమూల్యమైన నా కుమారుడు, 1981), 'ఇషనౌ', 'సంఘై-ది డ్యాన్సింగ్ డీర్' వంటి చిత్రాలను అందించిన శర్మ పలు జాతీయ అవార్డులను అందుకున్నారు. 1970వ దశకంగా విప్లవాత్మక చిత్రాలకుగాను మంచి పేరుపొందారు.

అవినీతి ఊబిలో మోడీ సర్కారు

- మోడీ, నితీశ్ ప్రభుత్వాలను సాగనంపుదాం
- పాట్నా ర్యాలీలో రాహుల్‌గాంధీ
- మూడు దశాబ్దాల తర్వాత పాట్నాలో కాంగ్రెస్ ర్యాలీ



పాట్నా: మోడీ ప్రభుత్వం కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతూ రైతులకు రోజుకి రూ.17 మాత్రమే ఇస్తానంటుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. మోడీ ఎన్నికల ప్రచారంలో గొప్పలు చెప్పుకోవడం కోసమే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని, దాంతో రైతాంగానికి ఒరిగేదేమీ లేదని అన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో నితీశ్ ప్రభుత్వాలను సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాహుల్ బీహార్‌లో పర్యటించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో ఆదివారం జన ఆకాంక్ష ర్యాలీలో ప్రసంగించారు. దాదాపు మూడు దశాబ్దాల తరువాత పాట్నాలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించింది. రాహుల్ మాట్లాడుతూ.. బీహార్ అభివృద్ధిలో వెనుకబడిపోవడానికి నితీశ్, మోడీనే కారణమని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తరహాలో రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ దారుణంగా మారిపోయిందని, నిరుద్యోగం పెరిగిపోతోందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాట్నా కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విశ్వవిద్యాలయాల్లో ఇప్పుడు ప్రొఫెసర్లు లేరని అన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ కనీస ఆదాయ హామీ కల్పిస్తామని, ఆ మొత్తాన్ని బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని భరోసా ఇచ్చారు. అణగారిన వర్గాలకు యూనివర్సిటీలలో ఉద్యోగ అవకాశాలు రాకుండా మోడీ అడ్డుకుంటున్నారని నిందించారు. ప్రజల కన్నా తన పారిశ్రామిక మిత్రుల అభివృద్ధే మోడీకి ముఖ్యమన్నారు. బీహార్‌లోనూ, కేంద్రంలోనూ తామే ఏర్పాటు చేసే మహాకూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. బీహార్‌లో ఆర్‌జేడీ, ఇతర పార్టీలో కలిసి పోటీ చేస్తామన్నారు.

'పద్మ'ను తిరిగిచ్చేస్తా..



- ప్రభుత్వానికి హజారే హెచ్చరిక
- ఐదోరోజుకు చేరిన దీక్ష
- పూనే హైవేపై రాస్తారోకో
- భారీగా స్తంభించిన ట్రాఫిక్
- నేడు అహ్మద్‌నగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన

రాలేగావ్ సిద్ధి (మహారాష్ట్ర) : దేశప్రజలకు ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం తక్షణమే అమలు చేయకపోతే తన 'పద్మ భూషణ్' అవార్డును తిరిగిచ్చేస్తానని సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే ఆదివారం హెచ్చరించారు. ప్రజల విశ్వాసాన్ని మోడీ ప్రభుత్వం వొమ్ము చేసిందని విమర్శించారు. అవినీతి వ్యతిరేక వ్యవస్థలు లోక్‌పాల్, లోకాయుక్త ఏర్పాటులో జాప్యాన్ని నిరసిస్తూ అన్నా హజారే చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం ఐదో రోజుకు చేరింది. కేంద్రంలోనూ, మహారాష్ట్రలోనూ తక్షణమే అవినీతి వ్యతిరేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లాలోని స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో హజారే దీక్ష చేస్తున్నారు. హజారే దీక్షకు మద్దతుగా రైతులు, యువకులు అహ్మద్‌నగర్ - పూనే జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. 81 ఏళ్ల వయస్సులో రైతుల సమస్యలపై హజారే పోరాడుతుండటంతో అన్నదాతలు కదలివచ్చారు. రాలేగావ్ సిద్ధికి 38 కిలోమీటర్ల దూరంలోని పర్నార్ తహశీల్ యువకులు, రైతులు రాస్తారోకోలో పాల్గొనడంతో ఆరు కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. ఫలితంగా రాకపోకలకు అంతరాయం కలిగింది. తక్షణమే కేంద్రంలో లోక్‌పాల్‌ను, మహారాష్ట్రలో లోకాయుక్తను ఏర్పాటు చేయాలని ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన షాహిర్ గైక్వాడ్ డిమాండు చేశారు. ఈ రెండు వ్యవస్థలు లేకపోవటంతో అవినీతి విచ్చలవిడిగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. ఎన్నికల విధానంలో సంస్కరణలు తెచ్చేకంటే, రైతుల సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు. రాస్తారోకోను విరమించాలని ఆందోళనకారులకు చెప్పినా ఫలితంలేదని సూపా పీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర భోసాలే చెప్పారు. హజారే దీక్షకు పలు రాజకీయ పార్టీల నేతలు హాజరై మద్దతు ప్రకటించారు. హజారేపై ఎన్‌సీపీ అధికార ప్రతినిధి నవాబ్ మాలిక్ తప్పుడు ఆరోపణలు చేయటాన్ని పలువురు ఖండించారు. హజారే దీక్షకు మద్దతుగా ఐదు వేల మంది రైతులు అహ్మద్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేయనున్నారు.

అహింసా మార్గంలోనే ఆందోళన : హజారే

కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రంలో లోకాయుక్త ఏర్పాటు కోసం చేపడుతున్న దీక్షకు మద్దతు చేస్తున్న ఆందోళనలు అహింసా విధానంలో ఉండాలని హజారే సూచించారు. ఆందోళనలలో పాల్గొనే వారు గౌరవప్రదంగా, హుందాగా వ్యవహరించాలని సూచించారు. అంతకుముందు ఆయన రాష్ట్ర ప్రభుత్వ దూతగా వచ్చిన మంత్రి గిరీష్ మహాజన్‌ను కలిసేందుకు నిరాకరించారు. సీఎం కార్యాలయంలో లోకాయుక్త ఆఫీసును ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర కేబినెట్ నిర్ణయించటాన్ని స్వాగతించారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా కేంద్రంలో లోక్‌పాల్, మహారాష్ట్రలో లోకాయుక్త ఏర్పాటు, రైతుల సమస్యలను పరిష్కరించేంత వరకు తన ఆందోళన ఆగదని స్పష్టం చేశారు. లోక్‌పాల్, లోకాయుక్త స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలన్నారు.

ఫడ్నవీస్ ప్రభుత్వ జోక్యం అవశ్యం : థాక్రే

సామాజిక ఉద్యమకారుల జీవితాలతో ఆటలాడటం మంచిదికాదని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే అన్నారు. హజారే నిరాహార దీక్షపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండు చేశారు. హజారే ఆరోగ్యంపై థాక్రే ఆందోళన వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. అవినీతి నిర్మూలన కోసం హజారే పోరాటం చేస్తుంటే, ప్రధానమంత్రి కార్యాలయం శుభాకాంక్షలు తెలుపుతూ లేఖ పంపించటాన్ని ఆయన ఖండించారు. అవినీతిపై జీవితాన్ని త్యాగం చేయడానికి బదులు వీధుల్లోకి వచ్చి ప్రజలను చైతన్యపరచాలని హజారేను కోరారు. దేశ ప్రజలు ప్రస్తుతం మత్తులో ఉన్నారని, తక్షణమే వారిని ఆ పరిస్థితి నుంచి విముక్తులను చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు జయప్రకాష్ నారాయణ్ తరహాలో అన్నా హజారే సరికొత్త ఉద్యమానికి శ్రీకారంచుట్టడంలో కీలకపాత్ర పోషించాల్సి ఉందన్నారు.

నాకు ఏమైనా జరిగితే ..

అవినీతిపై పోరాడుతున్న తనకు ఏమైనా జరిగితే ప్రధాని మోడీని ప్రజలు నిలదీస్తారని, తన పరిస్థితికి ఆయనదే బాధ్యతని అంటారని అన్నాహజారే అన్నారు. లోక్‌పాల్, లోకాయుక్తల నియామకాల్లో జాప్యాన్ని నిరసిస్తూ మహారాష్ట్రలోని రాలేగావ్-సిద్ధిలో జనవరి 30 నుంచి 'జన ఆందోలన్ సత్యాగ్రహ' పేరిట నిరశనను హజారే చేస్తున్న విషయం తెలిసిందే. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 'సరైన సాక్ష్యాధారాలు ఉంటే లోక్‌పాల్ ద్వారా ప్రధానమంత్రిని, లోకాయుక్త ద్వారా ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలనూ విచారించవచ్చు. అది జరగకూడదనే లోక్‌పాల్, లోకాయుక్తల నియామకాన్ని కేంద్రప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఏ పార్టీ కూడా ఈ వ్యవస్థలు అమల్లోకి రావాలని కోరుకోవడంలేదు. లోక్‌పాల్ బిల్లుకు 2013లోనే పార్లమెంటు ఆమోదం లభించింది. అయినా ఇప్పటివరకు లోక్‌పాల్‌ను నియమించలేదు' అని అన్నారు.



కొండపల్లి ఖిల్లాకు కొత్త కళ

విశాలాంధ్ర - ఇబ్రహీంపట్నం : రాష్ట్ర రాజధాని అమరావతి పరిధిలోని కొండపల్లి ఖిల్లా ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. 11వ శతాబ్దం నుంచి చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండపల్లి ఖిల్లా ఔన్నత్యాన్ని భావితరాలకు చాటిచెప్పే లక్ష్యంతో రాష్ట్ర సాంస్కృతికశాఖ, పురావస్తు, మ్యూజియం, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖిల్లా ఉత్సవాలకు పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చారు. విద్యుత్ వెలుగులతో ఖిల్లా నూతన శోభను సంతరించుకుంది. ఖిల్లా లోపల తీర్చిదిద్దిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కోట ప్రాశస్త్యాన్ని తెలిపేలా లేజర్ షో ఏర్పాటు చేశారు. తొలి రోజు యూత్ హాస్టల్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రదర్శించిన 12 రకాల సాహస క్రీడలు ఆకట్టుకున్నాయి. 16 రాష్ట్రాల నుంచి 250 మంది క్రీడాకారులు, ఆరు దేశాల నుంచి మరో 10 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద నిర్వ హించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పర్యాటకుల రాకతో సంగమం సందడిగా మారింది. హెలీరైడ్, పారా మోటరింగ్, పారా సైలింగ్, హాట్ ఎయిర్ బెలూన్ కార్యక్రమాలకు పర్యాటకుల నుంచి మంచి స్పందన వచ్చింది. రాష్ట్ర పురావస్తుశాఖ కమిషనర్ జి.వాణిమోహన్, కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం పర్యవేక్షించారు.

అసంఘటిత కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు

రవీంద్రనాథ్ డిమాండ్




విశాలాంధ్ర - విజయనగరంటౌన్ : అసంఘటిత కార్మికులకు భరోసా కోసం తక్షణం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. విజయనగరంలోని అమర్‌భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 49 లక్షల మంది అసంఘటిత కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అర్హులకు ప్రతి నెలా రూ.3 వేల పెన్షన్ కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నవంబరు 8, 9, 10 తేదీల్లో పార్లమెంటు ఎదుట ఆందోళన ఫలితంగా గత బడ్జెట్‌లో ఎట్టకేలకు రూ.3 వేల పెన్షన్ ప్రకటించారన్నారు. ఈ పథకం అమలులో షరతులు పెట్టడం అన్యాయమన్నారు. 18 ఏళ్ళ వయసు నుంచి 60 ఏళ్ళ వరకు నెలకు రూ.100 చొప్పున చెల్లిస్తేనే పెన్షన్ ఇస్తామనడం దారుణమన్నారు. సంక్షేమబోర్డు సాధన కోసం ఈ నెల 6న విజయవాడ ధర్నాచౌక్ వద్ద మహాధర్నాకు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. వీధి విక్రయదారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎస్.రంగరాజు, బుగత అశోక్, ఉపాధ్యక్షుడు టి. జీవన్న, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుగత సూరిబాబు, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.వి.రమణ పాల్గొన్నారు.

ప్రజా రాజధానిగా అమరావతి ప్రఖ్యాతి



విశాలాంధ్ర - విజయవాడ (లబ్బీపేట) : అమరావతి ప్రజా రాజధానిగా ఎంతో ప్రఖ్యాతి చెందిందని, ఇక్కడ భవన నిర్మాణాలు అతి తక్కువ సమయంలో అత్యాధునిక టెక్నాలజీతో రూపుదిద్దుకుంటున్నాయని నార్మన్ ఫాస్టర్స్ అండ్ పార్టనర్స్ ఆన్ అమరావతి క్యాపిటల్ సిటీ ప్లానింగ్ డైరెక్టర్ పెడ్రో హ్యబర్ బాష్ అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైన్స్ అమరావతి రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న 'అమరావతి డిజైన్ ఫెస్టివల్ 2019' ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా పెడ్రో హ్యబర్ బాష్ మాట్లాడుతూ అమరావతి హైకోర్టు దేశంలోనే అతిపెద్దదన్నారు. అమరావతిలో భవన నిర్మాణాలు పూర్తిస్థాయి గ్రీన్ బిల్డింగ్స్‌గా రూపొందిస్తున్నారన్నారు. రాజధాని నిర్మాణంలో యువ ఆర్కిటెక్ట్‌ల పాత్ర ఎంతో ఉందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్న రాజధాని దేశంలోనే ప్రముఖ నగరాలలో ఒకటిగా ఉంటుందన్నారు. అమరావతి డిజైనర్ విజయవాడ ఛాప్టర్ చైర్మన్ పవర్ కె. సూర్యదేవర మాట్లాడుతూ నూతన రాజధానిలో మొదటిసారి డిజైన్ ఫెస్టివల్ ద్వారా ఎంతో మంది ఆర్కిటెక్ట్‌లు రాజధాని నిర్మాణానికి వివిధ నమూనాలను ప్రదర్శించారన్నారు. మన రాష్ట్రంలోని ఆర్కిటెక్ట్‌ల ప్రతిభను చాటేందుకు డిజైన్ ఫెస్టివల్ నిర్వహించామన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆర్కిటెక్ట్‌లు యువ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారన్నారు. ఐఐఐడీ అమరావతి ఛాప్టర్ కోశాధికారి, బీఎస్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జై దేశాయ్ మాట్లాడుతూ అమరావతి డిజైన్ ఫెస్టివల్‌లో మన దేశంతో పాటు ఇతర దేశాల ప్రతినిధులు పాల్గొనడంతో మంచి స్పందన లభించిందని తెలిపారు. తొలుత నిర్మాణ రంగంలో ఆర్కిటెక్ట్‌ల పాత్ర అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్ తెలంగాణ చైర్మన్ గురురాజ్ మలినేని, వీవీఐటీ సంస్థ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సినీ నటులు, ప్రముఖ ఆర్కిటెక్ట్ పెన్మత్స సుబ్బరాజు, సీనియర్ ఆర్కిటెక్ట్ కల్పన రమేష్, ప్రముఖ సింగర్ స్మిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలోని చారిత్రాత్మక కట్టడాలైన తాజ్‌మహల్, వివిధ రాష్ట్రాల సచివాలయాలు, హైకోర్టు భవనాల నిర్మాణంలో ఆర్కిటెక్చర్, బిల్డర్ల పాత్ర, యువ ఆర్కిటెక్ట్‌లు నిర్మాణ రంగంలో ఎటువంటి పాత్ర పోషించాలన్న అంశంపై చర్చ సాగింది.

కులాల మధ్య చిచ్చుపెడితే ఊరుకోం



విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : రాజకీయ లబ్ధికోసం కులాల్లో చిచ్చుపెడితే ఊరుకోమని, మత్స్యకారుల సమస్యలు పరిష్కరించకపోవడమే కాకుండా, తమలో తమకు చిచ్చుపెట్టేందుకు ముఖ్యమంత్రి యత్నిస్తే సహించేదిలేదని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా గురువులు హెచ్చరించారు. తమకు న్యాయంచేయాలని కోరుతూ ఆదివారం విశాఖలోని జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి, ఎల్ఐసీ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి మత్స్యకారులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కోలా గురువులు మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు జయహో బీసీ సదస్సులో కార్పొరేషన్లు ఇస్తామని వాగ్దానాలు చేశారన్నారు. రాష్ట్రంలోని మత్స్యకారులందరికీ అనకుండా కేవలం అగ్నికుల క్షత్రియులు, వహ్నికుల క్షత్రియులకు కార్పొరేషన్లు ప్రకటించడంతో పాటు, ఎస్సీ ఎస్టీలలో చేర్చుతానని పేర్కొన్నారని, మత్స్యకారులను మాత్రం విస్మరించారన్నారు. ఈ సామాజిక అసమానతలు ఎప్పటినుంచో వాడబలిజలు, మిగతా ఉపకులాలపై చూపిస్తూ తమను చులకనగా చూస్తున్నారన్నారు. వైఎస్ఆర్‌సీపీ నగర మహిళా అధ్యక్షురాలు గిరికిన గౌరి మాట్లాడుతూ మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలంటూ కొంతకాలంగా పోరాడుతున్నప్పటికీ, చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. వాడబలిజలు, ఇతర ఉపకులాలకు సముచిత స్థానం కల్పిస్తూ సంప్రదాయ మత్స్యకారులకు న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బడే రామారావు, రాజశేఖర్, జానకిరామ్, మూగి శ్రీనివాసరావు, మైలుపిల్లి శ్రీనివాసరావు, చీకటి రమేష్, కంబాల షణ్ముఖరావు, బండ ప్రకాష్, గుంటు మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్నా రాష్ట్ర అధ్యక్షుడుగా వీఎస్ ప్రసాద్



విశాలాంధ్ర - విజయనగరం : ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (అప్నా) రాష్ట్ర అధ్యక్షుడుగా విజయనగరం పట్టణానికి చెందిన డాక్టర్ వీఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. విజయనగరంలో ఆదివారం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఏడాదిపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని చిన్న ఆసుపత్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వైద్యులతో చర్చించారు. చిన్న ఆసుపత్రుల మనుగడకు తనవంతు కృషి చేస్తానని ప్రసాద్ అన్నారు. విజయనగరం ఎంపీ పి.అశోక్‌గజపతిరాజు, అప్నా మాజీ రాష్ట్ర కార్యవర్గంతోపాటు రాష్ట్రంలోని 13 జిల్లాల అప్నా నాయకులు హాజరయ్యారు.

వైద్యానికి నామమాత్రపు నిధులు దారుణం



విశాలాంధ్ర - గుడివాడ : వైద్య విధానపరిషత్‌కు కేంద్ర ప్రభుత్వం నామమాత్రపు నిధులు కేటాయించడం దారుణమని ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పొట్లూరి గంగా ధరరావు విమర్శించారు. విజయవాడలోని ఐఎంఏ హాలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగేళ్ళుగా వైద్యా రంగానికి నిధుల కేటాయింపు అంకెల గారడీలా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చివరి బడ్జెట్‌లోనూ ప్రజల ఆరోగ్య భద్రతకు నిధుల కేటాయింపులో విఫలమైందన్నారు. మెరుగైన వైద్యం అందించడం కోసం ఐఎంఏ సలహాలు తీసుకోకపోవడంతో వైద్యానికి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం జరుగుతోందన్నారు. నిధులు ఇవ్వకుండా పేదలకు సేవలు అందిస్తున్న వైద్యులపై కఠిన చట్టాలను తీసుకురావడం బాధాకరమన్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరఫున ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో డాక్టర్ సోమారి వెంకట్రావ్, వల్లూరిపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

పరీక్షల తేదీలతో పరేషాన్

- అయోమయంలో విద్యార్థులు
- తీవ్ర ఒత్తిడిలో ఉపాధ్యాయులు
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

విశాలాంధ్ర ప్రతినిధి - కాకినాడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పరీక్షల తేదీల ప్రకటనలు గందరగోళం సృష్టిస్తున్నాయి. రోజుకో తేదీ ప్రకటి స్తున్న ఉన్నతాధికారులు విద్యార్థులతోపాటు ఉపాధ్యా యులను అయోమయానికి గురిచేస్తున్నారు. పరీక్ష పేరుతో తీవ్ర ఒత్తిడి పెంచడం తగదని ఉపాధ్యా యులు వ్యాఖ్యానిస్తున్నారు. ఒకే సమయంలో రెండు మూడు పరీక్షల నిర్వహణ ఒత్తిడికి గురి చేయడమేనంటున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకూ నిరంతర మూల్యాంకన పరీక్షలను జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీసీబీ) నిర్వహిస్తుంది. నిరంతర మూల్యాంకన పరీక్ష-4 ను తొలుత ఫిబ్రవరి 7,8,11 తేదీల్లో పెట్టాలని ప్రకటించారు. పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 6,7,8 తేదీల్లో ఫార్మెటివ్-4 పరీక్ష నిర్వహించాలని మరో ప్రకటనలో షెడ్యూల్ ఇచ్చారు. ఇదే సమయంలో 6వ తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకూ ఫార్మెటివ్ పరీక్ష-4ను తిరిగి ఫిబ్రవరి 20, 21, 22 తేదీల్లో జరపాలని మరో షెడ్యూల్‌తో ఉత్తర్వులు జారీ చేశారు. ఇదికాకుండా పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ప్రకటించారు. ఆ తేదీలను మార్పు చేస్తూ ఫిబ్రవరి 18 వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ ప్రీ ఫైనల్ అంటూ అధికారులు మరో షెడ్యూల్ ఇచ్చారు. ఇలా రోజుకో రీతిలో తేదీలు మార్చుతూ ఉన్నతాధికారుల ప్రకటనలు విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను అయోమయా నికి గురిచేస్తున్నాయి.

సంక్రాంతి పండుగ ముందు పదో తరగతి విద్యార్థులకు రివిజన్ పరీక్ష నిర్వహించి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మరో రెండు టెస్టులు కూడా పెట్టాలని ఆదేశించినా ఆ రివిజన్ టెస్ట్ పేపర్లు స్కూళ్ళకు రానేలేదు. ఇదే క్రమంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ టెస్ట్‌లు నిర్వహించడంతోపాటు రోజూ మార్కులను రికార్డుల్లో నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ పరీక్షల విధానాన్ని సమీక్షించడం కోసం రివ్యూ టీమ్‌లు ఫిబ్రవరి మొదటి వారంలో వస్తాయని ప్రకటించారు. రోజూ పరీక్షలతోపాటు మూల్యాంకన పరీక్షలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఉపాధ్యాయులు గగ్గోలుపెడుతున్నారు. మూల్యాంకన పరీక్షలతోపాటు ప్రీ ఫైనల్ పరీక్షలు ఉన్నప్పటికీ పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించడం, వాటి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఆవశ్యకత ఏమిటని ఉపాధ్యాయులే ప్రశ్నిస్తున్నారు. దీంతో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి పడుతుందన్నారు. ఈ పరీక్షల నిర్వహణ ఒకటైతే వాటిని సమీక్షించే బృందాలతో ఉపాధ్యాయులను ఒత్తిడి గురిచేయడం ఏమిటని నిలదీస్తున్నారు. డిసెంబరులో సమీక్షించిన ఈ బృందాలు తిరిగి ఫిబ్రవరిలో మళ్ళీ తనిఖీలు చేస్తాయని అధికారులు ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పరీక్ష తేదీల గందరగోళాన్ని సరిచేయడంతోపాటు ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించడం ద్వారా ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరుతున్నారు.



దుర్గమ్మ సన్నిధిలో తెలంగాణ జడ్జిలు

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసివున్న కనకదుర్గమ్మను ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. అమరావతి హైకోర్టు తాత్కాలిక భవనం ప్రారంభోత్సవానికి వచ్చిన చీఫ్ జస్టిస్ బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తులు సోహాన్, శివశంకర్ ఆలయానికి చేరుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేదపండితుల ఆశీర్వచనలు తీసుకున్నారు. ఆలయ ఈవో కోటేశ్వరమ్మ ప్రసాదాలు అందజేశారు.



బందరు పోర్టుకు ముహూర్తం ఖరారు

- 7న సీఎం చంద్రబాబు రాక కోసం ఏర్పాట్లు
- నవయుగ సంస్థ డైరెక్టర్, ముడా చైర్మన్ పరిశీలన
- సముద్రంలో 10 కి.మీ. పొడవునా కాలువ తవ్వకం
- తొలుత ఒక బెర్త్ నిర్మాణం

విశాలాంధ్ర - మచిలీపట్నం : బందరు పోర్టు పనుల ప్రారంభోత్సవానికి శరవేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల ఏడవ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. తపసిపూడి పోలీస్‌ట్రైనింగ్ సెంటర్ సమీపంలో డ్రెడ్జింగ్, మేకావానిపాలెం వద్ద సీఎం సభా ప్రాంగణాన్ని ఆదివారం పోర్టు నిర్మాణ సంస్థ నవయుగ డైరెక్టర్ వై.రమేష్, ముడా చైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు పరిశీలించారు. తొలివిడత సముద్రపు అంచు నుంచి 10 కిలో మీటర్ల పొడవునా సముద్రంలో ఓడలు రాకపోకలు సాగించేలా కాలువ తవ్వకం పనులు చేపట్టనున్నట్టు నవయుగ డైరెక్టర్ వెల్లడించారు. పోర్టుకు ఇదే కీలకమన్నారు. 18 నెలల వ్యవధిలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. మొదట ఒక బెర్తు నిర్మిస్తామని, అనంతరం డిమాండ్‌ను బట్టి బెర్తుల నిర్మాణం జరుగుతుందన్నారు. పోర్టు పనుల ప్రారంభోత్సవం చరిత్రలో నిలిచిపోతుందని వేదవ్యాస్ అన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న రమేష్‌ను పోర్టు పనులకు నియమించడంతో వేగవంతంగా జరుగుతాయనే నమ్మకం ఏర్పడిందన్నారు. ఎన్నో ఉద్యమాల ఫలితమే పోర్టు నిర్మాణ ఘట్టమన్నారు. పోర్టుకు అనుసంధానంగా రోడ్డు, రైల్వేలైను కనెక్టివిటీ కోసం భూమి కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, మునిసిపల్ చైర్మన్ ఎం వెంకటబాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి కిరీటాలు మాయం

- ముగ్గురు అర్చకులపై అనుమానం
- సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్న పోలీసులు
- 1300 గ్రా. ఆభరణాల మాయంతో టీటీడీలో అలజడి
- రెండు రోజుల్లో పట్టుకుంటామని ఈఓ వెల్లడి

విశాలాంధ్ర - తిరుపతి క్రైమ్ : తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో మూడు కిరీటాల మాయం కలకలం రేపింది. స్వామి నగల అపహరణలో గతంలో కోదండరామాలయం ఘటన పునరావృతం కావడం గమనార్హం. టీటీడీ సెక్యూరిటీ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన తిరుపతి అర్బన్ జిల్లా పోలీసులు శనివారం రాత్రంతా విచారణ చేపట్టారు. తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయం తిరుమల శ్రీవారి ఆలయం తరువాత ప్రసిద్ధి చెందింది. ఆలయంలోని గర్భాలయం పక్కనే లక్ష్మీ వెంకటాచలం, పద్మావతి దేవిలతో కూడిన ఉప ఆలయం వుంది. ఆ ఆలయంలో దేవతామూర్తుల మూడు కిరీటాలు శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాయి. సాయంత్రం కనుక్కున్న సంబంధిత ఆలయ సూపరింటెండెంట్ వెంటనే డిప్యూటీ ఈఓ వరలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక అర్చకులను విచారించి అనంతరం పదమూడు వందల గ్రాముల బరువున్న మూడు కిరీటాల నగలు మాయమైనట్లు నిర్ధారించు కొని ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అర్బన్ ఎస్పీ ఆధ్వర్యంలో ఫింగర్‌ప్రింట్ నిపుణులు ఆలయం లోపల, వెలుపల క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయంలోని 12 సీసీ కెమేరాల పుటేజ్‌లను స్వాధీనం చేసుకున్నారు. టీటీడీ విజిలెన్స్ సీవీఎస్‌వో గోపీనాథ్ జెట్టి సిబ్బందితో కలిసి, జేఈవో పోలా భాస్కర్ తొమ్మిది గంటల నుంచి ఆలయం తలుపులు మూసి వేసి విచారణ కొనసాగించారు. ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు, సిబ్బంది, ముగ్గురు మహిళా స్వీపర్లను ప్రశ్నించిన అధికారులు సీసీ కెమేరా పుటేజిలను పరిశీలించారు. అర్బన్ ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ పదమూడు వందల గ్రాముల బరువున్న మూడు బంగారు కిరీటాల చోరీపై ఆరు ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టామన్నారు. వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఆలయం వెలుపలకు వచ్చిన టీటీడీ సీవీఎస్వో గోపీనాథ్ జెట్టి మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 12 సీసీ కెమేరాల్లో శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఉన్న పుటేజీలను పరిశీలించామన్నారు. ఆదివారం ఉదయం నుంచి సీసీ కెమేరాల్లో నిక్షిప్తమైన రెండు రోజుల పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులను పట్టుకుంటామన్నారు. సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆలయానికి చేరుకుని విచారణ ను పర్యవేక్షించారు. త్వరగా కారకులను పట్టుకోవాలంటూ ఆలయ అధికారులకు అక్షింతలు వేశారు. స్వామివారి నగల రికవరీ కోసం టీటీడీ విజి లెన్స్, అర్బన్ పోలీసు దర్యాప్తు వేగవంతం చేశాయి. టీటీడీ అదనపు సీవీఎస్‌వో శివ కుమార్‌రెడ్డి, సీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏసీఈవో బాలాజీ, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి పాల్గొన్నారు.

పొంతన లేని అర్చకుల సమాధానాలు

ఆలయంలో పనిచేస్తున్న ముగ్గురు అర్చకుల తీరుపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఉప ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అర్చకులు ముగ్గురూ పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. నగల వ్యవహారంపై పోలీసులు ఒక అంచనాకు వచ్చినట్లు వినికిడి.

ఏయూకి రూ. 100 కోట్ల రూసా నిధులు



విశాలాంధ్ర - విశాఖసిటీ : ఆంధ్ర విశ్వ విద్యాలయానికి రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ (రూసా) రెండవ విడత రూ. 100 కోట్ల నిధులు మంజూరు అయినట్లు ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ దేశంలోని 10 విశ్వవిద్యాలయాలను గుర్తించి రూ. 100 కోట్లు చొప్పున అందిస్తుంది. జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఆదివారం జరిగిన ప్రధానమంత్రి డిజిటల్ లాంచింగ్‌లో విశాఖలో రూసా పథకం అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని వీసీ నాగేశ్వరరావు, ఎంపీ కె.హరిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ 2020 నాటికి రూ. వంద కోట్లతో వర్సిటీలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. తరువాత దశలో వర్సిటీకి రూ. 1,000 కోట్లు 2025 నాటికి కేటాయిస్తుందన్నారు. వర్సిటీని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది ప్రపంచ అత్యుత్తమ విశ్వవిద్యాల యాల్లో ఒకటిగా నిలిపే దిశగా ఎంహెచ్ఆర్‌డీ కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు, రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, రూసా సమన్వయకర్త ఆచార్య రమణ మూర్తి, ప్రిన్సిపాల్స్, డీన్స్ తదితరులు, పెద్దసంఖ్యలో ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధాని ప్రసంగాన్ని, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.

ఇక స్మార్ట్ కేస్ షీట్లు

- పైలెట్ ప్రాజెక్టుగా విశాఖ టీబీ ఆస్పత్రిలో అమలు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో..
- రోగి సమగ్ర సమాచారం నమోదు
- ఎన్ఏబీహెచ్ కమిటీ పర్యటనతో మార్పులు



విశాలాంధ్ర - విశాఖ సిటీబ్యూరో : రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు ఉన్నత వైద్య సేవలతోపాటు ఆరోగ్య సమస్యల వివరాలన్నీ తెలిసేలా కేస్ షీట్లను స్మార్ట్‌గా తీర్చిదిద్దనున్నారు. విశాఖ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న వైద్య ఆరోగ్యశాఖ తొలుత విశాఖ టీబీ ఆస్పత్రిలో అమలుచేస్తున్నారు. త్వరలోనే కేజీహెచ్, వీజీహెచ్‌తో పాటు అన్ని బోధనాస్పత్రుల్లో అమలు చేయాలని వైద్య ఆరోగ్యశాఖాధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకూ రోగుల కేసు షీటులో అరకొర సమాచారం నమోదు చేసేవారు. స్మార్ట్ కేస్ షీటులో రోగి సమగ్ర వివరాలతో పాటు జబ్బు, శాస్త్రీయ నామాన్ని ఇంటర్నేషనల్ క్లాసిఫికేషన్ ఆఫ్ డిసీజెస్ (ఐసీడీ) కోడ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. ఈ కొత్త కేస్ షీటును మరి కొద్ది రోజుల్లో నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రవేశపెట్టేలా ఆయా ఆస్పత్రుల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్మార్ట్ కేస్ షీట్లలో రోగి వివరాల నమోదుపై వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి స్వల్పకాలిక శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల్లో రోగుల కేస్ షీటులో రోగి పేరు, వ్యాధి లక్షణాల సమాచారం, అందుతున్న వైద్యం, చేసిన పరీక్షలు, మందుల వివరాలను నమోదు చేస్తున్నారు. స్మార్ట్ కేస్ షీటులో రోగి వివరాలు, వ్యాధి లక్షణాల నుంచి అందిస్తున్న చికిత్సతోపాటు సమగ్ర సమాచారం నమోదు కానుంది.

ఎన్ఏబీహెచ్ గుర్తింపు కోసమే..

నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) గుర్తింపునకు ఐసీడీ బార్ కోడ్ కలిగిన కేసు షీట్లను అమలుచేయడం తప్పనిసరి కావడంతో స్మార్ట్ కేస్‌షీట్లను అన్ని ఆస్పత్రుల్లో ప్రవేశపెట్టనున్నారు. గతేడాది నగరంలో కొన్ని ఆస్పత్రుల్లో ఎన్ఏబీహెచ్ బృందం తనిఖీ సమయంలో పాత కేస్ షీట్ల వాడకాన్ని గుర్తించి అభ్యంతరాలు తెలిపారు. ఎన్ఏబీహెచ్ గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో రోగుల సమాచారం పక్కగా ఉండటంతో పాటు అందుతున్న చికిత్స వివరాలు సమగ్రంగా ఉండాలి. నూతన విధానంలోనే కేస్ షీట్ల నిర్వహణ ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేయడంతో నగరంలోని బోధనాసుపత్రులన్నీ కేస్ షీట్ల మార్పునకు సిద్ధమవుతున్నాయి. విశేషం ఏమిటంటే స్మార్ట్ కేస్ షీట్‌లో రోగి జబ్బు పరిస్థితిని ఓ గ్రాఫ్ రూపంలో పొందుపర్చాల్సిఉంది.

రోగి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారంతో..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులను వివిధ విభాగాల వైద్యులు పరీక్షిస్తుంటారు. రోగి ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ముగ్గురు నుంచి నలుగురు వైద్యులతో పాటు షిఫ్ట్‌ల వారీ ఆయా విభాగాల వైద్య సిబ్బంది ఎలాంటి సేవలు అందించారో పూర్తి స్థాయిలో తెలియాలన్న భావనతో స్మార్ట్ కేస్ షీటు విధానం తెరపైకి వచ్చింది. ఏ విభాగం వైద్యుడు ఏయే సమయంలో ఎలాంటి మందులు వాడారన్నది స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి మెరుగైన వైద్యసేవల కోసం ఏదైనా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలనుకుంటే రోగితో పాటు బంధువుల నుంచి అంగీకారపత్రంపై సంతకాలు సేకరిస్తున్నారు. స్మార్ట్ కేస్‌షీటులో కూడా ఆ అంశాన్ని పొందుపరుస్తూ ప్రింట్ చేయనున్నారు. రోగికి చికిత్స సమయంలో అపాయం జరిగినా, ఇబ్బందులు ఎదురైనా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం లేదని అంగీకరిస్తున్నట్లు ప్రత్యేక కాలమ్‌లో రోగుల సహాయకులు సంతకం చేస్తే సరిపోతుంది.





సముద్రంలో ఇద్దరు ఫార్మసీ విద్యార్థుల గల్లంతు

విశాలాంధ్ర - ఎస్.రాయవరం : విశాఖ జిల్లా ఎస్.రాయవరం మండలంలోని బంగారమ్మపాలెం గ్రామ సమీపంలో సముద్రంలో స్నానానికి దిగిన ఇద్దరు ఫార్మసీ విద్యార్థులు నీటి ఉధృతిలో గల్లంతయ్యారు. బంగారమ్మ పాలెం గ్రామంలో ఆదివారం శ్రీవల్లభేశ్వర స్వామి పండగ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వికాస్ ఫార్మసీ కాలేజ్‌లో డీఫార్మసీ చదువుతున్న 12 మంది విద్యార్థులు తోటి విద్యార్థి సూరాడ సూకరాజు ఇంటికి వెళ్ళారు. భోజనం అనంతరం సముద్ర స్నానానికి దిగారు. కొద్దిసేపటి తర్వాత కొందరు విద్యార్థులు ఒడ్డుకు చేరారు. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకి చెందిన షేక్ ఇమామ్, తూర్పుగోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన జి.అవినాష్, గుంటూరు జిల్లా నరస రావుపేటకి చెందిన ప్రసన్న స్నానాలు చేస్తూ అలలు తాకిడికి కొట్టుకుపోతున్నారు. దీంతో మిగిలిన విద్యార్థులు కేకలు వేయడంతో స్థానిక మత్స్యకారులు రక్షించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. ప్రసన్నను మాత్రం సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఇమామ్, అవినాష్ గల్లంతు కావడంతో తోటి విద్యార్థులు కన్నీరు మున్నీరవుతున్నారు.

18న తెలంగాణకు 15వ ఆర్థికసంఘం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజులపాటు 15వ ఆర్థిక సంఘం బృందం తెలంగాణలో పర్యటించనుంది. మొదటి రెండు రోజులు హైదరాబాద్‌లోనే ఉండే ఆర్థిక సంఘం బృందం తొలుత ముఖ్యమంత్రితో భేటీకానుంది. ఆపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై డిమాండ్లు, ప్రతిపాదనలు స్వీకరిస్తుంది. అనంతరం వివిధ పార్టీలు, సంఘాలతో సమావేశమవుతోంది. రాష్ట్రంలో అమలవుతోన్న సంక్షేమ పథకాలు, వాటికి నిధుల కేటాయింపులాంటి అంశాల వివరాలను సేకరించనుంది. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతలతో పాటు వివిధ గ్రామాలకు ఆర్థిక నిపుణుడు ఎన్‌కే సింగ్ నేతృత్వంలోని బృందం వెళ్లనుంది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పనులను పరిశీలించనుంది. ఈ పర్యటన సందర్భంగా వచ్చిన డిమాండ్లు, ప్రతిపాదనలతో నివేదికను అక్టోబరు 30లోగా అందజేస్తుంది. ఈ నివేదికలోని అంశాలను 2020, ఏప్రిల్ నుంచి అమలు చేయాల్సి ఉంటుంది. మరోవైపు 15వ ఆర్థిక సంఘానికి అందించే నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆర్థిక సంఘం పర్యటన తర్వాతే తెలంగాణలో బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌కు కిషోర్ చంద్రదేవ్ గుడ్‌బై



విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం : కాంగ్రెస్ పార్టీ సినియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి, ఆ పార్టీ కోర్‌కమిటీ సభ్యులు వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. విజయనగరం జిల్లా కురుపాం కోటలో ఆయన ఆదివారం విలేకర్ల సమావేశంలో ఈ విషయం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వపు పోకడలు తనకు ఏమాత్రం నచ్చలేదని, చాలా విషయాల్లో పార్టీలో తగిన ప్రాధాన్యత కూడా ఇవ్వటం లేదని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తన మిత్రులు, శ్రేయోభిలాషులతో చర్చించిన తరువాత భవిష్యత్ కార్యాచరణను వెల్లడిస్తానని కిషోర్ చెప్పారు. కాగా ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడం ఇప్పటికే ఖరారైనట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కిషోర్‌తో పూసపాటి అశోక్‌గజపతిరాజు, మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు చర్చించినట్లు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో కిషోర్‌ను అరకు పార్లమెంటు స్థానం నుంచి బరిలోకి దించేందుకు టీడీపీ యోచిస్తున్నట్లు సమాచారం.



దళితుల పురోభివృద్ధి దిశగా ఎన్నికల మేనిఫెస్టో ఉండాలి

డీహెచ్‌పీఎస్ రౌండ్‌టేబుల్ డిమాండు

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : ఉపాధి, విద్య, ఆర్థిక, పారిశ్రామిక, రాజకీయరంగాల్లో దళితుల పురోభివృద్ధికి అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టో విడుదల చేయాలని వక్తలు డిమాండు చేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో విశాఖ పౌర గ్రంథాయలంలో దళిత సంఘాలతో 'సార్వత్రిక ఎన్నికలు - దళిత మేనిఫెస్టో' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కేఎస్ చలం దళిత మేనిఫెస్టోను విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీలకు నాణ్యమైన విద్య, ఉపాధి, ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో తగిన వాటాతో పురోగతికి భరోసా కల్పించాలని చలం డిమాండు చేశారు. దళిత మేనిఫెస్టోతో వచ్చే రాజకీయ విలువలు కలిగిన రాజకీయ పార్టీలనే తమ పేటల్లోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రాజ్యాంగాన్ని అవమానించే శక్తులను అంగీకరించేదిలేదన్నారు. ఏడు దశాబ్దాలుగా 74 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు దారిద్ర్యరేఖకు దిగువ మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 63 శాత మందికి విద్య అందుబాటులో లేక నిరక్షరాస్యులుగా ఉన్నారని తెలిపారు. ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు 8 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుండగా, పారిశ్రామిక, వాణిజ్యరంగాల్లో వారికి ప్రవేశంలేకపోవటం శోచనీయమన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ, దళితుల ఉపాధికి అండగా ఉన్న ప్రభుత్వ రంగం ప్రైవేటుకు మళ్లుతోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషనలను అమలు చేసేలా చట్టం తేవాలవన్నారు. ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల సాగుభూమి పంచాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం 9 షెడ్యూల్‌లో చేర్చి పటిష్టంగా అమలు చేయటంతోపాటు దళితులకు రక్షణ కల్పించాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ, ఓటుతో గద్దెనెక్కి మనువాద పాలనతో బీజేపీ దళితులపై దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. అలాంటి బీజేపీకి ఓట్లు అడిగే నైతిక హక్కులేదన్నారు. అంబేద్కర్ భావ జలాన్ని, లౌకిక రాజకీయాలను మాత్రమే దళితులు అంగీకరిస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో దళిత నేతలు బొడ్డు కల్యాణరావు, ఆర్‌పీ రాజు, భూషణం, వెంకటరమణ, రాంబాబు, మండే సత్యనారాయణ, మాటూరి చిన్నారావు, పతివాడ రాంబాబు, ఆర్ వెంకటరమణ, మామిడి రవి సిద్ధార్థ, ఈతలపాలక సుజాత, కాకర రమణ, శంకర్రావు కృష్ణారావు, చింతాడ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి చౌకీదారు



కోల్‌కతా : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్పొరేట్‌శక్తులు, దోపిడీదార్లకు 'చౌకీదార్ (కాపలా దారు)'గా ఉన్నారనీ వామపక్ష నాయకులు విమర్శించారు. దేశాన్ని కాపాడేందుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ కాపలదారుడిని ఓడిద్దామని పిలుపు నిచ్చారు. కేంద్రం లోని ఎన్డీయే పాలనలో మతోన్మాదం పడగవిప్పుతోందని విమర్శించారు. దేశంలోని అన్ని రాజ్యాంగ సంస్థలను ఎన్డీయే ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని అన్నారు. వామపక్ష సంఘటన ఆధ్వర్యంలో ఆదివారం కోల్‌కతాలో ప్రజా కవాతు(పీపుల్స్ బ్రిగేడ్) పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలోని ఎన్డీయే, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్ష సంఘటన ఈ ర్యాలీ నిర్వహించింది. అనంతరం బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు సురవరం సుధాకరరెడ్డి, సీతారాం ఏచూరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సురవరం ప్రసంగాన్ని కొనసాగిస్తూ, కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టి తాత్కాలిక బడ్జెట్ కేవలం ఎన్నికల జిమ్మిక్కుగా అభివర్ణించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ బడ్జెట్‌ను రూపొందించారని అన్నారు. "బీజేపీ ప్రభుత్వం చేసిన ఇతర హామీలలా బడ్జెట్ కూడా ఒక జిమ్మిక్కు. మోడీ ప్రభుత్వం దేశంలోని అన్ని సంస్థలను ధ్వంసం చేస్తోంది. పార్లమెంట్‌ను సైతం సరిగా పనిచేయించడం లేదు. పార్లమెంట్లో ప్రజాసమస్యలు లేవనెత్తనీయడంలేదు" అని విమర్శించారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిన అవశ్య కతను ఆయన నొక్కిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న ఆర్థిక విధానాల పట్ల తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉన్నదన్నారు. "ఎన్డీయే పాలనలో మైనారిటీలు, దళితులపై పదేపదే దాడులు జరుగుతున్నాయి. సీబీఐ, ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వంటి రాజ్యాంగ సంస్థలను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోంది. ఇది సరైన పద్ధతి కాదు" అని సురవరం అన్నారు.

సీతారాం ఏచూరి మాట్లాడుతూ, నరేంద్ర మోడీ తాను కాపలాదారునని చెప్పుకుంటున్నారు, అయితే ఆయన దేశాన్ని దోచుకునే వారికి కాపలాదారుగా ఉన్నారు తప్ప ప్రజలకు కాదని విమర్శించారు. ఎన్డీయే పాలనలో మతోన్మాదం విచ్చలవిడిగా పెరిగిపోయింద న్నారు. కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. "వచ్చే ఎన్నికలలో కాపలాదారు మోడీని మేము ఓడిస్తాం. మాకు అటువంటి కాపలాదారు అవసరం లేదు. మతోన్మాదమనే విషాన్ని వారు దేశమంతా వ్యాప్తి చేస్తున్నారు" అని ఏచూరి చెప్పారు. గత ఐదేళ్లుగా ప్రజలను దోచుకున్న పాలకులు ఇప్పుడు రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొన్ని తాయిలాలను వేస్తున్నారని అన్నారు. దేశానికి ప్రస్తుతం మార్పు అవశ్యమనీ, దేశ అభివృద్ధి విధానం మారాలని అన్నారు. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ ఎన్నికల జిమ్మిక్కని, "తప్పుడు వాగ్దానాలు చూసి మోసపోవాలని ప్రజలు కోరుకోవడంలేదు" అని అన్నారు. రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను కూడా వామపక్ష నాయకులు విమర్శించారు. "కాషాయ పార్టీ, రాష్ట్రంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఒకే నాణెనికి రెండు బొమ్మలు వంటివి" అని అన్నారు. కేంద్రంలో బీజేపీని ఓడించడం ఎంత అవసరమో రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్‌ని ఓడించడం కూడా అంతే అవసరమని వారు నొక్కిచెప్పారు. జేఎన్‌యూ విద్యార్థిసంఘం మాజీ అధ్యక్షుడు, సీపీఐ నాయకుడు కన్హయ కుమార్ అనారోగ్యం కారణంగా ర్యాలీకి హాజరుకాలేకపోయారు. ఆయన మెడ నొప్పితో బాధపడుతున్నారు.

రాకేశే హంతకుడు

జయరామ్ హత్యకేసును ఛేదించిన పోలీసులు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కోస్టల్ బ్యాంకు అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరామ్ మర్డర్ మిస్టరీ వీడింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు నాలుగు బృందాలుగా విడిపోయి, రెండు రోజులుగా దర్యాప్తు చేపట్టారు. సెల్‌సిగ్నల్స్ ఆధారంగా కేసును ఛేదించారు. జయరామ్ మేనకోడలు శిఖా చౌదరి ప్రియుడు రాకేష్ రెడ్డి కిరాయి హంతకులతో జయరామ్‌ను హతమార్చినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో రాకేశ్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆయనను హైదరాబాద్ నుంచి నందిగామకు తరలించారు. డబ్బు కోసమే ఈ హత్య జరిగిందని భావిస్తున్నారు. జయరామ్‌ను హైదరాబాద్‌లో చంపేసి అనంతరం కారులో నందిగామ వైపు తీసుకెళ్లి ప్రమాదంలో మరణించినట్లు చిత్రీకరించేందుకు యత్నించారన్నారు. జయరామ్ మేనకోడలు శిఖా చౌదరి పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. రాకేశ్‌రెడ్డి నుంచి శిఖా చౌదరి రూ.4.5 కోట్లు అప్పు తీసుకుంది. ఈ విషయమై వీరికి గొడవలున్నాయి. దీంతో ఆ డబ్బును తాను చెల్లిస్తానని జయరామ్ సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిసింది. అయితే, డబ్బు తీసుకున్నది శిఖా చౌదరి కనుగు అప్పు తీర్చాల్సిన ఆమెను వదిలి జయరామ్‌ను రాకేశ్ ఎందుకు చంపాడన్నది పోలీసులకు అంతుచిక్కడంలేదు. నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఉన్న శిఖా చౌదరిని కలవడానికి కబాలి చిత్ర నిర్మాత కేపీ చౌదరి ఎందుకొచ్చారు? శిఖా చౌదరి తల్లి సుశీలను పోలీసు స్టేషన్‌కు ఎందుకు పిలిపించారు? వంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. శిఖాను కేసు నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. జయరామ్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలన్నీ శిఖా చౌదరి కనుసన్నల్లోనే జరగడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. ఆదివారం జూబ్లీహిల్స్‌ని మహాప్రస్థానంలో జయరామ్ అంత్యక్రియలు జరిగాయి.

వివాహేతర సంబంధం నిజమే.. : శిఖాచౌదరి

జయరామ్‌తో తనకు వివాహేతర సంబంధం ఉన్నమాట వాస్తవమేనని శిఖా చౌదరి వెల్లడించింది. ఓ విల్లా విషయంలో రాకేశ్‌రెడ్డితో తనకు గొడవైందని, జయ రామ్‌ను అతను చంపుతాడని అనుకోలేదని, చెక్ పవర్ జయరామ్ భార్య పద్మజ పేరుతో ఉందని పోలీసులకు తెలిపింది. తనకు రెండు పెళ్లిళ్లు అయ్యాయని.. ఇద్దరితో విడాకులు తీసుకున్నానని చెప్పింది. రెండో భర్తను వదిలేయడానికి రాకేశ్‌రెడ్డి కారణమని, అతనితో డేటింగ్ చేశానని, అతన్ని పెళ్లి చేసుకుందామనుకున్నానని తెలిపింది. జయరామ్ వల్ల రాకేశ్‌రెడ్డికి దూరం కావాల్సి వచ్చిందని, రాకేశ్‌ని తాను జయరామ్‌కు పరిచయం చేసినట్టు వెల్లడించింది. రాకేశ్‌కు సొంత వ్యాపారం అంటూ ఏవీ లేవని, జయరామ్‌కు రాకేశ్ రూ.4.5 కోట్లు అప్పు ఇచ్చారని, చెక్‌పవర్ అత్త చేతిలో ఉండటం వల్ల మామయ్య ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపింది. అదే కారణంతో జయరామ్ చాలా మంది దగ్గర అప్పులు చేశారని, ఆ డబ్బును సకాలంలో తిరిగి ఇవ్వలేదని, ఈ విషయంలోనే రాకేశ్‌తో తనకు గొడవలు జరిగేవని చెప్పింది. జయరామ్‌పై రాకేశ్ కోపం పెంచుకున్నాడని వెల్లడించింది. జయరామ్ హత్యతో తనకు లాంటి సంబంధం లేదని, హత్య జరిగిన రోజు శ్రీకాంత్‌తో వికారాబాద్‌కు లాంగ్ డ్రైవ్‌కి వెళ్లానని చెప్పింది. ఉదయం 6 గంటలకు తన అమ్మ ద్వారా మామయ్య మృతి వార్త తెలిసిందని శిఖాచౌదరి తెలిపింది. శ్రీకాంత్ కలిసి జయరామ్ ఇంటికి వెళ్లి జగ్గయ్య పేటలో తనకు రాసిచ్చిన 10 ఎకరాల భూమి పత్రాలను తీసుకొని బెజవాడకు వెళ్లినట్టు వివరించింది. బెజవాడ పోలీసులు ఫోన్ చేస్తేనే వెళ్లానని, జయరామ్ మంచోడదని, తన చెల్లికి మెడికల్ సీట్ ఇప్పించాడని తెలిపింది. అయితే తనను, తన చెల్లిని అతను లైంగికంగా వేధించాడని, వాటిని తట్టుకోలేక తన చెల్లి ఇంటికి దూరంగా ఉంటోందని చెప్పింది. తనతోనూ శారీరక సుఖం కోరుకునేవాడని తెలుపుతూ, ఇది తన వ్యక్తిగత జీవితమని, తనకు నచ్చింది కాబట్టి ఒప్పుకున్నానని చెప్పుకొచ్చింది. పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తానని శిఖాచౌదరి తెలిపింది.

ఏసీ గదులకు పరిమితమైతే

రూ.6 వేల విలువేం తెలుసు?

- కాంగ్రెస్‌పై మోడీ ఎదురుదాడి
- రైతు రుణమాఫీయే ఆ పార్టీ మంత్రమని విమర్శ

జమ్ము/లేహ్ : ఎన్నికల్లో విజయం సాధించడానికి రైతు రుణమాఫీయే కాంగ్రెస్ పార్టీకి తారకమంత్రంగా కనిపి స్తోందని ప్రధాని నరేంద్రమోడీ ఎదురు దాడికి దిగారు. అది తప్ప కాంగ్రెస్ వద్ద ఇంకేమీ లేదని ఎద్దేవా చేశారు. తన ప్రభుత్వం ప్రకటించిన రైతు ఆదాయ ప్రణాళికను విమర్శిస్తున్న ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు. ఢిల్లీలో ఏసీ గదుల్లో కూర్చున్న వారికి పేద రైతులకు సాయంగా అందించే రూ.6వేల ప్రాముఖ్యత గురించి తెలియదని అన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైతులను దగ్గర చేసుకోవ దానికి మధ్యంతర బడ్జెట్‌లో ఏడాదికి రూ.6వేలు సాయమందిస్తామని మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. తమ పథకం కింద పెద్దసంఖ్యలో రైతులకు లబ్ధి చేకూరు తుందని మోడీ చెప్పారు. పీఎం-కిసాన్ పథకం రైతులకు ఓ వరం వంటిదని అన్నారు. 2008-09లో ఆరు లక్షల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేస్తామని రైతులకు హామీ ఇచ్చిందని. కానీ అధికా రంలోకి వచ్చిన తర్వాత కేవలం రూ.52వేల కోట్లు మాత్రమే మాఫీ చేసిం దని ఆరోపించారు. అందులో 25-30 లక్షల మంది రుణమాఫీకి అర్హులేకాదని కాగ్ గుర్తించిందని చెప్పారు. నరేంద్రమోడీ ఆదివారం జమ్మూకాశ్మీరులో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జమ్ము, లేహ్‌లలో జరిగిన ర్యాలీల్లో మోడీ ప్రసంగించారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ చేపట్టిన రుణమాఫీ ఓ ప్రహసనంగా మారిందని, లబ్ధిదారులకు 13 రూపాయ ల చెక్కులు అందజేశారని ప్రధాని ఆరోపిం చారు. తమ ప్రభుత్వం ప్రకటించిన పీఎం-కిసాన్ పథకం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామ న్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.75 వేల కోట్లు కేటాయించామన్నారు. అంటే రానున్న పదేళ్లలో రైతుల ఖాతాల్లో రూ.7.50 లక్షల కోట్లు జమచేస్తామని చెప్పుకొచ్చారు. ఐదెకరాల లోపు గల 90శాతం మంది రైతులను ఈ పథకం కిందకు తీసుకురావడమే లక్ష్యమని అన్నారు. రూ.2 వేల చొప్పున మూడు విడతలుగా ఏడాదికి ఆరువేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. 'ఈ దేశంలో గొప్పవారిగా ట్రాక్ రికార్డు ఎవరికి ఉందో ప్రజలకు తెలుసు. ఎన్నిక లకు ముందు వారికి రైతుల భయం పట్టు కుంది. రుణమాఫీ ప్రకటించడం ద్వారా రైతులు వారికి ఆపద్బాంధవుల్లా కనిపిస్తు న్నారు. అది కూడా పదేళ్ల తర్వాత రైతు జపం చేస్తున్నారు. యూపీఏ అధికారంలో ఉండగా రైతును పట్టించుకున్న దాఖలాలు లేవు' అని పరోక్షంగా కాంగ్రెస్‌ను ఉద్దేశించి మోడీ విమర్శలు చేశారు. రైతు రుణమాఫీపై విమర్శలు చేస్తున్న మోడీ పార్టీ 2017లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉత్తరప్రదేశ్‌లో రైతులకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించిన విషయాన్ని మర్చిపోరాదు. అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్న, సన్నకారు రైతులకు లక్ష రూపాయల వరకు రుణాలు మాఫీ చేస్తామని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. కాశ్మీరీ పండిట్ల రక్షణకు తమ ప్రభుత్వ కట్టుబడి ఉందని ప్రధాని చెప్పారు. పండిట్లు సొంత ఇళ్లు వదిలి శరణార్థులుగా వెళ్లడం బాధిస్తోం దని అన్నారు. పండిట్ల బాధే తన బాధ అని వ్యాఖ్యానించారు. లేహ్ ప్రాంతంలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపన చేశారు.

మళ్లీ నేనే ప్రధాని

మళ్లీ తానే ప్రధానమంత్రి పదవి చేపడతానని మోడీ చెప్పుకున్నారు. ఇప్పుడు శంకుస్థాపనలు ప్రాజెక్టులను ప్రధానిగా తానే ప్రారంభిస్తానని అన్నారు. 'మా పని విధానం భిన్నమైనది. జాప్యం, తినే సంస్కృతి కారణంగా పనులు చాలా వెనక్కి పోతున్నాయి. రానున్న ఐదేళ్లలో ఈ సంస్కృతిని దేశం నుంచి తరిమేస్తాను. సకాలంలోనే ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాను' అని మోడీ నమ్మబలికారు.

రాజకీయాల్లో మార్పు రావాలి

నెల్లూరు సభలో రామకృష్ణ, మధు పిలుపు



విశాలాంధ్ర - బ్యూరో నెల్లూరు : రాజకీయాల్లో మార్పు రావాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ , పి. మధు అన్నారు. నూతన రాజకీయ ప్రత్యామ్నాయంపై నెల్లూరులోని ఏసీ సెంటర్ వద్ద ఆదివారం సాయంత్రం సీపీఐ, సీపీఎం, జనసేన ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో రామకృష్ణ మాట్లాడుతూ నూతన రాజకీయ ప్రత్యామ్నాయం కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. తాము సీనియర్ నాయకులమని మోడీ, బాబు చెప్పుకుంటున్నారని, కానీ కేసీఆర్‌ని ఇద్దరు కాపీ కొడుతున్నారని తెలిపారు. గత నాలుగు సంవత్సరాల 9 నెలల కాలంలో ఏమి చేశారని ప్రశ్నించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, ఎన్ని ఇచ్చారో చెప్పాలని డిమాండు చేశారు. రాఫెల్ యుద్ధ విమానాల తయారీలో 30 వేల కోట్ల రూపాయలను అంబానీకి కట్టబెట్టారని మండిపడ్డారు. రైతులకు సంవత్సరానికి రూ. 6000 ఇస్తామని చెబుతున్నారని, నెలకు 500 రూపాయలు ఇస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందా అని ప్రశ్నించారు. ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా, దోపిడీదారులందరూ అసెంబ్లీలో తిష్ట వేశారని విమర్శించారు. దేశంలో ఒక శాతం ధనవంతుల చేతిలో 52 శాతం సంపద ఉందన్నారు. నాలుగున్నర సంవత్సరాలు కోటీశ్వరులకు అనుకూలంగా పనిచేసి ఇప్పుడు ఓట్ల కోసం ప్రజలకు తాయిలాలు అంటున్నారని విమర్శించారు. అమరావతి ప్రాంతంలో 10 వేల కోట్ల రూపాయల విలువైన భూములను సింగపూర్ కంపెనీకి చంద్రబాబు కట్టబెట్టారని తెలిపారు. తిరిగి అధికారం కోసం పాకులాడుతున్నారని, మార్పు రావాలంటే బాబు గద్దె దిగాలన్నారు. నాలుగు సంవత్సరాల 9 నెలల కాలంలో ఏం చేశారని 13 జిల్లాల్లో ఒక్క పేదవాడికి ఎకరా భూమి పంచిపెట్టారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రం 94 వేల కోట్ల రూపాయల లోటు బడ్జెట్‌లో ఉంటే ప్రత్యేక విమానాలలో దేశాలు తిరిగి, అనవసరంగా ఖర్చులు చేసి దాన్ని రెండు లక్షల 49 వేల కోట్లకు చంద్రబాబు పెంచారన్నారు. రాజధానికి రైతులు భూములు ఇస్తే, ఆ భూములను తాకట్టు పెట్టేందుకు చంద్రబాబు బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నాడన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అందరూ సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. ఇదిలా ఉంటే జగన్మోహన్ రెడ్డిది సింగిల్ ఎజెండా అని, నాకు సీఎం కుర్చీ కావాలి అని అంటున్నారని తెలిపారు. 67 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే సంవత్సరం నుంచి అసెంబ్లీకి పోకుండా జీతాలు ఎలా తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఏదైనా కంపెనీలో ఒక కార్మికుడు ఒక రోజు పనికి వెళ్లకపోతే కూలి కట్ చేస్తారని, కానీ ఎమ్మెల్యేలు సంవత్సరం నుంచి అసెంబ్లీకి పోకుండా జీతాలు ఎలా తీసుకుంటున్నారో వారే ఆలోచించుకోవాలన్నారు. ఆయనకు ఓట్లు అడిగే నైతిక హక్కులేదన్నారు. రానున్న ఎన్నికల్లో నూతన రాజకీయ ప్రత్యామ్నాయ విధానంతో, నూతన అజెండాతో ప్రజల కోసం వస్తున్న సీపీఐ, సీపీఎం, జనసేన పార్టీలను ఆదరించాలని రామకృష్ణ కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని చంద్రబాబు భ్రష్టు పట్టించారన్నారు. పేదల ఆలనాపాలనా గాలికొదిలేశారని, కేంద్రం లో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ కలిసి ప్రజలను కష్టాల్లోకి నెట్టారన్నారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ, కాంగ్రెస్, టీడీపీల మధ్య ప్రజలు బందీలుగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, జనసేన పార్టీలు మూడో శక్తిగా అవతరించబోతున్నా యన్నారు. బాబు నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఏమీ చేయలేదని, కానీ ఇప్పుడు పింఛన్లు, పసుపు కుంకుమ పేరుతో జనాన్ని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. నెల్లూరు నగరంలో 10000 ఇల్లు కట్టిస్తున్నారని, అవి ఎలా సరిపోతాయని లక్ష మందికి ఇళ్లు కావాలని అన్నారు. రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపడ్డారు. ఇంతకుముందు పార్టీల డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసే వారని, కానీ నేడు ప్రభుత్వ సొమ్ముతో కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మోసపూరిత రాజకీయాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జీఎస్టీ దెబ్బకు రేట్లు భారీగా పెరిగాయని తెలిపారు. ఈ సభకు సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు రమేష్, మునీర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ప్రభాకర్, రాజగోపాల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దామా అంకయ్య, సీనియర్ నేతలు పముజుల దశరథరామయ్య, రామరాజు, పార్థసారథి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అన్వర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్, నేతలు కరిముల్లా, సిరాజ్, జనసేన జిల్లా నాయకులు టోనీబాబు, వినోద్‌రెడ్డి, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలోకి కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే

భువనేశ్వర్ : ఒడిశా కోరాట్‌పూర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే కృష్ణ చంద్ర సగారియా బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ)లో చేరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌పై పోటీ చేయాలని ఉందన్నారు. సగారియా ప్రముఖ దళిత నాయకుడు. ఒడిశా బీఎస్పీ ఇన్ చార్జ్ ధరమ్‌వీర్ సింగ్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. బీఎస్పీ అధినేత్రి అనుమతిస్తే సీఎంపై పోటీచేస్తానన్నారు. కుందలిలో జరిగిన దళిత మైనర్ గ్యాంగ్‌రేప్, ఆత్మహత్య కేసులో నైతిక బాధ్యత వహిస్తూ 2018 నవంబరు 6న ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. పార్టీవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో ఈ ఏడాది జనవరి 19న కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయనను బహిష్కరించారు.

విదేశీ విద్యపై యువత మక్కువ : స్వామిగౌడ్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: విదేశాల్లో ఉన్నత విద్యాభాసంపై యువత మక్కువ చూపుతున్నందుకు ఎక్సెల్లా ఎడ్యుకేషన్ సదస్సుకు విశేష స్పందన రావడమే నిదర్శనమని శాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ తెలిపారు. చేశారు. విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునే కోర్సును బట్టీ యూనివర్సిటీని ఎంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల వసతులు, హాస్టల్ వంటివి పరిశీలించి ఎంచుకోవాలన్నారు. ఎక్సెల్లా ఎడ్యుకేషన్ గ్రూప్ ఆధ్వర్యంలో "విదేశాల్లో విద్యను అభ్యసించడం ఎలా" అనే అంశంపై సదస్సును ఆయన ప్రారంభించారు. విదేశాల్లో ఉన్న యూనివర్సిటీలు, కోర్సుల గురించి బీటెక్, బీకాం, బీఎస్సీ అండర్ గ్రాడ్యుయేట్, ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్సెల్లా గ్రూప్ చైర్మన్ అరసవల్లి అరవింద్ మాట్లాడుతూ అమెరికా, స్విట్జర్లాండ్, సోవేనియా, కెనడా వంటి దేశాలకు చెందిన ప్రముఖ వర్సిటీల ప్రతినిధులతో తొలిసారిగా ఈ సదస్సును విజయవాడ రాజధాని అమరావతిలో నిర్వహించామని, ఇందుకు కేఎన్ యూనివర్సిటీ వేదికైందని తెలిపారు.

క్రీడలు

మావాళ్లు సత్తా చాటారు



వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో చివరి వన్డేలో సత్తా చూపిన ఆటగాళ్లను టీమిండియా తాత్కాలిక సారథి రోహిత్ శర్మ ప్రశంసించాడు. కఠిన పరిస్థితుల్లో తమను తాము పరీక్షించుకోవాలని భావించామని వెల్లడించాడు. నాలుగో వన్డేలో భారత్ 35 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మ్యాచ్ అనంతరం రోహిత్ మాట్లాడుతూ 'నాలుగు వికెట్లు చేజార్చుకున్న తర్వాత ఎవరో ఒక్కరైనా రాణించాలని కోరుకున్నాం. రాయుడు, విజయ్ శంకర్ ఆ పని చేశారు. వారిద్దరి భాగస్వామ్యం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. చివర్లో హార్దిక్, కేదార్ మెరుపులు మెరిపించారు. మేమెంతో పట్టుదల ప్రదర్శించాం. మ్యాచ్ జరుగుతున్న కొద్దీ వికెట్ ఫ్లాట్‌గా మారింది. ఒకానొక దశలో ఛేదన సులభమవుతుందని భావించాం. కానీ బౌలింగ్ విభాగం సమష్టిగా రాణించింది. కీలక సమయాల్లో బ్యాట్స్‌మెన్‌ను ఔట్ చేశారు. ఇంతకన్నా నేను వారి నుంచి ఇంకేం ఆశిస్తాను. మ్యాచ్ గెలవాలంటే జట్టు కూర్పు బాగుండాలి. ఏదేమైనప్పటికీ న్యూజిలాండ్ వచ్చి ఆతిథ్య జట్టును 4-1తో ఓడించడం గొప్ప గుర్తింపు' అని రోహిత్ అన్నాడు.



ర్యాంపుపైనే భయం..!

ప్రముఖ రెజ్లర్ గీతా ఫొగాట్

న్యూఢిల్లీ : ప్రముఖ రెజ్లర్, కామన్వెల్త్ బంగారు పతక విజేత గీతా ఫొగాట్ రింగ్ వదిలి కాసేపు ర్యాంప్‌పై కనిపించారు. ల్యాక్మే ఫ్యాషన్ షోలో పాల్గొన్న ఆమె మహిళలకు పలు సూచనలు చేసింది. మహిళలు ఆరోగ్యంగా, దృఢంగా ఉండడమే నిజమైన అందమంటూ వ్యాఖ్యానించారు. మహిళలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. "ర్యాంప్‌పై నడవడం ఇదే మొదటిసారి. రింగ్‌లోకి వెళ్లడం కంటే ర్యాంప్‌పై నడవడానికే భయంగా ఉంది. ఇది నాకు ఒక గొప్ప అనుభవం. ఈ రంగంలో ఉన్న అనేక మంది గొప్ప వ్యక్తులను కలవడం సంతోషంగా ఉంది" అని గీతా ఫొగాట్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఆత్మస్థైర్యం లేకపోతే బయటికి అందంగా కనిపించడం కష్టమంటూ మహిళలను ఉత్తేజపరిచే ప్రయత్నం చేసింది. 'బ్యూటిఫుల్లీస్ట్రాంగ్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో పలు ప్రముఖ సంస్థలు నిర్వహిస్తున్న ఈ 'షో'లో వివిధ రంగాలకు చెందిన 11మంది ప్రముఖులను ఆహ్వానించారు. వీరిలో నటీమణులు తిలోత్తమ షోమ్, సయానీ గుప్తా, నాటక రంగంలో పేరుగాంచిన ఐషా సయ్యద్‌తో పాటు సెలబ్రెటీ చెఫ్ సారా టాడ్ తదితరులు ఉన్నారు.





రాయుడు.. రఫ్ఫాడించాడు..!

- కివీస్ గడ్డపై టీమిండియా నయా చరిత్ర
- చివరి వన్డేలో రోహిత్ సేన ఘనవిజయం
- 4-1 తేడాతో సిరీస్ కైవసం
- పాండ్య ఆల్‌రౌండ్ షో
- బ్యాట్‌తో మెరిసిన శంకర్
- బంతితో చెలరేగిన చాహల్, షమీ

వెల్లింగ్టన్ : న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన చివరి వన్డేలో భారత్ 35 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో 4-1తో సిరీస్ నెగ్గి 52 ఏళ్లుగా సాధ్యం కాని ఘనతను సొంతం చేసుకుంది. 1967 నుంచి కివీస్ పర్యటనకు వెళుతున్న టీమిండియా ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే 3-1 తేడాతో సిరీస్ విజయాన్ని (2008-09 పర్యటనలో) అందుకుంది. తాజాగా 4-1తో అతిపెద్ద సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుని నయా చరిత్రను సృష్టించింది. చివరి మ్యాచ్‌లో బౌలింగ్, బ్యాటింగ్ విభాగంలో సమష్టిగా రాణించి విజయాన్నందుకున్న రోహిత్ సేన నాలుగో వన్డే పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియాను హైదరాబాదీ బ్యాట్స్‌మన్ అంబటి రాయుడు (90, 113 బంతులు, 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ (45, 64 బంతులు, 4 ఫోర్లు)లు అద్భుత భాగస్వామ్యంతో ఆదుకున్నారు. చివర్లో కేదార్ జాదవ్ (34, 45 బంతుల్లో, 3ఫోర్లు), పాండ్య (45, 22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు)లు రాణించడంతో భారత్ ఆతిథ్య జట్టుకు 253 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం ఈ లక్ష్యఛేదనకు బరిలోకి దిగిన కివీస్ 217 పరుగులకు కుప్పకూలింది. దీంతో రోహిత్ సేన 35 బంతులు మిగిలి ఉండగానే 35 పరుగులతో విజయం సాధించింది. అంతకు ముందు లక్ష్యఛేదనకు దిగిన కివీస్‌ను షమీ దెబ్బతీశాడు. ఓపెనర్లు హెన్రీ నికోల్స్(8), కొలిన్ మున్రోలను పెవిలియన్‌కు చేర్చాడు. ఆ మరుసటి ఓవర్లోనే రాస్ టేలర్‌ను పాండ్య ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. ఈ క్రమంలో లాథమ్, విలియమ్సన్‌లు భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. క్రీజులో పాతుకుపోతూ ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడిని పార్ట్‌టైమ్ బౌలర్ కేదార్ జాదవ్ విడగొట్టాడు. కెప్టెన్ విలియమ్సన్(39)ను క్యాచ్‌ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దీంతో ఐదో వికెట్‌కు నమోదైన 67 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. మరికొద్ది సేపటికే లాథమ్(37), గ్రాండహోమ్(11)లను చాహల్ ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేర్చాడు. మరో 41 పరుగుల అనంతరం నీషమ్(44) రనౌట్‌గా వెనుదిరిగాడు. చివర్లో సాట్నర్(22), అశ్లే(10), బోల్ట్(1)ల వికెట్లు కూడా త్వరగా కోల్పోవడంతో కివీస్ ఇన్నింగ్స్ ముగిసింది. భారత బౌలర్లలో చాహల్‌కు మూడు, పాండ్య, షమీలకు రెండు వికెట్లు పడగా.. భువనేశ్వర్, జాదవ్‌లకు తలో వికెట్ దక్కింది.

గట్టెక్కించిన రాయుడు-శంకర్

భారత ఇన్నింగ్స్‌లో కివీస్ పేసర్ ద్వయం హెన్రీ, బౌల్ట్‌లు పదునైన బంతులతో చెలరేగడంతో భారత టాప్-4 బ్యాట్స్‌మెన్ రోహిత్ శర్మ(2), శిఖర్ ధావన్ (6), శుభ్‌మన్ గిల్(7), ఎంఎస్ ధోని(1)లు స్వల్పస్కోర్లకే పెవిలియన్ క్యూ కట్టారు. దీంతో భారత్ 18 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితిలో అంబటి రాయుడు-విజయ్ శంకర్ భారత ఇన్నింగ్స్‌ను గట్టెక్కించారు. ఈ క్రమంలో హాఫ్ సెంచరీకి చేరువైన విజయ్ శంకర్(45, 64 బంతులు, 4 ఫోర్లు) లేని పరుగుకు ప్రయత్నించి రనౌట్‌గా పెవిలియన్ చేరాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన జాదవ్‌తో రాయుడు ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ దశలో రాయుడు 86 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో కెరీర్‌లో 10వ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సెంచరీకి చేరువయ్యే క్రమంలో అనవసర షాట్‌కు ప్రయత్నించి రాయుడు(90) క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దీంతో ఆరో వికెట్‌కు నమోదైన 74 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే మరో 13 పరుగుల వ్యవధిలో జాదవ్ (34, 45 బంతుల్లో, 3ఫోర్లు)ను హెన్రీ బౌల్డ్ చేశాడు.

కసి కసిగా.. పాండ్య!

అనంతరం క్రీజులోకి వచ్చిన హార్దిక్ పాండ్యా వచ్చి రావడంతోనే కసిగా ఆడాడు. ముఖ్యంగా అస్లే వేసిన 47 ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్స్‌లతో చెలరేగాడు. వచ్చిన బంతి వచ్చినట్టు బౌండరీకి తరలించాడు. 22 బంతుల్లో 2 ఫోర్లు 5 సిక్స్‌లతో 45 పరుగులు చేసిన పాండ్య.. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలతో నిషేధానికి గురై ఆటకు దూరమైన పాండ్య.. ఆడుతున్నంత సేపు ఆ కసిని బంతి మీద చూపించినట్లు కనిపించింది. దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తన సత్తా ఏంటో నిరూపించి జట్టుకు తన అవసరం ఏంటో గుర్తు చేశాడు.

పిచ్ ఏదైనా.. రెచ్చిపోతారు : సచిన్



కోల్‌కతా: ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా ఫేవరెట్ అనడంలో తనకు సందేహమేమీ లేదని దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ అన్నాడు. కోహ్లిసేనకు ప్రపంచంలోని ఏ దేశంలోనైనా, ఏ పిచ్‌పై అయినా పోటీపడే సామర్థ్యం ఉందన్నారు. దక్షిణాఫ్రికా (5-1), ఆస్ట్రేలియా (2-1), న్యూజిలాండ్ (4-1)పై భారత్ ద్వైపాక్షిక వన్డే సిరీసులను కైవసం చేసుకున్న విషయాన్ని సచిన్ గుర్తుచేశాడు. క్రీడల్లో మహిళలు దేశానికి పేరు తీసుకొస్తున్నారని కొనియాడారు. స్వప్న బర్మన్, ద్యుతి చంద్, హిమదాస్ మహిళల సాధికారతకు నిలువుటద్దాలని సచిన్ పేర్కొన్నాడు. 'టీమిండియాలో చక్కని సమతూకం ఉంది. ఈ జట్టు ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఎక్కడైనా పోటీపడగలదు. ప్రదర్శనలు చూస్తుంటే భారత్ ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. ఇంగ్లండ్ గడ్డపై త్వరగా జోరందుకోవడం ముఖ్యం. ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ కఠిన పోటీదారు. న్యూజిలాండ్ సైతం అలాగే కనిపిస్తోంది. ప్రస్తుత సిరీస్‌లో కివీస్ ఇబ్బంది పడ్డా సరే ఆ జట్టు చాలా బాగుంది. ఎవరో ఒకరు నిలబడితే చాలు. స్టీవ్‌స్మిత్, డేవిడ్ వార్నర్ జట్టులోకి వస్తే ఆసీస్ బలపడుతుంది. కానీ వన్డేల్లో కొన్ని ఓవర్లలో మ్యాచ్‌లు మలుపు తిరుగుతాయి. అందుకే ఆ జట్టుకు 50 శాతం అవకాశమే ఉంది' అని సచిన్ అన్నారు.

ఒత్తిడితోనే చిత్తు : కేన్



వెల్లింగ్టన్: ఛేదనలో ఒత్తిడి తమను చిత్తుచేసిందని న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్ అన్నాడు. టీమిండియాతో ఐదో వన్డేలో ఓటమి తర్వాత మీడియాతో మాట్లాడాడు. కష్టమైన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తమ జట్టు నిరంతరం ఒత్తిడికి గురైందని పేర్కొన్నాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 252 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఒడుదొడుకులకు గురైన కివీస్ విజయానికి 35 దూరంలో నిలిచిపోయింది. 'పిచ్ చాలా భిన్నంగా ఉంది. భారత్ గెలుపునకు అవసరమైన స్కోరు చేసింది. నిజం చెప్పాలంటే కొన్ని ఎక్కువ పరుగులే చేసింది. ఛేదించడం కష్టమని తెలుసు. అనవసర సమయాల్లో వికెట్లు చేజార్చుకున్నాం. టీమిండియా మాత్రం అలా చేయలేదు. రాయుడు అద్భుతంగా ఆడి 90 పరుగులు చేశాడు. ఆ తర్వాత మాపై ఒత్తిడి పెంచారు. ఇది మాకో పాఠం. టామ్ లేథమ్, నేను మ్యాచ్‌ను ఛేదనను ముందుకు తీసుకుపోవాల్సింది. టీమిండియా మాకు పాఠం నేర్పింది. సిరీస్ విజయానికి వారు అర్హులు. సిరీస్‌లో ఒత్తిడికి తలొగ్గకుండా ముందుకు పోవాలనుకున్న ప్రతిసారీ భారత్ మరింత ఒత్తిడి పెంచింది' అని కేన్ విలియమ్సన్ అన్నాడు.

చలి చంపుతోంది

- గడ్డకట్టిన మంచు, ఎముకలు కొరికే చలిగాలులు
- అమెరికా, ఐరోపాలలో రెండు డజన్ల మందికిపైగా మృతి

వాషింగ్టన్/ బ్రస్సెల్స్ : వాతావరణ మార్పుల ప్రభావం అమెరికా, ఐరోపా దేశాలలోనే కాక ఆల్ప్స్ పర్వతాలు, హిమాలయా పర్వత ప్రాంతాలలో గణనీయంగా కనిపిస్తోంది. అనేక ప్రాంతాలలో మంచుగడ్డకట్టుకుపోయి ఎముకలు కొరికే చలిగాలులు వీస్తున్నాయి. అమెరికా, ఐరోపా దేశాలలోని పలు ప్రాంతాలలో రహదారులపై మంచు గడ్డకట్టడంతో రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దక్షిణ ధ్రువ ప్రాంతంలో అనేక దశాబ్దాలనాటి కంటే నేడు చలి భరించలేనంతగా ఉన్నది. అమెరికాలోని నార్త్ డకోటా, సౌత్ డకోటా, మిన్నిసోటా, విస్కాన్‌షిన్, అయోవా, ఇలినాయిస్ నగర ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు మైనస్ 33 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయని అధికారిక నివేదిక తెలుపుతోంది. చికాగోలో సైతం ఉష్ణోగ్రత మైనస్ 31 డిగ్రీలకు పడిపోయింది. 1985 తరువాత మంచు తుపాను కురిసి ప్రజలను భయభ్రాంతులను చేసిన సందర్భం ఇదే. చేతులూ, కాళ్లు ముడుచుకుపోతున్నాయి. శరీరం బయటకు వెళితే గడ్డకట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. చలిగాలులు విపరీతంగా వీస్తున్నాయి. ఆస్ట్రేలియాలోని కొన్ని ప్రాంతాలలో తీవ్రమైన ఎండలు ఉండగా, మరికొన్ని ప్రాంతాలను వరదలు ముంచెత్తుతున్నాయి. వాతావరణంలో పెనుమార్పులు రావడమే ఇందుకు కారణమని ప్రపంచ వాతావరణ పరిశోధనా కేంద్రం తెలిపింది.



అమెరికాలో..



హిమాచల్‌ప్రదేశ్‌లో..

అత్యంత ప్రమాదకరమైన మంచు, చలి అమెరికా ఉత్తరప్రాంతాన్ని వణికిస్తోంది. రెండు డజన్ల మందికిపైగా మరణించారు. వందలాది మంది కాళ్లూ, చేతుల వేళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆర్కటిక్ సముద్ర ప్రాంతం నుంచి తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. దక్షిణ మిన్నిసోటా ప్రాంతంలో ఉష్ణోగ్రతలు మైనస్ 53.9 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఈ చలిగాలుల వల్ల నిముషాల్లో మనిషి గడ్డకట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. మంచుయుగం మళ్లీ రావడానికి ఇప్పుడున్న వాతావరణ పరిస్థితులు దోహదం చేస్తాయని పర్యావరణ పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారతదేశంలోని జమ్మూ-కాశ్మీర్, హిమాచల్ ప్రాంతంలో అత్యంత భారీ వర్షాలు, మంచు కురిసే అవకాశం ఉందని ఫలితంగా మంచు గడ్డలు విరిగిపడి తీవ్ర చలిగాలులు వీస్తాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఐరోపాలోని ఆల్ప్స్ పర్వత ప్రాంతాలలో జనవరి మొదటి పక్షంలో మంచు దట్టంగా పేర్కొనిపోయింది. శతాబ్దంలో ఒకసారి ఇట్లావచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఢిల్లీలో 13 ఏళ్ల తరువాత దీర్ఘకాలంగా చలిగాలులు వీస్తున్న సంవత్సరం ఇదే. ఇటలీలో రహదారులు మంచుతో నిండిపోవడంతో వేలాది వాహనాలు ఇరుక్కుపోయాయి. ముఖ్యంగా ఏ 22 రహదారిపైన శనివారం వేలాది వాహనాలు మంచులో కూరుకుపోవడంతో అందులో ప్రయాణిస్తున్న 200 మందికిపైగా ప్రజలను అగ్నిమాపక దళాలు రక్షించాయి. ఆస్ట్రియా వైపు వెళ్లే ఈ రహదారిలో అనేక వరుసలలో వాహనాలు నిలిచిపోయాయి. అనేక గంటలపాటు వాహనాలలో ప్రయాణికులు అలాగే ఉండిపోవడంతో ప్రాణాపాయం కలుగుతుందని అగ్నిమాపక దళాల ప్రతినిధి అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియాలోని ఈశాన్య ప్రాంతంలో గత దశాబ్ది కాలంలో ఏనాడు లేనంతగా భారీ వర్షాలు గత కొద్దిరోజులుగా కురుస్తున్నాయి. ఈశాన్య ప్రాంతం క్వీన్స్‌లాండ్‌లో టౌన్స్‌విల్లే నగరంలో భారీ వర్షాల కారణంగా 20వేల గృహాలు మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. అనేక ప్రాంతాలలో సైన్యం కొన్ని పదుల వేల ఇసుక సంచులను ప్రజలకు సరఫరా చేసి ఇళ్లు మునిగిపోకుండా చర్యలు చేపట్టింది. ఇంగ్‌హాం పట్టణంలో 24 గంటల్లో 506 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.